

'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50



- చెట్ల కొమ్మలు విరిగిపడుతూ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దెబ్బ
- డ్రైనేజీలు, ఇతర తవ్వకాలతో దెబ్బ తింటున్న అండర్‌గ్రౌండ్ కేబుళ్లు
- ఇంటర్నెట్, టీవీ కేబుళ్లు, ఫ్లెక్సీలతోనూ ఇబ్బందులు
- నిర్వహణ లోపాలు, నాసిరకం పరికరాలు, సిబ్బంది నిర్లక్ష్యంతో సమస్యలు
- పలు ప్రాంతాల్లో గంటల కొద్దీ నిలిచిపోతున్న కరెంటు సరఫరా
- తీవ్రంగా ఇబ్బందిపడుతున్న జనం
- లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నా ఫలితం అంతంతే

కరెంట్.. గాల్లో దీపం

నగరంలో చిన్నపాటి ఈదురుగాలికే తెగుతున్న తీగలు

సాక్షి, హైదరాబాద్



వారం రోజుల క్రితం ఈదురుగాలితో కూడిన వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి పడి తీగలు తెగిపోవడంతో.. బోడుప్పల్, నారపల్లి, చెంగిచెర్ల, పీర్జాదిగూడలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. గంటల తరబడి సరఫరా పునరుద్ధరించకపోవడంతో స్థానికులు ఆగ్రహంతో సమీపంలోని సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.



పదిరోజుల కింద వాటర్‌బోర్డు అధ్వర్యంలో మంచినీటి పైపు లైన్ కోసం రాత్రిపూట తవ్వకాలు చేపట్టగా.. మయూరినగర్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33/11 కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్ దెబ్బతింది. ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



పదిహేను రోజుల క్రితం బాచుపల్లిలోని 33/11కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. పలు ఫీడర్ల పరిధిలోని కాలనీలకు పది గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనితో స్థానికులు సబ్‌స్టేషన్ ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు.

→ ...గ్రేటర్ హైదరాబాద్ నగరంలో తరచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయాలకు చిన్న ఉదాహరణలివి. చిన్న వాన పడినా చాలు.. నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కొన్నిచోట్ల గంటలకు గంటలు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ వ్యవస్థలు సరిగా లేకపోవడానికి తోడు అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, లోపభూయిష్టమైన ఎర్తింగ్ సిస్టం, స్తంభాలకు వేలాడుతున్న టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు.. వెరసి విద్యుత్ సరఫరాలో సమస్యలకు కారణం అవుతున్నాయి. ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

→ తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తోంది. నెలకు కనీసం 2,500 కొత్త కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. పదేళ్ల క్రితం 1,800 నుంచి 2,200 మెగావాట్లు ఉన్న విద్యుత్ డిమాండ్.. ప్రస్తుతం 3,900 నుంచి 4,000 మెగావాట్లు దాటింది. డిమాండ్ మేరకు సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టినా.. అంతరాయాలు మాత్రం ఆగడం లేదు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న చాలా మంది ఇంజనీర్లకు లైన్లపై సరైన అవగాహన లేకపోవడంతో.. అత్యవసర పరిస్థితుల్లో తలెత్తిన సాంకేతిక లోపాలను గుర్తించలేకపోతున్నారనే విమర్శ ఉంది. ఎవరైనా స్థానికులు ఫలానా చోట వైరు తెగిందనో? ట్రాన్స్‌ఫార్మర్ పేలిందనో? విద్యుత్ స్తంభం నేల కూలిందనో ఫోన్‌చేసి చెప్తేగానీ సమస్యను గుర్తించలేని పరిస్థితి. అంతేకాదు లైన్ల నిర్వహణ, పునరుద్ధరణ పనుల కోసం ఏటా రూ.వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారు. అయినా ఇబ్బందులు తప్పడం లేదు.

క్షేత్రస్థాయిపై అవగాహన లేక..




జనవరి నుంచి మే వరకు సరఫరాలో లోపాలు, అంతరాయాలివీ..

అంశం	2023లో	సమయం (గంటల్లో)	2024లో	సమయం (గంటల్లో)
33 కేవీ బ్రేక్‌డౌన్స్	1,499	3191.44	841	1718.05
33 కేవీ ట్రిప్పింగ్స్	10,059	2423.43	5,939	1450.42
11 కేవీ బ్రేక్‌డౌన్స్	3,992	9094.14	3,402	7113.33
డీటీఆర్ ఫెయిల్యూర్స్	14,833	-	13,736	-
పీటీఆర్ ఫెయిల్యూర్స్	27	-	26	-

సంస్కరణలు చేపట్టినా.. సద్దుమణగని సమస్యలు

పరిపాలనలో సౌలభ్యం, విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం కోసం డిస్కం వేర్వేరు (ఆపరేషన్స్, సీబీడీ లైన్స్ వింగ్, కన్‌స్ట్రక్షన్ అండ్ ప్రాజెక్ట్స్) విభాగాలను ఏర్పాటు చేసింది. ఆపరేషన్స్ ఏఈ బిల్లింగ్, రెవెన్యూ వసూళ్లకే పరిమితం అయ్యేవారు. ఏదైనా విపత్తు జరిగితే పరిష్కార బాధ్యతను సీబీడీ గ్యాంగ్ నిర్వర్తించేది. ఇక కొత్త సబ్‌స్టేషన్లు, లైన్ల విస్తరణ, భూగర్భ కేబుళ్ల ఏర్పాటు వంటి పనులను మాస్టర్ ప్లాన్ విభాగం చూసుకునేది. ఇలా ఎవరి పరిధిలో వాళ్లు ఉండటంతో.. విపత్తుల సమయంలో బ్రేక్‌డౌన్స్, సరఫరా పునరుద్ధరణ విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముషారఫ్ ఫారూఖీ సీఎండీగా బాధ్యతలు స్వీకరించాక.. సంస్థలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. ఆపరేషన్స్ ఏఈలకు కూడా అంతరాయాలను పరిష్కరించే బాధ్యత అప్పగించారు. గతంలో లైన్ల పునరుద్ధరణకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) పేరుతో గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిపేసేవారు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి చెప్పారు. అయినా అంతరాయాల సమస్య తగ్గడం లేదు.



చినుకు పడితే చీకటే..



రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లో తరచూ కరెంటు సమస్య వస్తోంది. చినుకుపడితే చాలు చీకటి అవుతోంది. అంతరాయాలు లేకుండా చూడాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదు. ఇంట్లో కరెంట్ లేక ఉక్కపోత, దోమలతో కంటిమీద కునుకు లేకుండా పోతోంది. - సదానంద్, బుద్వేల్

విద్యుత్ సరఫరాలో సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలి?

సమస్య పరిష్కారానికి రిటైర్డ్ ఇంజనీర్ల సూచనలేమిటి?

- IIలో



నగరంలో శిశువుల విక్రయాలకు పాల్పడుతూ కొందరు నకిలీ వైద్యులు పట్టుబడుతున్నారు. ఇలాంటి వారిని ఏరిపారేయడానికి కొత్తగా ఏర్పడిన తెలంగాణ వైద్య మండలి రాష్ట్రవ్యాప్తంగా వరుస దాడులు నిర్వహిస్తోంది.

ప్రాణాలతో చెలగాటం!

- వివరాలు 9లో

సిక్స్ ప్యాక్ అనగానే.. ప్రస్తుత తరానికి ఎంతో క్రేజ్. ఆ పేరు చెప్పగానే శరీరంలోని నరాలన్నీ జివ్వుమన్నట్లు అవుతుంది.. కానీ అతిగా చేస్తే ఆరోగ్యానికి అనర్థమే అంటున్నారు వైద్యులు.. ఇటీవల పలువురు హీరోలు అతిగా వ్యాయామం చేసి అనారోగ్యం పాలవ్వడమే దీనికి చక్కటి ఉదాహరణ. అసలు సిక్స్ ప్యాక్ కథేంటి? వైద్యులు ఏమంటున్నారు? తెలుసుకుందాం..

సిక్‌ప్యాక్!

లుక్ కోసమైతే ఫసక్కే



- వివరాలు 11లో



BE CAREFULL

సెల్ఫీ జోష్.. డేంజర్ బాస్

- నగరంలో పెరిగిపోతున్న సెల్ఫీల క్రేజ్
- కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్న యువత
- గతేడాది దేశవ్యాప్తంగా 190 మరణాల నమోదు
- హైదరాబాద్‌లోనూ అధిక సంఖ్యలో ఘటనలు
- ఇతరులకు ఇబ్బందిగా మారుతున్న వైనం
- సైబర్ నేరగాళ్లకూ ఉపకరిస్తున్న ఈ తరహా ఫొటోలు
- పలు జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు

2024 జనవరి 7

→ ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలుడు (16) అల్వాల్‌లో ఉంటున్న తన బాబాయి ఇంటికి చుట్టపు చూపుగా వచ్చాడు. అడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన ఈ బాలుడు బొల్లారం బ్యారెక్ సమీపంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్దకు చేరుకున్నాడు. వెనుక నుంచి రైలు వస్తుండగా సెల్ఫీ తీసుకునే ప్రయత్నం చేశాడు. ఇంతలోనే రైలు దూసుకు రావడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు.

2024 జనవరి 29

హైదరాబాద్ బహదూర్‌పురకు చెందిన అబ్దుల్ రెహ్మాన్ (23) అబిడ్స్‌లోని కళ్లజోళ్ల దుకాణంలో పనిచేస్తున్నాడు. తనస్నేహితులతో కలిసి ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌ల వద్దకు వెళ్లాడు. అక్కడ సెల్ఫీ తీసుకునే ప్రయత్నాల్లో రైలు పట్టాల మీదకు చేరుకున్నాడు. అదే సమయంలో దూసుకు వచ్చిన ఎంఎంటీఎస్ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలతో చనిపోయాడు.

2024 ఏప్రిల్ 5

→ ఏపీకి చెందిన ఎస్.అనిల్ కుమార్ (27) భార్యతో కలిసి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అర్ధరాత్రి వేళ తన స్నేహితుడు అజయ్‌తో కలిసి కేబుల్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. తమ ద్విచక్ర వాహనాన్ని వంతెనపై నిలిపిన ఈ ద్వయం సెల్ఫీలు తీసుకుంటోంది. ఇంతలో ఇనార్బిట్ మాల్ వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అనిల్ చికిత్స పొందుతూ అసువులు బాశాడు.

2024 జూన్ 15

హైదరాబాద్‌కు చెందిన ఉదయ్‌కుమార్ (17), శివదీక్షిత్ (17) మరో బాలుడు (17) ఇంటర్ పూర్తి చేశారు. బాలుడి పుట్టినరోజు కావడంతో శుక్రవారం అర్ధరాత్రి కేకుకోసిన అనంతరం మాదాపూర్ కేబుల్ బ్రిడ్జికి బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున 2.18 ప్రాంతంలో ముగ్గురూ స్కూటీపైనే ఉండి రీల్స్ చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఉదయ్, దీక్షిత్ అక్కడికక్కడే మరణించగా.. బాలుడు గాయపడ్డాడు.

సాక్షి, హైదరాబాద్

సెల్ఫీ.. బాగా ప్రాచుర్యం పొందిన, ఎవరికి వారు స్వయంగా తీసుకునే సెల్ ఫోన్ ఆధారిత ఫొటో. దీనికోసం ప్రత్యేక సెల్ ఫోన్లు, స్టిక్కులతో పాటు కోర్సులు కూడా అందు బాటులోకి వచ్చాయంటేనే వాటికి ఉన్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా కొంతమంది యువ తలో ఈ క్రేజ్ విపరీత స్థాయిలో ఉంటోంది. అయితే ఈ క్రేజ్ కొన్ని సందర్భాల్లో వారి ప్రాణాలనే హరి స్తోంది. ఈ సెల్ఫీలు తీసుకునే ప్రయత్నాల్లో అనేక మంది ప్రమాదాలకు గురై చనిపోతున్నారు. ఇటీవలి కాలంలో ఈ తరహా ఘటనలు అధిక సంఖ్యలో చోటు చేసుకుంటున్నాయి. దేశంలో గత ఏడాది సెల్ఫీ సంబంధిత మరణాలు 190 నమోదయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఉదంతాలు 55 చోటు చేసుకున్నట్లు వికీపీడియా గణాంకాలు చెప్తున్నాయి. ప్రపంచంలో ఇలాంటి ప్రమాదాలు భారత్‌లోనే ఎక్కువని స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్‌లోనూ ఇలాంటి మరణాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. నగరంలో 2016లో తొలి సెల్ఫీ డెత్ నమోదైంది. జూ పార్క్‌లో సెల్ఫీ తీసుకునే ప్రయత్నాల్లో కాలుజారి పడటంతో జియాగూడ వాసి మంజీత్ చౌదరి కన్నుమూశాడు.

అత్యుత్సాహంతోనే చేటు..

సెల్‌ఫోన్లు వచ్చినప్పటి నుంచే ఈ సెల్ఫీల జాఢ్యం మొదలవలేదు. ఎప్పుడైతే వాటిల్లో ఫ్రంట్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయో అప్పట్నుంచీ సెల్ఫీ క్రేజ్ ప్రారంభమై, క్రమంగా మంచి రెజుల్యూషన్ (ఫొటో స్పష్టంగా కన్పిస్తుంది)తో కూడిన ఫొటోలు వచ్చే ఫ్రంట్ కెమెరాలు కూడా వస్తుండటంతో ఈ సెల్ఫీల పిచ్చి మరింత ముదిరి పోయింది. సెల్ఫీ మోజులో ఉంటున్న వారిలో ఎక్కువగా యువతే ఉంటున్నారు. ఏదో రకంగా విభిన్నమైన సెల్ఫీని తీసుకోవాలనే తాపత్రయంలో ప్రమాదకర పరిస్థితుల్ని పట్టించుకోకుండా సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. వెనుక నుంచి రైలు వస్తుండగానో, వాహనాలు డ్రైవ్ చేస్తూనో, జలపాతాల వద్దో, బీచ్‌ల్లోనో, ఎత్తైన ప్రదేశాల్లోనో సెల్ఫీలకు ప్రయత్నిస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.



సోషల్ మీడియా ప్రాచుర్యం పొందిన తర్వాత..

ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియాలు ప్రాచుర్యం పొందిన తర్వాత సెల్ఫీ ఫీవర్ మరింత ఎక్కువైంది. ఆయా సోషల్ మీడియాల్లో ఎవరి ప్రొఫైల్ పిక్ చూసినా, అప్‌లోడ్ చేసిన ఫొటోలు పరిశీలించినా సగానికి సగం సెల్ఫీలే కనిపిస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు, ఒకరి ప్రొఫైల్స్ చూసి ఇంకొకరు... ఇలా అంతా సెల్ఫీల బాటపడుతున్నారు. ఇటీవలి కాలంలో వీటితో పాటు రీల్స్ (షార్ట్ వీడియోలు) కూడా సోషల్ మీడియాల్లో ఎక్కువగా కన్పిస్తుండటం గమనార్హం. మరోపక్క ఈ సెల్ఫీలను మార్ఫింగ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడే సైబర్ నేరాలు పెరుగుతుండటం గమనార్హం.

'నో పార్కింగ్' తరహాలో..

ప్రజల్లో ముఖ్యంగా యువతలో మితిమీరిపోతున్న ఈ సెల్ఫీ పిచ్చి ప్రభుత్వ విభాగాలకూ కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలోనే 'నో పార్కింగ్' ప్రాంతాల తరహాలో మహారాష్ట్రలో 'నో సెల్ఫీ' ప్రాంతాలు అమల్లోకి వచ్చాయి. కొన్నాళ్ల క్రితం మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన కుంభ్‌మేళాలో సెల్ఫీ ప్రియుల కారణంగా అనేక ప్రాంతాలు ఇరుకైన ప్రదేశాలుగా మారిపోయి ఇతరులకు ఇబ్బందులు కలిగించాయి. ఆయా ప్రాంతాలను దాటి వెళ్లడానికి భక్తులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో కుంభమేళాను అధికారులు 'నో సెల్ఫీ జోన్'గా ప్రకటించాల్సి వచ్చింది. సెల్ఫీలను నిరోధించడం కోసం ముంబై పోలీసులు నగరంలోని 16 ప్రాంతాలను 'నో సెల్ఫీ జోన్స్'గా ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ సైతం ఏర్పాటు చేశారు. ఇలాంటి చర్యలు హైదరాబాద్‌లోనూ తీసుకోవాలనే అభిప్రాయంగా గట్టిగా వ్యక్తమవుతోంది.



సెల్ఫీకి ముందు సప్త ప్రశ్నలు

సెల్ఫీలు, రీల్స్ వల్ల ప్రమాదాలకు గురికాకుండా ఉండటం, అవి ఇతరులకు ఇబ్బందికరంగా మారకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరికి వారు కొన్ని ప్రశ్నలు వేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

1. సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తున్న ప్రాంతాల్లో ఫొటోగ్రఫీకి అనుమతి ఉందా? **(మ్యూజియాలు, కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు, విద్యా సంబంధ వ్యవహారాల్లో)**
2. ఈ ప్రదేశంలో సెల్ఫీ కారణంగా తనకు కానీ తన చుట్టు పక్కల వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందా? **(జూ పార్కులు, థీమ్ పార్కులు, జనసమ్మర్ధ ప్రాంతాలు, మాల్స్, సబ్‌వేస్, విమానాశ్రయాలు, రైల్వే ట్రాక్‌లు, వాహనాలు నడుపుతూ)**
3. సెల్ఫీ తీసుకుంటూ నేను ఎదుటివారు చూస్తున్న వాటికి అడ్డం వస్తున్నానా? ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్నానా? **(థీమ్ పార్కులు, సినిమా హాళ్లు, సందర్శనీయ ప్రాంతాలు, కొన్ని కార్యక్రమాలు)**
4. సెల్ఫీ తీసుకునే ప్రయత్నాల్లో మరో వర్గానికి చెందినవారి మనోభావాలు దెబ్బతీస్తున్నామా? **(ప్రార్థనా స్థలాలు)**
5. సెల్ఫీ తీసుకుంటున్న ప్రాంతంలో కంటికి కనిపించని ముప్పు పొంచి ఉందా? **(జూ పార్క్‌లు, జాతీయ పార్కులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎత్తైన భవనాలు/ప్రాంతాలు, ఓడలు, సబ్ వేస్, కదులుతున్న వాహనాలు, రహదారులు)**
6. సెల్ఫీ తీసుకోవడం సమంజసమేనా? **(ప్రమాదం జరిగిన ప్రాంతాలు, అంతిమ యాత్రలు)**
7. నేను తీసుకుంటున్న సెల్ఫీ ఇతరులకు అభ్యంతకరం అవుతుందా? **(పార్టీలు, రెస్ట్‌రూమ్స్ సమీపంలో, బీచ్‌ల్లో)**

సమస్య ఉంటే ఈ నంబర్లకు కాల్ చేయండి

సాక్షి, హైదరాబాద్: ఈదురుగాలులతో కూడిన వర్షానికి తరచూ ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. చెట్ల కొమ్మలు విరిగి పడుతుండటంతో వైర్లు తెగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలుతున్నాయి. దీనితో గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. అలాంటి సమయంలో వినియోగదారులు 1912 కాల్ సెంటర్/ మొబైల్‌యాప్‌లో/ స్థానిక లైన్‌మన్లకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు ఆస్కారం ఇవ్వకూడదనే ఉద్దేశంతో సర్కిళ్ల వారీగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

సర్కిల్ పేరు	ఫోన్ నంబర్
హైదరాబాద్ సెంట్రల్	9491629047
హైదరాబాద్ సౌత్	9491628269
సికింద్రాబాద్	9491629380
బంజారాహిల్స్	9491633294
సైబర్‌సిటీ	9493193149
రాజేంద్రనగర్	7382100322
సరూర్‌నగర్	7901679095
హబ్సిగూడ	9491039018
మేడ్చల్	7382618971
వికారాబాద్	9493193177



అంతరాయాలను బాగా తగ్గించాం

ముషారఫ్ ఫారూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్

విద్యుత్ సరఫరా, తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు, చేపట్టిన అభివృద్ధి పనులపై గతంలో నెలకోసారి రివ్యూలు నిర్వహించేవారు. ప్రస్తుతం రోజు ఉదయం 8.30 గంటలకే టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నాం. బ్రేక్ డౌన్లు, గృహజ్యోతి దరఖాస్తులు, సేవల్లో లోపాలపై ఆన్‌లైన్‌లో అందుతున్న ఫిర్యాదులపై చర్చిస్తున్నాం. అంతర్గత సామర్థ్యం పెంపు, నష్టాల నియంత్రణపైనా చర్యలు చేపట్టాం. అత్యవసర పరిస్థితుల్లో సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు, ఏడీ ఈలు, ఏఈలు, జూనియర్ లైన్‌మెన్లు, ఆర్టిజన్లు అంతా అందుబాటులో ఉండేలా ఆదేశాలిచ్చాం. అర్ధరాత్రి, భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతున్నాం. బ్రేక్‌డౌన్, ఇతర అంతరాయాలను చాలా వరకు తగ్గించాం.

సరఫరా మెరుగుపడాలంటే ఏం చేయాలి?



రిటైర్డ్ విద్యుత్ ఇంజనీర్ రామకృష్ణ సూచనలివీ..

→ విద్యుత్ స్తంభాల పాలిట ఉరితాళ్లుగా మారిన టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లను తక్షణమే తొలగించాలి.

→ లైన్ టు లైన్ తనిఖీలు చేపట్టి అనధికారిక కనెక్షన్లను తొలగించాలి. అంతర్గత భారీ నష్టాల నుంచి సంస్థను గట్టెక్కించాలి.

→ ఏబీ స్విచ్‌ల నాణ్యతను పరిశీలించాలి. సరఫరాలో హెచ్చుతగ్గుల నియంత్రణ, షార్ట్ సర్క్యూట్ల నియంత్రణ కోసం ఎర్తింగ్ సిస్టంను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి.

→ చెట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూగర్భ కేబుళ్లు, ఎయిర్ బంచ్‌డ్ కేబుళ్లు ఏర్పాటు చేస్తే.. ఈదురుగాలులతో సరఫరా నిలిచే సమస్య తలెత్తదు.


→ భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా డక్ట్ సిస్టం ఏర్పాటు చేయాలి.

→ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. అక్కడి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించొచ్చు.

→ ఏఈలు, ఏడీఈలు కేవలం కొత్త కనెక్షన్ల జారీ, మీటర్ రీడింగ్‌లపైనే దృష్టి సారిస్తున్నారు. వారు సాంకేతిక అంశాలపైనా దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలి.

→ కోర్‌సిటీలో ఇప్పటికీ నిజాం కాలం నాటి లైన్లే ఉన్నాయి. చాలాచోట్ల ఒకే స్తంభం నుంచి ఎల్‌టీ, హెచ్‌టీ లైన్లు వెళ్తున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు వీటిని వేరు చేయాలి.

→ కొందరు జూనియర్ లైన్‌మన్లు.. అనధికారికంగా ఎలాంటి అనుభవం, అవగాహన లేని ప్రైవేటు వ్యక్తులను అసిస్టెంట్లుగా నియమించుకుని.. వారితో పనులు చేయిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి, చర్యలు తీసుకోవడం ద్వారా సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడొచ్చు.



సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 86

సోమవారం 17-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పరిపూర్ణ ఆరాధన హజ్జ్

నేడు బక్రీద్‌ను పురస్కరించుకొని ప్రత్యేక కథనం - 13లో



స్మృతి సూపర్ సెంచరీ

తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై నెగ్గిన భారత మహిళల జట్టు - 14లో



ఉగ్రవాదాన్ని అణచివేయండి

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా భద్రతా దళాలను ఆదేశించారు.

- వివరాలు 6లో

బాబ్రీ కాదు..

12వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకంలో బాబ్రీ మసీదు సహా అనేక కీలకాంశాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించింది.

- వివరాలు 6లో



ప్రాదేశిక సమగ్రతే..

ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు దిశగా ఏ ఒప్పందానికైనా ఉక్రెయిన్ సమగ్రతే కీలకమని 80 దేశాలు తేల్చిచెప్పాయి.

- వివరాలు 6లో



క్లెయిమ్ ఎలా?

ఒకటికంటే ఎక్కువ పాలసీలు ఉన్నప్పుడు క్లెయిమ్ ఎలా చేసుకోవాలో నిపుణుల సూచనలతో కథనం

- వివరాలు 15లో

న్యూస్‌రీల్

ట్రాఫిక్‌పై డ్రోన్ కన్ను!

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో 'థర్డ్ ఐ ట్రాఫిక్ మానిటరింగ్ డ్రోన్' అందుబాటులోకి వచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద ఐకియా, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, హఫీజ్‌పేట, హైటెక్ సిటీ, మాదాపూర్, రాయదుర్గం తదితర ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఆదివారం ఈ డ్రోన్‌ను వినియోగించారు.

- వివరాలు 16లో

కాట్నపల్లి ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి సమీపంలో బాలికపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితుడికి సత్వరమే శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు తెలిపారు.

- వివరాలు 5లో


దశలవారీగానే మాఫీ!

వచ్చే నెల 15 నుంచి రైతుల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించేందుకు సర్కారు కసరత్తు

మాఫీ కోసం రూ. 35 వేల కోట్లకుపైగా అవసరమని అంచనా

ఈ సీజన్ 'రైతు భరోసా'కు రూ.10,500 కోట్లు.. రైతుబీమా, పంటల బీమాకు మరో రూ.4 వేల కోట్లు..

రెండు నెలల్లో రూ.50 వేల కోట్ల మేర నిధులు కావాలి



'రైతు కార్పొరేషన్' పెట్టి రుణం తీసుకోవాలనే ఆలోచన

నేరుగా బహిరంగ మార్కెట్లో అప్పులు చేసే యోచన..

ప్రభుత్వ భూములు తాకట్టు పెట్టే దిశగా కూడా ప్రతిపాదన

పథకాల భారం తగ్గించుకునేందుకు 'పరిమితుల' పరిశీలన

రైతు భరోసాకు కిసాన్ సమ్మాన్ నిబంధనల వర్తింపు!

ఐదెకరాల పరిమితి, సాగు చేసే రైతులకే సాయంపైనా దృష్టి

రుణమాఫీ విషయంలోనూ 'భారం' తగ్గించుకునే మార్గాలపై ప్రభుత్వం ఫోకస్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల రుణమాఫీని దశల వారీగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో చేసినట్టుగానే విడతల వారీగా పంటల రుణమాఫీ చేపట్టాలని.. వచ్చే నెల 15వ తేదీ నుంచి ప్రక్రియ ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలిసింది. తొలుత రూ. 50 వేల వరకు ఉన్న రుణాలను, తర్వాత రూ. 75 వేల వరకు, అనంతరం రూ.లక్ష.. ఇలా రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీనాటికి రూ.2 లక్షల వరకు ఉన్న రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. రైతుల్లో 70% మందికి రూ.లక్షలోపే రుణాలు ఉన్నట్టు అంచనా. వీరికి తొలిదశలో మాఫీ చేసి.. తర్వాత మిగతా వారికి అమలు చేయాలనే ప్రతిపాదనపైనా చర్చ జరుగుతోంది. నిధుల సేకరణపై స్పష్టత వచ్చాక అర్హుల గుర్తింపు ప్రక్రియ మొదలవుతుందని అధికారవర్గాలు చెప్తున్నాయి. రుణమాఫీకి భారీగా నిధులు అవసరం కావడంతో సేకరణ కోసం ప్రభుత్వం అన్నిరకాల మార్గాలను అన్వేషిస్తోందని అంటున్నాయి.

నాలుగు పథకాలకు రూ.50 వేల కోట్లు!

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే రెండు నెలల్లో రుణమాఫీ, రైతుభరోసా అమలు చేయాల్సి ఉంది. ఈ రెండింటికీ నిధులు సమీకరించడం మిగతా 2వ పేజీలో ▶



ఈవీఎంల గుట్టు విప్పేదెవరు?

ఒక్కొక్కటిగా ఈవీఎం అక్రమాలు వెలుగులోకి..

ముంబైలో గెలిచిన శివసేన(షిండే) అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్‌పై దర్యాప్తు

ఆయన బంధువు మొబైల్‌తో ఈవీఎంను ఆపరేట్ చేసినట్లు ఆరోపణలు

ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమేమీ కాదన్న టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్

ఏఐ ద్వారా ఈజీగా హ్యాక్ చేయొచ్చునంటూ ట్వీట్

- ముంబై ఘటన నేపథ్యంలో ఈవీఎంలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనుమానాలు
- ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పారదర్శకత లేకుంటే భవిష్యత్తు లేదన్న రాహుల్
- ఏపీలో ఓటింగ్ సరళిపై పలువురు ప్రజలు, నేతల సందేహాలు.. మా ఓట్లు ఏమయ్యాయంటున్న జనం
- విజేతలే ఆశ్చర్యపడేంత మెజారిటీలు రావటంపై డౌట్స్
- 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయన్న ఉండవల్లి
- బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు పాట్లన్నీ ఆరోపణలకు బలం చేకూర్చేవే
- నోరు విప్పని సీఈసీ.. కూటమి నేతలు
- బహిరంగంగా పరీక్షిస్తే తప్పు రహస్యం వీడదంటున్న టెక్ నిపుణులు.. ఇలాంటి సందేహాల వల్లే ఈవీఎంలకు స్వస్తి చెప్పిన ప్రపంచ దేశాలు

12లో

హ్యాక్ చేయొచ్చు..!

- ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించొద్దు: ఎలాన్ మస్క్
- ఇండియాలో ఈవీఎంలు సురక్షితమేనని కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పష్టీకరణ
- ఈవీఎంలు బ్లాక్ బాక్సుల లాంటివే: రాహుల్ గాంధీ
- ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి: అఖిలేష్

6లో

మహా ఈవీఎం వివాదం

- ముంబై నార్త్‌వెస్ట్‌లో 48 ఓట్లతో నెగ్గిన శివసేన అభ్యర్థి
- మొబైల్ ఫోన్‌తో ఈవీఎంను హ్యాక్ చేశారనే ఆరోపణలు
- కౌంటింగ్ కేంద్రంలో ఆపరేటర్ ఫోన్‌ను వాడిన వాయ్‌కర్ బంధువు
- ఫలితాన్ని ప్రభావితం చేశారని మిడ్-డే పత్రిక కథనం.. ఖండించిన రిటర్నింగ్ ఆఫీసర్

6లో

నీట్‌పై ప్రధాని స్పందించాలి



- పరీక్షా పే చర్చ నిర్వహించే మోదీ నీట్ అవకతవకలపై సమాధానమివ్వాలి
- విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలి
- ఎన్డీఏ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

2లో

ఆర్టీఏ 2 శాతం దోపిడీ



అడ్డగోలుగా అదనపు బాదుడు

- రెండో కారు కొంటేనే 2 శాతం పన్ను విధించాలి
- బైక్ ఉంటే అదనపు పన్ను అవసరం లేదు
- కానీ 2 శాతం అదనంగా విధిస్తున్న ఆర్టీఏ

3లో

క్లుప్తంగా...

త్యాగస్ఫూర్తికి బక్రీద్ ప్రతీక: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: బక్రీద్ పండుగ సందర్భంగా తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ముస్లింలకు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ముస్లింలందరికీ ఆనందం, శాంతి, మంచి ఆరోగ్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ త్యాగస్ఫూర్తికి, అత్యున్నత భక్తికి ప్రతీకగా అభివర్ణించారు. దాతృత్వం, గౌరవం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి విలువలను బక్రీద్ సూచిస్తుందని పేర్కొన్నారు. బక్రీద్ పండుగను నిజమైన స్ఫూర్తితో జరుపుకోవడం వల్ల సమాజంలో శాంతి, సామరస్యం, సహకారం, కరుణ, ఐక్యత నెలకొంటాయని గవర్నర్ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు.

దాతృత్వానికి నిదర్శనం బక్రీద్: సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: తమకున్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ చాటి చెపుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్) పండుగ సందర్భంగా సీఎం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలిచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఈ పండుగ జరుపుకొంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన దైవభక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కొనియాడారు.

కేసీఆర్ బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ముస్లింలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే పండుగ బక్రీద్ అని ఆయన పేర్కొన్నారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితం కోరి ప్రతి మానవుడు నిస్వార్థ సేవలను అందించాలని బక్రీద్ సందేశమిస్తుందని తెలిపారు. తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని కేసీఆర్ సూచించారు.

ముస్లింలకు వైఎస్ జగన్ బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ముస్లిం సోదర, సోదరీమణులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగనిరతికి, ధర్మబద్ధతకు, దాతృత్వానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఈ పండుగ జరుపుకొంటారని పేర్కొన్నారు. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా ముస్లిందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని చెప్పారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని వైఎస్ జగన్ అభిలషించారు.

మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమైన బక్రీద్ పండుగ, త్యాగం, సహనం ఇచ్చే సందేశాలకు ప్రతీక అని పేర్కొన్నారు. కరుణ, భక్తి, విశ్వాసం, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

ఇదంజగత్



దాని విలువనేం దిగజార్చలేదార్! 30 లక్షలు పెట్టి పెంచాం!!

ఆర్టీసీ ప్రధాన బ్యాంకు ఖాతాల స్తంభన

- మొండి బకాయిల చెల్లింపు విషయంలో భవిష్యనిధి సంస్థ సీరియస్
- రూ.950 కోట్ల చెల్లింపు విషయంలో స్పందించకపోవడంపై ఆగ్రహం
- రోజువారీ ఖర్చులకు చెల్లింపులకు రవాణా సంస్థ ఇబ్బందులు
- తదుపరి రీజినల్ కార్యాలయాల ఖాతాల స్తంభనకు చర్యలు?
- హైకోర్టును ఆశ్రయించే యోచనలో ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీపై భవిష్యనిధి (పీఎఫ్) సంస్థ తీవ్ర చర్యకు ఉపక్రమించింది. పెద్ద మొత్తంలో పేరుకుపోయిన బకాయిలను తీవ్రంగా పరిగణిస్తూ ఏకంగా ఆర్టీసీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. తనకున్న ప్రత్యేక అధికారాలతో ఆర్టీసీ ప్రధాన కార్యాలయంతో ముడిపడిన ప్రధాన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసింది. ఆర్టీసీ రోజువారీ ఆదాయం ఈ ఖాతాల్లోనే డిపాజిట్ అవుతుంది. ఆ మొత్తం నుంచే సంస్థ రోజువారీ కార్యకలాపాలు సాగుతుంటాయి. ఇప్పుడు బ్యాంకు ఖాతాలు స్తంభించడంతో ఆర్టీసీలో గందరగోళ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

రూ.వేయి కోట్లకు చేరువలో బకాయిలు

ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన భవిష్యనిధి ఖాతాల్లో ప్రతినెలా కంట్రిబ్యూషన్ జమ అవుతుంటుంది. సాధారణ సంస్థల్లాగా కాకుండా, భవిష్యనిధి ఖాతాలను సంస్థనే నిర్వహిస్తుంది. వాటిల్లో ఉద్యోగుల కంట్రిబ్యూషన్, వారి పక్షాన సంస్థ కంట్రిబ్యూషన్ జమ చేస్తుంది. గతంలో ఈ కంట్రిబ్యూషన్ ఠంచన్‌గా జమయ్యేది. కానీ, పదేళ్లుగా సంస్థ పనితీరు సరిగా లేకపోవటంతో.. సంస్థ అవసరాల కోసం భవిష్యనిధి మొత్తాన్ని ఆర్టీసీ వినియోగించుకోవడం ప్రారంభించింది. ఏడాదిన్నర క్రితం వరకు అలా రూ.1,200 కోట్లకు ఆ బకాయిలు పేరుకుపోయాయి. పలు దఫాలుగా భవిష్యనిధి సంస్థ నిలదీసింది. కానీ ఆర్టీసీ స్పందించకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీంతో, విడతల వారీగా రూ.300 కోట్ల వరకు చెల్లించింది. ఆ తర్వాత ఆ చెల్లింపులు ఆగిపోయాయి. ప్రస్తుతం భవిష్యనిధి సంస్థకు రూ.950 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ప్రతినెలా కంట్రిబ్యూషన్ల కింద రూ.25 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా పూర్తిగా నిలిచిపోయింది. దీన్ని ఇప్పుడు పీఎఫ్ కమిషనరేట్ తీవ్రంగా పరిగణించి నిలదీయటం ప్రారంభించింది. ఇప్పుడు ఏకంగా తన ప్రత్యేక అధికారాలను వినియోగించి ఆర్టీసీ ప్రధాన బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది.

రీజినల్ ఖాతాల్లోకి జమ..

భవిష్యనిధి సంస్థ చర్యతో వెంటనే తేరుకున్న ఆర్టీసీ.. రోజువారీ ఆదాయాన్ని బస్‌భవన్‌కు ఉన్న ప్రధాన ఖాతాల్లో కాకుండా రీజినల్ కార్యాలయాలతో అనుసంధానమైన ఇతర ఖాతాల్లో జమ చేయటం ప్రారంభించింది. ఈమేరకు అన్ని కార్యాలయాలకు బస్‌భవన్ నుంచి లిఖితపూర్వక ఆదేశాలందాయి. ఈ ఖాతాలు ఫ్రీజ్ కానందున వాటిల్లో జమ చేసి వాటి నుంచే డ్రా చేసుకుంటూ రోజువారీ కార్యకలాపాలు సాగించాలని ఆదేశించింది. భవిష్యనిధి సంస్థ వాటినీ ఫ్రీజ్ చేయబోతోందని సమాచారం అందడంతో హైకోర్టును ఆశ్రయించి ఫ్రీజ్‌కాకుండా స్టే పొందాలని ఆర్టీసీ భావిస్తున్నట్టు తెలిసింది. అలా జరగని పక్షంలో ఆర్టీసీ రోజువారీ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోనున్నాయి. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులకు ఉన్న టోల్‌గేట్ల ఫాస్టాగ్‌లకు సంబంధించి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉంది. దాన్ని కూడా పీఎఫ్ సంస్థ ఫ్రీజ్ చేయబోతోందని ఆర్టీసీకి సమాచారం అందింది. అదే జరిగితే, ఫాస్టాగ్‌ల నుంచి టోల్ రుసుము మినహాయింపునకు వీలుండదు. దీంతో టోల్ గేట్ల వద్ద నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఫాస్టాగ్‌తో కాకుండా నగదు చెల్లిస్తే, రుసుము రెట్టింపు ఉంటుంది. ఇది ఆర్టీసీపై రోజువారీ రూ.లక్షల్లో భారం పడుతుంది. దీంతో ఫాస్టాగ్ ఖాతాకు కూడా ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. సోమవారం సెలవు కావటంతో, మంగళవారం దాన్ని కొలిక్కి తేవాలని భావిస్తోంది.

పీఎఫ్ బకాయిలకు సాయం సాధ్యమా?

హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేనిపక్షంలో కచ్చితంగా పీఎఫ్ బకాయిలు చెల్లించాల్సిందే. అన్ని నిధులు ఆర్టీసీ వద్ద సిద్ధంగా లేనందున.. ప్రభుత్వమే జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, 2013 వేతన సవరణ బాండు బకాయిలకు సంబంధించి ఉద్యోగుల చెల్లింపునే ప్రభుత్వం అర్ధాంతరంగా వదిలేసిన ప్రస్తుత తరుణంలో, పీఎఫ్ బకాయిలకు సాయం చేయటం సాధ్యమా అన్న మీమాంస ఉత్పన్నమవుతోంది. బాండు బకాయిలను ఆర్టీసీ డ్రైవర్లకు చెల్లించి, మిగతా వారికి చెల్లించలేదు. బాండు బకాయిలకు రూ.280 కోట్లు అవసరం కాగా, కేవలం రూ.80 కోట్లే అందినట్టు తెలిసింది. ఈ మొత్తాన్ని గత ఫిబ్రవరిలో డ్రైవర్ కేటగిరీ ఉద్యోగులకు చెల్లించారు. మిగతా వారికి చెల్లించలేదు. దీంతో భవిష్యనిధి బకాయిల విషయంలో గందరగోళం నెలకొంది.

నీట్‌పై ప్రధాని స్పందించాలి

- పరీక్షా పే చర్చ నిర్వహించే మోదీ నీట్ అవకతవకలపై సమాధానమివ్వాలి
- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా పట్టించుకోని కేంద్రం
- గ్రేస్ మార్కులు, పేపర్‌లీకేజీల వ్యవహారంతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలి
- ఎన్డీఏ ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్‌–యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలను ప్రధాని మోదీ నివృత్తి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు డిమాండ్ చేశారు. తమ పిల్లలు డాక్టర్లు కావాలని కలలుగన్న తల్లిదండ్రుల ఆశలపై గందరగోళంగా మారిన వ్యవహారంతో నీళ్లు చల్లినట్టయిందని ధ్వజమెత్తారు. బిహార్‌లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ మేరకు కేటీఆర్ ఎన్డీఏ ప్రభుత్వానికి ఆదివారం రాసిన బహిరంగ లేఖలో నీట్ పరీక్షపై పలు సందేహాలను వెలిబుచ్చారు. ప్రతిసారీ విద్యార్థులతో 'పరీక్షా పే చర్చా'కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని...నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విచారకరమన్నారు. సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని కోరారు.

67 మందికి మొదటి ర్యాంకు ఎలా?

నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని కేటీఆర్ అన్నారు. ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8 మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం చూస్తే ..పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించడం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొనేంత వరకు కూడా కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) 1,563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని.. అంతమందికి ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు కలిపారో స్పష్టం చేయడం లేదని ధ్వజమెత్తారు. ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా పేపర్ లీకేజీ ఆరోపణలపైనా విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. గుజరాత్, బిహార్‌లో అవకతవకలకు పాల్పడిన కొంత మందిని పోలీసులు అరెస్ట్ చేశారని.. వరుసగా బయటపడుతున్న వివాదస్పద వ్యవహారాల కారణంగా పరీక్ష తీరుపై అనుమానాలు బలపడుతున్నాయని చెప్పారు.

తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నష్టం

తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ వల్ల వారు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించేలా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయాలి

- తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం సమావేశంలో తీర్మానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని, తక్షణమే కౌన్సెలింగ్ పద్ధతిలో ఉద్యోగుల సాధారణ బదిలీలు నిర్వహించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం తీర్మానించింది. ఆదివారం నాంపల్లిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ భవన్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సత్యనారాయణ ఈ సమావేశాన్ని ప్రారంభించి ఉద్యోగుల సమస్యలు, సర్వీసు అంశాలపై చర్చించారు. అనంతరం 17 అంశాలతో కూడిన తీర్మాన ప్రతిని ప్రవేశ పెట్టగా కేంద్ర సంఘం కార్యవర్గంతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల ఫోరం, 54 శాఖల ఫోరమ్‌లు ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాయి. జిల్లాల వారీగా, శాఖల వారీగా టీజీఓ ఫోరమ్‌ల ఏర్పాటుకు కేంద్ర సంఘం ఆమోదం తెలిపింది. ఈ తీర్మాన ప్రతిని మంత్రివర్గ ఉపసంఘానికి, త్రిసభ్య కమిటీకి అందించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు వెల్లడించారు. సమావేశంలో టీజీఓ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్యామ్, ఉపాధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు, కోశాధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీర్మానంలోని ప్రధాన అంశాలు

- ఉద్యోగుల బదిలీలపై బ్యాన్ ఎత్తివేసి కౌన్సెలింగ్ పద్ధతిన తక్షణమే నిర్వహించాలి
- ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏ బకాయిలను చెల్లించాలి. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్తో ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలి
- ఆర్థిక శాఖలో పెండింగ్‌లోని సప్లిమెంటరీ బిల్లులన్నీ క్లియర్ చేయాలి
- జీఓ 317 దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలి
- 2వ పీఆర్సీ మధ్యంతర భృతి 5% నుంచి 20% పెంచాలి
- వైద్య,ఆరోగ్య శాఖలో జీఓ 142ను సమీక్షించాలి
- కొత్త జిల్లాల్లో అదనపు కేడర్ స్ట్రెంథ్ మంజూరు చేయాలి
- అధికారులపై అనుచితంగా ప్రవర్తిస్తున్న జిల్లా కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

నీట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరేంటి?: గెల్లు శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: నీట్ పరీక్షలో అక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరి ఏంటో స్పష్టం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిన విషయం వాస్తవమేనని, గుజరాత్ లో పేపర్లు అమ్ముకున్నారని ఆరోపించారు. అయినా ప్రధాని మోదీ నీట్ పరీక్ష లీకేజీలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నీట్ వలన తెలంగాణ రాష్ట్రం నష్టపోయిందని, దీనిపై రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ఎందుకు అడగటం లేదని నిలదీశారు. తెలంగాణ ఎంపీలు నీట్ విద్యార్థుల కోసం ఎందుకు మాట్లాడటం లేదో సమాధానం చెప్పాలన్నారు. నీట్ వల్లే తెలంగాణ విద్యార్థులకు ర్యాంకులు రావడం లేదని, మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంభకోణం తరహాలో నీట్ స్కాం జరిగిందని ఆరోపించారు.

దశల వారీగానే మాఫీ!

▶ మొదటి పేజీ తరువాయి

సవాల్‌గా మారిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. రుణమాఫీ కోసం వడ్డీతో కలిపి సుమారు రూ.35 వేల కోట్లు అవసరమని అంచనా. రైతు భరోసా కింద ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ.7,500 చొప్పున ఇచ్చేందుకు రూ.10,500 కోట్ల మేరకు కావాలి. రైతు బీమా పథకం ప్రీమియం చెల్లించేందుకు రూ.1,500 కోట్లు కావాలి. పంటల బీమా పథకం కింద ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించాలంటే దాదాపు రూ.2,500 కోట్ల మేరకు ఖర్చు అవుతుందని అంచనా. ఇలా ఈ నాలుగింటికి కలిపి రూ.50 వేల కోట్ల వరకు అవసరం. రైతుభరోసా కింద ఈ నెల నుంచే పెట్టుబడి సాయం ఇవ్వాలి. రైతు బీమా, పంటల బీమాకు కూడా ఇప్పుడే చెల్లించాల్సి ఉంటుంది. రుణమాఫీపై ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించాలి. అంటే ఈ రెండు నెలల్లోనే నిధులన్నీ సమకూర్చుకోవాలి.

భారం తగ్గించుకోవడంపై దృష్టి!

భారీగా నిధుల అవసరం ఉండటంతో.. ఈ నాలుగు పథకాల భారాన్ని ఎలా తగ్గించుకోవాలన్న దానిపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసినట్టు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో రుణమాఫీ అమలు తీరును పరిశీలించింది. వ్యవసాయ, ఆర్థికశాఖల అధికారులు మహారాష్ట్రకు వెళ్లి అక్కడ రుణమాఫీ అమలుతీరును అధ్యయనం చేసి వచ్చారు. రాజస్తాన్‌లో రుణమాఫీ అమలుతీరును కూడా అడిగి తెలుసుకున్నారు. ఆయా రాష్ట్రాల్లో అనుసరించిన విధి విధానాలు, నిర్దేశించిన అర్హతలను కూడా పరిశీలిస్తున్నారు. అర్హులైన రైతులకు లబ్ధిచేకూరేలా విధివిధానాలు ఎలా ఉండాలనే కసరత్తు కొనసాగుతోంది. నిజానికి రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీయిచ్చింది. కానీ ఆయా పథకాలకు అర్హులను గుర్తించాలని యోచిస్తున్నట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం కింద దేశవ్యాప్తంగా అర్హులైన రైతులకు ఏటా రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ ఛైర్మన్లు, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, కేంద్ర రాష్ట్ర ఉద్యోగులు, అధిక ఆదాయం ఉండి ఆదాయ పన్ను చెల్లించేవారిని మినహాయించింది. ఇప్పుడు ''రైతు భరోసాకు, రుణమాఫీ అమలుకు అటువంటి ప్రత్యేక మార్గదర్శకాలు పాటించాలా? అలా చేస్తే అసలైన రైతులకు మేలు జరుగుతుందా? ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి రైతుకు మేలు జరగాలంటే ఎలాంటి విధి విధానాలుండాలి?'' అన్నదిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. అంటే పథకాల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పీఎం కిసాన్‌లో మినహాయింపు ఉన్న వర్గాలతోపాటు ఐదెకరాల పరిమితి పెట్టడం, సాగుచేసే రైతులకే భరోసా సాయం ఇవ్వడం వంటివి అమలు చేస్తే ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నట్టు చెప్తున్నారు. రుణమాఫీకి కూడా ఇలాంటి నిబంధనలు పెడితే ఎలా ఉంటుందనే కోణంలోనూ ఆలోచన సాగుతున్నట్టు సమాచారం.

నిధుల సమీకరణ ఎలా?

ఈ నాలుగు పథకాల కోసం ఒకేసారి రూ.50 వేల కోట్ల మేరకు నిధులు సమీకరించడం అంత సులువైన వ్యవహారం కాదని.. ఒకవేళ ఆంక్షలు విధించి, కోతలు పెట్టినా కూడా అంత మొత్తంలో సొమ్ము సేకరణ కష్టమేనని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం భారం తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తూనే, నిధుల సమీకరణకు ఏర్పాట్లు మొదలుపెట్టింది. కొత్తగా 'రైతు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్' ఏర్పాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చి.. ఒకేసారి రూ.35 వేల కోట్ల వరకు రుణం తీసుకునే అవకాశం ఉందా అన్న ఆలోచన జరుగుతోంది. ఏదైనా కార్పొరేషన్‌కు భారీగా రుణం ఇవ్వాలంటే.. దానిని అదే సంస్థ తిరిగి చెల్లించగలదంటూ ఆదాయ మార్గాలను చూపాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఏదైనా సంస్థ లేదా పథకం పేరుతో బ్యాంకులు ఇచ్చే రుణం సొమ్మును ఆ పనికి మాత్రమే వినియోగించాలని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తు ఇవ్వడం చెల్లకుండా చూడాలని రిజర్వుబ్యాంకు వర్కింగ్ గ్రూప్ సిఫార్సు చేసిందని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రుణ సేకరణకు ఉన్న ఇతర అవకాశాలేమిటన్న దానిపై ప్రభుత్వం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోంది. వృథాగా ఉన్న ప్రభుత్వ భూములను బ్యాంకుల్లో కుదువపెట్టి రుణాలు తీసుకోవాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చినట్టు తెలిసింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 700 ఎకరాలకుపైగా భూములను ప్రభుత్వం గుర్తించింది. అందులో కొన్ని భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టడం ద్వారా రూ.20 వేల కోట్ల వరకు సమకూర్చుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఇప్పటికే రిజర్వుబ్యాంకు గవర్నర్‌తో ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది.

విచారణ పూర్తికాక ముందే తీర్పు ఎలా చెబుతారు?

- జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ తీరుపై కేసీఆర్ సందేహాలు న్యాయబద్ధమే
- విద్యుత్ కొనుగోళ్లతో తెలంగాణకు ఎక్కడా నష్టం జరగలేదు: మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ కొనుగోళ్లలో తెలంగాణ ప్రభుత్వానికి ఎక్కడా నష్టం జరగలేదని, ఆ విషయంలో ఏ విచారణకైనా సిద్ధమని రాష్ట్ర మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఆదివారం తెలంగాణభవన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఒప్పందాలపై విచారణకు ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ వేసిందని, కమిషన్ సందేహాలకు కేసీఆర్ బహిరంగంగా సమాధానం ఇచ్చారన్నారు. కమిషన్ ఉద్దేశం వేరేలా ఉందని, వాదన వినకుండా, విచారణ చేయకుండా తీర్పు ఇచ్చేలా కనిపిస్తోందని విమర్శించారు. నరసింహారెడ్డికి విచారణ అర్హత లేదని, కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని మాజీ సీఎం కేసీఆర్ సూచించారని చెప్పారు. వివరణ ఇచ్చేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఇవ్వాలని అడిగితే ఇవ్వలేదని, 15 లోపే వివరణ ఇవ్వాలని చెప్పారన్నారు. కానీ 11వ తేదీన నరసింహారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణవాదిగా నరసింహారెడ్డికి పేరు ఉందని, చీకట్లో ఉన్న తెలంగాణను వెలుగుల తెలంగాణగా మార్చిన కేసీఆర్‌పై ఆయనకు సానుభూతి ఉంటుందనుకున్నామని, కానీ ఆయన తీరు అలా లేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ కొనుగోళ్ల అంశంపై కాంగ్రెస్, బీజేపీ నేతలకు అసెంబ్లీలో సమాధానం ఇచ్చామని, ఈఆర్సీ ముందు కాంగ్రెస్, బీజేపీ నేతలు తమ వాదనలు వినిపించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల అభిప్రాయాలను నరసింహారెడ్డి మీడియా సమావేశంలో చెప్పారని, విచారణ పూర్తి కాకముందే తీర్పు ఎట్లా చెబుతారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక కమిషన్లు రద్దు అయ్యాయని, ఈఆర్సీ స్వతంత్ర కమిషన్ అని, అది ఇచ్చిన తీర్పు ఫైనల్ అన్నారు. ఈఆర్సీ తీర్పు ఇచ్చాక కమిషన్ ఎట్లా వేస్తారని నరసింహారెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. కమిషన్ బాధ్యతల నుంచి నరసింహారెడ్డి తప్పుకుంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో బహిరంగంగా విద్యుత్ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. విద్యుత్ కొనుగోలులో కేసీఆర్ మాజీ సీఎం రమణ్‌సింగ్‌కు ఏమైనా లంచం ఇచ్చారా. బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఎక్కువ రేటుకు విద్యుత్ కొన్నాయని, తెలంగాణ మాత్రం యూనిట్‌కు రూ.3.90 పెట్టి విద్యుత్ తీసుకున్నట్టు వివరించారు. దేశంలో ఏ కమిషన్ మధ్యలో లీకులు ఇవ్వలేదని తెలిపారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, విజయవాడ, ఆర్టీపీసీ నుంచి సబ్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారానే విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. పారదర్శకతతోనే ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీహెచ్ఈఎల్‌కు భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలను అప్పగించినట్టు తెలిపారు. కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేసిన దొంగలంతా ఏకమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని, రేవంత్‌రెడ్డి మోదీ లైన్‌లో పని చేస్తున్నారని ఆరోపించారు. కోమటిరెడ్డి మాటలను పట్టించుకోమని, పీసీసీ పదవి డబ్బులతో రేవంత్ తెచ్చుకున్నాడని కోమటిరెడ్డి అనలేదా అని జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు.

జగదీశ్‌రెడ్డి కోరిక మేరకే న్యాయ విచారణ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



బోనకల్ మండలం తూటికుంట్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

బోనకల్: 'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ రంగ పరిస్థితిని అసెంబ్లీలో శ్వేత పత్రం ద్వారా చర్చకు పెట్టాం, సభలోని సభ్యులంతా విద్యుత్ అంశంపై మాట్లాడారు. ఆ సభలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విద్యుత్ కొనుగోలు విషయంపై న్యాయ విచారణ చేపట్టాలని పదేపదే కోరారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి న్యాయ విచారణకు ఆదేశించారు 'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం తూటికుంట్లలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన భట్టి.. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. కక్ష సాధింపు ధోరణితో న్యాయవిచారణ చేయిస్తున్నారని ఎవరైనా మాట్లాడితే అవగాహన రాహిత్యంగానే భావించాల్సి ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలే కక్ష సాధింపు ధోరణి అనడం విడ్డూరమని విమర్శించారు. ఇందిరాగాంధీ వంటి వారే న్యాయ విచారణకు హాజరయ్యారన్నారు. 'నేను చెప్పిందే వేదం, శాసనం'అనే వారికి న్యాయ వ్యవస్థపై నమ్మకం లేనట్టేనని చెప్పారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సభలు

విద్యుత్ సమస్య వచ్చినప్పుడు అధికారులు అందుబాటులో లేరని రాష్ట్రంలో కొన్ని చోట్ల వింటున్నామని, వీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.రాష్ట్రంలో ఎవరికి ఏ ప్రాంతంలో విద్యుత్ సమస్య ఎదురైనా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో రికార్డ్ అయి ఉంటాయన్నారు. ధరణి సమస్యలపై కమిటీ వేశామని, రాష్ట్రవ్యాప్తంగా అందరి అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ప్రజలకు జవాబుదారీగా ఉండేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు.

హస్తం గూటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల?



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఉమ్మడి పాలమూరుజిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, గత ఎన్నికల్లో 12 స్థానాలను కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లలో బీఆర్ఎస్ గెలిచింది. గులాబీకి కంచుకోటగా ఉన్న ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీని పూర్తిగా ఖాళీ చేయించాలనే ఎత్తుగడలతో కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా సీఎం పాలమూరుపై ఫోకస్ పెట్టారు. పలుచోట్ల జెడ్పీ ఛైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను భారీఎత్తున పార్టీలో చేర్చుకున్నారు. పలు మున్సిపల్ పీఠాలను హస్తగతం చేసుకున్నారు. తాజాగా గద్వాల ఎమ్మెల్యే బండ్లను పార్టీలో చేర్చుకోవాలనే ఉద్దేశంతో కర్నూలు వేదికగా పావులు కదిపినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి చక్రం తిప్పినట్టు సమాచారం. ఆయనకు సన్నిహితుడిగా ఉన్న ఎమ్మెల్యే బండ్లతో సంప్రదించగా.. సానుకూల స్పందన వచ్చినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. అన్నీ అనుకున్నట్టు జరిగితే నెలాఖరు నాటికి బండ్ల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడిని సైతం కాంగ్రెస్ పెద్దలు సంప్రదించినట్టు సమాచారం. చల్లా మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఆయన అనుచరవర్గం చెబుతోంది. పార్టీ మారుతున్నారనే ప్రచారంపై ఎమ్మెల్యే బండ్లను 'సాక్షి'ఫోన్‌లో సంప్రదించగా 'కాంగ్రెస్ వారు నన్ను సంప్రదించిన మాట వాస్తవమే.. పార్టీ మారడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికైతే బీఆర్ఎస్‌లోనే ఉన్నా..'అని తెలిపారు.

ఆర్టీఏ 2 శాతం దోపిడీ



అడ్డగోలుగా అదనపు బాదుడు

- రెండో కారు కొంటేనే 2 శాతం పన్ను విధించాలి
- బైక్ ఉంటే అదనపు పన్ను అవసరం లేదు
- కానీ 2 శాతం అదనంగా విధిస్తున్న ఆర్టీఏ
- మూడేళ్ల క్రితమే ఏపీలో 2 శాతం పన్ను ఎత్తివేత
- గ్రేటర్‌లో 2010 నుంచి కొనసాగుతున్న వసూళ్లు

సాక్షి, హైదరాబాద్: ఒక వ్యక్తి అప్పటికే ఓ కారును కలిగి ఉండి మరో కారును కొనుగోలు చేసినప్పుడు మాత్రమే 2 శాతం పన్ను రవాణాశాఖకు అదనంగా చెల్లించాలి. అంటే కొత్త వాహనంపై విధించే 18 శాతం పన్నుతో పాటు మొదటి కారుపై 2 శాతం వసూలు చేయాలనేది నిబంధన. కానీ ఆర్టీఏ అధికారులు ద్విచక్రవాహనం ఉన్నప్పటికీ రెండు శాతం పన్ను విధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేవలం కార్లకే ఆ నిబంధన కానీ..

సాధారణంగా ఒక వ్యక్తికి లేదా ఒక కుటుంబ అవసరాలకు ఒక కారు సరిపోతుందనే భావనతో ఈ అదనపు పన్ను నిబంధనను అప్పట్లో తెరపైకి తెచ్చారు. ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ కార్లను కలిగి ఉండడం వల్ల రహదారులపై భారం పెరుగుతుందని, అదనపు వాహనాలపై పన్నులు విధిస్తే ఆ కొనుగోళ్లను ఒకింత తగ్గించాలని భావించి గతంలో రవాణాశాఖ అధికారులు ఆ నిబంధనను అమలు చేస్తూ వచ్చారు. కానీ.. దీన్ని కేవలం కార్లకు మాత్రమే పరిమితం చేయాల్సి ఉండగా.. ద్విచక్ర వాహనాలను కూడా ఈ నిబంధన పరిధిలోకి తేవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ద్విచక్ర వాహనం కలిగిన వ్యక్తి కొత్తగా కారును కొనుగోలు చేస్తే ఆ కారు ధరలో 18 శాతం జీవితకాల పన్నుతో పాటు మరో 2 శాతం అదనంగా చెల్లించాలని పేర్కొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ద్విచక్ర వాహనండున్నవారు కారు కొనుగోలు చేస్తే రూ.వేలల్లో అదనపు పన్ను చెల్లించాల్సివస్తోంది. ఈ అడ్డగోలు నిబంధన వల్ల 2010 నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది నష్టపోయారు. పైగా.. కాలం చెల్లి, తుప్పు పట్టి, వినియోగానికి పనికి రాని వాహనాలపై, చోరీకి గురైన వాహనాలపైనా రవాణాశాఖ నిర్దాక్షిణ్యంగా అదనపు పన్ను వసూళ్లకు పాల్పడడం గమనార్హం.

కారు.. బైక్ ఒకటేనా?


నలుగురు ప్రయాణం చేసే కారును.. ఇద్దరు మాత్రమే వెళ్లగలిగే బైక్‌ను ఒకే రకమైన వాహనంగా ముద్రవేసి పన్ను విధించడం వివాదాస్పదమవుతోంది. '2010లో రెండో వాహనంపై 2 శాతం అదనపు పన్ను విధించాలనే ప్రతిపాదన వచ్చింది. ఇది కార్లకే పరిమితం చేయాలని నిర్ణయించాం. కానీ నిబంధనల్లో ఈ విషయం స్పష్టంగా లేకపోవడం వల్ల ద్విక్ర వాహనాలకు కూడా అమలవుతోంది' అని రవాణశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పుకొచ్చారు.

ఏపీలో ఎత్తేసినా.. ఇక్కడ మాత్రం

ఉమ్మడి రాష్ట్రంలో అమల్లోకి తెచ్చిన రెండు శాతం అదనపు పన్ను నిబంధనను గత ఏపీ ప్రభుత్వం తొలగించింది. 'రెండో వాహనం'తో నిమిత్తం లేకుండా కొత్త వాహనాలపై 18 శాతం జీవితకాల పన్ను వసూలు చేస్తోంది. 2021లోనే ఈ రెండో వాహనం నిబంధనను తొలగించడంతో లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఎత్తున ఊరటనిచ్చినట్లయింది. మరోవైపు వాహనం శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం వాహన యజమానులు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా షోరూమ్‌ల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించారు. అంటే కొత్తగా బైక్, కారు తదితర వాహనాలను కొనుగోలు చేసిన వారు వాటి నమోదు కోసం ప్రత్యేకంగా ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నంబర్ ప్లేట్‌తో సహా షోరూమ్‌లోనే అన్ని పనులు పూర్తవుతాయి.

'బాదుడు'కథనంపై చర్చ..

'బండి ఉన్నా లేకున్నా బాదుడే'అనే శీర్షికన రెండు రోజుల క్రితం 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన కథనం రవాణా శాఖలో చర్చకు తెరలేపింది. వినియోగంలో లేని వాహనాలను సైతం రెండో బండిగా పరిగణించి వాహనదారులపై అదనపు భారం మోపడంపై ఈ కథనంలో ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఒక వాహనదారు తన బండి చోరీకి గురైందని పేర్కొంటూ పోలీసుల ధ్రువీకరణతో సహా ఆర్టీఏకు సమర్పించినప్పటికీ దాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలు నిబంధనలతో అదనపు వడ్డనకు పాల్పడుతున్న వైనాన్ని ఆ కథనంలో ప్రస్తావించడంతో చర్చ జరుగుతోంది. రెండో వాహనం కొనుగోలు చేసినప్పుడు జీవితకాల పన్నుపై మినహాయింపునివ్వాలని, ఈ మేరకు ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



ఊళ్లు.. నీళ్లు.. కన్నీళ్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, ఆచార్య జయధీర్ తిరుమలరావు తదితరులు

మల్లన్నసాగర్ నిర్వాసితుల వ్యథ పుస్తకావిష్కరణ

పంజగుట్ట (హైదరాబాద్): మల్లన్న సాగర్ పుస్తకంలో వ్యాసాలు రాసే సమయంలో రచయిత ఎన్నిసార్లు కన్నీరు పెట్టుకున్నారో తెలియదు కానీ పుస్తకం చదివే సమయంలో తనకు కన్నీళ్లు ఆగలేదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. రచయిత రెమిల్ల అవధాని రచించిన 'ఊళ్లు.. నీళ్లు.. కన్నీళ్లు మల్లన్న సాగర్ నిర్వాసితుల వ్యథ'పుస్తకాన్ని ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, రైతు నాయకుడు సారేపల్లి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్లన్న సాగర్ నిర్వాసితులైన 14 గ్రామాల ప్రజలు ఒకవైపు ఉంటే.. మరోవైపు శక్తివంతమైన ప్రభుత్వం ఉందని, హక్కులకోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తెలంగాణ ద్రోహులు ప్రాజెక్టులు ఆపేందుకు కోర్టును ఆశ్రయించారని అధికారులు చెప్పడం బాధాకరమన్నారు. మాఫియా అధిపతులు సామ్రాజ్య ఎలా నిర్మాణం చేస్తారో దానికి కాళేశ్వరం ఉదాహరణ అన్నారు. సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం నిర్వాసితులపట్ల ప్రభుత్వం, అధికారులు వ్యవహరించిన తీరు బాధాకరమని, న్యాయం చేయాలని అడిగితే తెలంగాణ ద్రోహులు అంటూ ముద్ర వేశారని ఆవేదనవ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ .. వ్యాసాలను పుస్తకాలుగా తేవడం అభినందనీయమన్నారు. భూకంపం వచ్చే అవకాశం ఉన్న ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టారని, ఏదైనా జరిగితే 5 లక్షల మంది ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం భూసేకరణ చట్టానికి తూట్లుపొడిచి 2.5 నుండి 3 లక్షల ఎకరాలు బలవంతంగా లాక్కుందన్నారు.



జలసౌధలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

కృష్ణా బేసిన్‌లో తెలంగాణ హక్కుల రక్షణే ధ్యేయం

సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, ఇంజనీర్లతో తాజా పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కచ్చితంగా సాధించేలా న్యాయబృందం కృషి చేయాలని రాష్ట్ర సాగునీటిశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎక్కడా రాజీపడాల్సిన అవసరం లేదని, కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ హక్కులను రక్షించడమే ధ్యేయంగా అటు సుప్రీంకోర్టు, ఇటు ట్రిబ్యునల్‌లో దూకుడుగా న్యాయ పోరాటం చేయాలని మార్గదర్శనం చేశారు. కృష్ణా జలాల వివాదాలపై ఆదివారం ఆయన అంతరాష్ట్ర జల వ్యవహారాల విభాగం ఇంజనీర్లతో జలసౌధలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ విషయంలో ట్రిబ్యునల్–2లో కొనసాగుతున్న విచారణ, సుప్రీంకోర్టులో ఇతర పెండింగ్ కేసుల స్థితిగతులను తెలంగాణ తరపున వాదనలు వినిపిస్తున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్.వైద్యనాథన్ మంత్రికి వివరించారు. న్యాయ పోరాటంలో అనుసరించాల్సిన వ్యూహం తెలియజేశారు. ఏపీ, తెలంగాణ మధ్య తాత్కాలికంగా కృష్ణా జలాలను సర్దుబాటు చేస్తూ 2015లో తీసుకున్న నిర్ణయం ఆ ఏడాదికే వర్తిస్తుందని, ఇంకా కొనసాగించడం ఏకపక్ష నిర్ణయమే అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి ఎలాంటి ప్రామాణికత లేదన్నారు. కృష్ణా ట్రిబ్యునల్–2 తుది పంపకాలు జరిపే వరకు కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల మధ్య 50: 50 నిష్పత్తిలో పంపిణీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత అంశం చర్చకు రాగా, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను అప్పగించే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. గత ఫిబ్రవరి 12న అసెంబ్లీలో ఈ మేరకు చేసిన తీర్మానం విషయంలో కట్టుబడి ఉన్నామన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకతో ఉన్న జల వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో సీనియర్ న్యాయవాది వి.రవీందర్‌రావు, సాగునీటి శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్‌తో పాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వేతన యాతన!

- రెండు నెలలుగా టీచర్లు, హెల్పర్లకు అందని వేతనాలు
- బడ్జెట్ సమస్యతో నిధులు విడుదల కాలేదంటున్న అధికారులు
- దాదాపు ఏడాదిగా గాడితప్పిన వేతన చెల్లింపులు
- రెండు, మూడు నెలలకోసారి విడుదలపై భగ్గుమంటున్న వైనం
- క్షేత్రస్థాయి నుంచి కమిషనరేట్‌కు వెల్లువెత్తుతున్న వినతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లకు వేతన కష్టాలు తీరడం లేదు. ప్రస్తుతం రెండు నెలల నుంచి వారికి వేతనాల్లేవు. మరోవైపు సమ్మె కాలానికి సంబంధించిన బకాయిలు సైతం ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు క్షేత్రస్థాయిలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా పదో తేదీలోపు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతనాలు అందేవి. కానీ ఏడాది కాలంగా ఈ చెల్లింపుల ప్రక్రియ గాడితప్పింది. రెండు, మూడు నెలలకోసారి వేతనాలు విడుదల కావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో 59వేల మంది అంగన్‌వాడీ సిబ్బంది

రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఒక టీచర్, ఒక హెల్పర్ చొప్పున పోస్టులు మంజూరైనప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా 59వేల మంది టీచర్లు, హెల్పర్లు ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ.13650 చొప్పున గౌరవ వేతనం ఇస్తుండగా... హెల్పర్‌కు రూ.7800 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం గౌరవవేతనం మంజూరు చేస్తోంది.

ప్రతి నెలా జాప్యమే..

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతన చెల్లింపుల్లో ప్రతి నెలా జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. సాంకేతిక సమస్యలో లేక ఇతరత్రా కారణాలతో వేతన చెల్లింపుల్లో కాస్త ఆలస్యం కావడం సహజమే అయినప్పటికీ.. ప్రతి నెలా ఇదే పరిస్థితి తలెత్తుతుండడం పట్ల వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గౌరవ వేతనంపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించే పరిస్థితుల్లో వేతన చెల్లింపుల జాప్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేతనాలకు ప్రతి నెలా రూ.70 కోట్లు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల గౌరవవేతనానికి సంబంధించి ప్రతి నెలా సగటున రూ.70కోట్ల బడ్జెట్ అవసరం. ఈ లెక్కన ఏటా రూ.840 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుంది. గత కొంత కాలంగా కేంద్రం నుంచి వచ్చే నిధుల రాక ఆలస్యం కావడంతో ఈ జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. బడ్జెట్ సమస్యతో వేతన చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

కమిషనరేట్‌కు ఫిర్యాదులు

వేతన చెల్లింపుల్లో జాప్యంపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించింది. వేతన చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరి ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని కోరింది.

వ్యవసాయ-రైతు సంక్షేమ శాఖగా మార్చాలి

వ్యవసాయశాఖ పేరును మార్చాలని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యవసాయ శాఖ పేరును వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా మార్చాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి కోరారు. రైతుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషి చేసే వ్యవసాయ శాఖ పేరులో రైతు సంక్షేమం అనే పేరును కూడా జోడించాలని ప్రభుత్వానికి సూచించారు. సీఎం ఎ.రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయంపై దృష్టి పెట్టాలని ఒక ప్రకటనలో సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా పిలిచేవారని, అయితే 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని వ్యవసాయ శాఖగా పరిమితం చేసి, రైతు సంక్షేమం పేరును తొలగించిందని గుర్తు చేశారు.

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బదిలీ



హేమంత్ బోర్కాడే

బంజారాహిల్స్ (హైదరాబాద్): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడేను బదిలీ చేశారు. ఆయనను జీఏడీ (సాధారణ పరిపాలన విభాగం)కు అటాచ్ చేస్తూ జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం 20 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేయగా.. వారిలో హేమంత్ బోర్కాడే పేరు లేదు. కాగా, ఆదివారం ఆయన ఒక్కరినే బదిలీ చేశారు. ఎనిమిది నెలల క్రితమే ఆయన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకులాల్లో పనిచేస్తున్న 12వేల మందికి పైగా బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర అధ్యక్షుడు టేకుమళ్ల సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎక్కువ సమయం గురుకులాల్లో ఉంటే విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బందికి వేతనాలు పెంచాలని, కనీస వేతన చట్టానికి అనుగుణంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన మైనార్టీ గురుకుల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ బోధనేతర సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీల పరిధిలో దాదాపు 12వేల మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మైనార్టీ గురుకుల బోధనేతర సిబ్బంది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 205 మైనార్టీ గురుకులాలకు చెందిన బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.



మతం అనేది విశ్వాస సంస్కృతి :
సైన్సు అనేది సందేహ సంస్కృతి.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 17 జూన్ 2024

కరవు పాట

దేశానికి ఎదురయ్యే నానా సమస్యల్లో కరవు ఒకటి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కృత్రిమ మేధ వరకు ఎదిగినా, కరవు కాటకాలను పూర్తిగా రూపుమాపే స్థాయికి మాత్రం ఇంకా చేరుకోలేదు. రాజ్యానికి వాటిల్లే అనేకానేక ఆపదల్లో దుర్భిక్షాన్ని కూడా ఒకటిగా మన ప్రాచీన సాహితీవేత్తలు గుర్తించారు. అయితే, ఇందులో మానవ ప్రమేయాన్ని మాత్రం పాపం వారు గుర్తించలేకపోయారు. ‘అమానుషోగ్నిః, అవర్షం, అతివర్షం, మారకః, దుర్భిక్షం, సస్యోపఘాతః, జంతుసర్గః, వ్యాధిః, భూత పిశాచ శాకినీ సర్ప వ్యాళ మూషక క్షోభాశ్చేత్యాపదః’ అన్నాడు సోమదేవుడు. ఈ శ్లోకం ఆయన రాసిన ‘నీతి వాక్యామృతం’లోనిది. అంటే, మనుషుల వల్ల కాకుండా, ఇతర కారణాల వల్ల వాటిల్లే అగ్ని ప్రమాదాలు, వర్షాలు లేకపోవడం, అతి వర్షాలు, మహమ్మారి వ్యాధులు, దుర్భిక్షం, పంటలకు నష్టం కలగడం, అడవి జంతువుల సంఖ్య విపరీతంగా పెరగడం, రోగాలు, భూత పిశాచాదులు, పాములు, అదుపు తప్పిన ఏనుగులు, ఎలుకలు– ఇవీ రాజ్యంలో కలిగే ఆపదలు. పురాతన రాజ్యాల్లోనే కాదు, దుర్భిక్ష పరిస్థితులు వర్తమాన దేశాల్లోనూ ఉన్నాయి.

పురాతన కాలంలో ఆనకట్టలు కట్టే పరిజ్ఞానం లేకపోవడంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కోవడం కష్టంగా ఉండేది. ఆధునిక కాలంలో ఆనకట్టలు కట్టడం నేర్చుకున్నాం. నీటిపారుదలను మెరుగుపరచుకున్నాం. అయినా ఎక్కడో ఒకచోట కరవు తాండవిస్తూ ఉండటమే విచారకరం. ముందుచూపు లేకుండా అడవులను నరికివేయడం వల్లనే ప్రపంచంలో చాలా చోట్ల కరవు కాటకాలు తలెత్తుతున్నాయి. ఒకప్పటి పచ్చని నేలలు ఇప్పుడు బీడు భూములుగా, ఎడారులుగా మారుతున్నాయి. ‘విచారకరమైన సంగతేమిటంటే, అడవిని సృష్టించడం కంటే ఎడారిని సృష్టించడం సులువు’ అన్నాడు ఇంగ్లిష్ పర్యావరణ శాస్త్రవేత్త జేమ్స్ లవ్‌లాక్. కష్టమైన పనులు చేపట్టే బదులు సులువైన పనులు చేయడమే కదా మనుషుల సహజ లక్షణం. అందుకే సునాయాసంగా ఎక్కడికక్కడ ఎడారులను సృష్టిస్తున్నారు.

కరవు సాహిత్యం మనకు కరవు కాదు. దుర్భిక్ష వర్ణన తెలుగు సాహిత్యంలో శ్రీనాథుడితో మొదలైంది. అప్పట్లో కరవు కాటకాలకు ఆలవాలమైన పలనాటి సీమలో ఆకుకూరలతో జొన్నకూడు తినలేక శ్రీనాథుడు నానా తిప్పలు పడ్డాడు. చివరకు ఉక్రోషం అణచుకోలేక ‘ఫుల్ల సరోజనేత్ర యల పూతన చన్నుల చేదు ద్రావి నా/డల్ల దవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెదవేమొ? తింత్రిణీ/పల్లవ యుక్తమౌ నుడుకు బచ్చలి శాకము జొన్న కూటిలో/ మెల్లన నొక్క ముద్ద దిగమ్రింగుము నీ పస కాననయ్యెడిన్’ అంటూ సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణుడికే సవాలు విసిరాడు. కేవలం పలనాడులోనే కాదు, రేనాటి సీమలో కూడా శ్రీనాథుడికి కారం కలిపిన జొన్నకూడు తినవలసిన దుర్గతి తటస్థించింది. అప్పుడు ‘గరళము మ్రింగితి ననుచుం/బురహర గర్వింపబోకు పో పో పో నీ/ బిరుదింక గానవచ్చెడి/ మెరసెడి రేనాటి జొన్న మెతుకులు తినుమీ’ అని పరమశివుడిని సవాలు చేశాడు. దుర్భిక్ష దుర్గతిని అనుభవించి పలవరించిన తొలి తెలుగు కవి శ్రీనాథుడు.

ఆధునికులలో విద్వాన్ విశ్వం రాయలసీమలోని పెన్నా పరివాహక ప్రాంతంలోని పల్లెల కరవు కష్టాలకు చలించిపోయి, ‘అదే పెన్న! అదే పెన్న!/ నిదానించి నడు/ విదారించు నెదన్, వట్టి/ ఎడారి తమ్ముడు’ అంట ‘పెన్నేటి పాట’ను హృదయ విదారకంగా రాశారు. కరవు మనిషిని నానా రకాలుగా దిగజారుస్తుంది. నేరాలకు పురిగొల్పుతుంది. ‘కరవు కాలంలో రొట్టెముక్కను దొంగిలించిన మనిషిని దొంగగా చూడరాదు’ అన్నాడు బ్రిటిష్ గీత రచయిత క్యాట్ స్టీవెన్స్. అయితే, కరవు కాలంలో మనుషుల్లో అంత ఔదార్యం మిగిలి ఉంటుందా అన్నది అనుమానమే! మొదటి ప్రపంచ యుద్ధం దెబ్బకు 1914–23 కాలంలో భారత్ సహా నలభై ఐదు దేశాలు కరవు కాటకాలతో అల్లాడిపోయాయి. అప్పటి కరవుకాలంలో అమెరికా ఈ దేశాలను ఆదుకున్న తీరును, ఆనాటి కరవు తీవ్రతను వివరిస్తూ అమెరికన్ రచయిత, సామాజిక కార్యకర్త హెర్బర్ట్ హూవర్ ‘యాన్ అమెరికన్ ఎపిక్: ఫేమిన్ ఇన్ ఫార్టీ ఫైవ్ నేషన్స్’ అనే పుస్తకం రాశాడు.

నేటి ప్రపంచంలో కరవు కరాళనృత్యం చేసే దేశాల్లో సోమాలియా ముందు వరుసలో ఉంటుంది. ప్రకృతి కారణాలే కాకుండా; యుద్ధాలు, సంక్షోభాలు అక్కడి కరవును మరింత కర్కశంగా మారుస్తున్నాయి. ‘ఆకలి నా అనుదిన ఆహారం/ కరవు నా ఊపిరి/ నిర్లక్ష్యమే నా సంరక్షణ/ దాతల జోలపాటకు నేను నిద్రపోతాను/ ఆ పాట ఎలా పాడాలో వితరణ సంస్థలకు తెలుసు’ అంటాడు ‘నేను సోమాలీ శిశువును’ అనే కవితలో సోమాలీ కవి అబ్ది నూర్ హాజీ మహమ్మద్.

నేడు కరవు, ఎడారీకరణలపై పోరాట దినం. ప్రస్తుత ప్రపంచంలో ఇరవై మూడు దేశాలు గడచిన ఆర్థిక సంవత్సరంలో కరవు ఆత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. వీటిలో మూడు ఆఫ్రికన్ దేశాలైతే, వరుసగా నలభై ఏళ్ల నుంచి కరవుతోనే సతమతమవుతున్నాయి. కరవు కాటకాలు ఉన్నచోట అశాంతి, అలజడులు తప్పవు. మనుషుల్లో హింసా ప్రవృత్తి పెరుగుతుంది. ‘హింస కలుపుమొక్క లాంటిది. ఎంతటి కరవు వాటిల్లినా అది చావదు’ అన్నాడు ఆస్ట్రియన్ రచయిత సైమన్ వీసెంతాల్. నాజీల మారణకాండ నుంచి తప్పించుకుని, బతికి బట్టకట్టిన వాడాయన. కరవు కాటకాలు కనుమరుగైతే తప్ప ప్రపంచంలో శాంతి సామరస్యాలు సాధ్యంకావు. అయితే, అలాంటి రోజు ఎప్పటికైనా వస్తుందా? మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు ‘నిజంగానే నిఖిలలోకం / నిండు హర్షం వహిస్తుందా?/ మానవాళికి నిజంగానే/ మంచికాలం రహిస్తుందా?’

ఉప్పందిందా? లేక నిప్పులేని పొగేనా?


కామెంట్



కరణ్ థాపర్

జూన్ 1న ఎగ్జిట్ ఫలితాలు వెల్లడవటానికి ముందు రోజు మే 31న జరిగిన షేర్ల కొనుగోళ్లు, అమ్మకాల విలువ ఆ ముందరి రోజు జరిగిన దానికి రెట్టింపు! ఈ మొత్తం కొనుగోళ్లలో 58 శాతం వాటా విదేశీ ఇన్వెస్టర్లదే. ఎగ్జిట్ పోల్స్ అన్నీ మోదీ ఘన విజయం సాధించబోతున్నారని ప్రకటించిన రోజుకు సరిగ్గా ముందు రోజే స్టాక్ మార్కెట్‌లో రెట్టింపు ట్రేడింగ్ జరగటం యాదృచ్ఛికమైతే కాదు. దీనివల్ల అసలు ఎన్నికల ఫలితాలు వెల్లడైన జూన్ 4న స్టాక్ మార్కెట్ కుప్పకూలి పోవటం, సాధారణ ఇన్వెస్టర్ల షేర్ల విలువ పాతాళానికి పడిపోవటం జరిగింది. ఆ రోజు స్టాక్ మార్కెట్‌కు వచ్చిన నష్టం అక్షరాలా 30 లక్షల కోట్ల రూపాయలు. అందుకే... ‘ఎగ్జిట్‌పోల్ స్టాక్ మార్కెట్ స్కామ్’ జరిగిందా అన్నది ప్రశ్న.

మే 31–జూన్ 4 మధ్య నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ)లో ఏదైనా అనుమానాస్పదమైన, ఆందోళన కలిగించే పరిణామం సంభవించిందా? సంభవించింది అని రాహుల్ గాంధీ అంటున్నారు. దానిపై దర్యాప్తు జరిపించాలని ఆయన కోరుతున్నారు. అయితే ఆయన అంటున్నది నిజమేనని మనమెలా చెప్పగలం? వాస్తవాలను పరిశీలించడం ద్వారా మాత్రమే. కనుక ఈ విషయమై ‘ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్’ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి వద్ద అందుబాటులో ఉన్న కొన్ని వివరాలను మీ ముందు ఉంచుతాను. ఇందుకు చక్రవర్తినే నేను ఎంచుకోవటానికి కారణం రాహుల్ అంటున్న దానికి, చక్రవర్తి చెబుతున్నది చాలా దగ్గరి ఏకీభావం కలిగి ఉన్నదని నేను అనుకోవటం.



ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ

మొదటిది– మే 31న ఎన్.ఎస్.ఇ.లో జరిగిన షేర్ల కొనుగోళ్లు, అమ్మకాల విలువ ఆ ముందటి రోజు మొత్తాని కంటే రెట్టింపు. పదేళ్ళ క్రితం 2014 మే నెలలో ఇలాంటిదే నరేంద్ర మోదీ తన తొలి మెజారిటీ సాధించినప్పుడు జరిగినప్పటికీ అలా జరగడం ‘‘చాలా అరుదు’’ అని చక్రవర్తి అంటారు. 2020లో ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనా వైరస్‌ను ప్రపంచ మహమ్మారిగా ప్రకటించినప్పుడు సైతం స్టాక్ మార్కెట్ కార్యకలాపాలు ఆ ముందరి రోజు కన్నా రెట్టింపు ఏమీ కాలేదు. 22 శాతం మాత్రమే పెరిగాయి.

రెండవది– ఎన్.ఎస్.ఇ. సొంత డేటా చెబుతున్న దానిని బట్టి 31న జరిగిన ‘‘మొత్తం షేర్ల కొనుగోళ్లలో 58 శాతం వాటాను ఫారిన్ ఇన్వెస్టర్లే (ఎఫ్ఐలు) కలిగి ఉన్నారు’’ అని చక్రవర్తి అంటున్నారు. ‘‘ఇది ఆశ్చర్యంగా ఉంది. ఎందుకంటే వారంలో ఆ ముందు వరకు ఎఫ్ఐలు అంత భారీ మొత్తంలో షేర్లను కొనటం, కొన్న వాటికి మించి అమ్మటం జరగలేదు’’ అని కూడా ఆయన అన్నారు.

మరి విదేశీ ఇన్వెస్టర్లను అంత భారీ మొత్తాలలో కొనిపించింది ఏమిటి? భారీగా కొనటం మాత్రమే కాదు, 31న వారు అంతే భారీగా అమ్మకాలు కూడా జరిపారన్న వాస్తవాన్ని చక్రవర్తి విస్మరించారు. బదులుగా ఆయన, ‘‘తర్వాతి రోజు ఏం జరిగిందన్న దానిని బట్టే ఆ ముందు రోజు జరిగిన దానిని వివరించగలం’’ అన్నారు. తర్వాతి రోజు అంటే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు బయటికి వచ్చిన రోజు.

మే 31కి, జూన్ 1కి చక్రవర్తి పెట్టిన ఈ లంకె... ఎగ్జిట్ పోల్స్ ఫలితాల గురించి విదేశీ ఇన్వెస్టర్లకు ముందే తెలిసైనా ఉండాలి, లేదంటే వారికై వారు సర్వే జరిపించుకొని ఉండాలి అన్నదానిని సూచిస్తోంది.

అయితే విదేశీ ఇన్వెస్టర్లు అంత భారీగా షేర్లు కొనటానికి ఈ రెండూ కాకుండా మూడో కారణం ఏదైనా ఉండి ఉంటుందా?

ఉంటుందనైతే చక్రవర్తి అనుకోవటం లేదు. ‘‘ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా ఒకే రీతిన మోదీ అపారమైన విజయం సాధించబోతున్నారని ఫలితాలను వెల్లడించిన రోజుకు సరిగ్గా ముందు రోజే స్టాక్ మార్కెట్‌లో రెట్టింపు ట్రేడింగ్ అనే అత్యంత అరుదైన పరిణామం జరగటం అన్నది కేవలం యాదృచ్ఛికమైతే కాదు’’ అంటారాయన. కానీ అది యాదృచ్ఛికం ఎందుకు కాకూడదు? ఇందిరా గాంధీ తన మరణం గురించి మాట్లాడిన 24 గంటల తర్వాత ఆమె హత్య జరిగింది. అది యాదృచ్ఛికం మాత్రమే!

విషయాన్ని ఒకడుగు ముందుకు తీసుకెళదాం. విదేశీ ఇన్వెస్టర్లు మే 31న షేర్లు కొనుగోలు చేశారు. అయితే ఎగ్జిట్ పోల్స్ అనంతరం జూన్ 3న స్టాక్ మార్కెట్ రాకెట్‌లా పైకి దూసుకెళ్లింది. కాబట్టి అప్పుడు కనుక వారు ఆ షేర్లను అమ్ముకుని ఉంటే భారీగా లాభాలు వచ్చేవి. అలా చేయటంలోని నియమబద్ధత గురించే ఇప్పుడు చక్రవర్తి ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

ఇలాంటి ప్రశ్నలకు ఆయనైతే ఎలా సమాధానం ఇస్తారనే విషయంలో సందేహం లేదు. ‘‘సంఘటనల కాలక్రమం, స్టాక్ మార్కెట్ డేటాలను అనుసరించి... ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయటానికి మాత్రమే కాకుండా, స్టాక్ మార్కెట్‌లను ఉపయోగించి లాభపడటానికి కూడా ఎగ్జిట్ పోల్స్ ఆయుధాలు అయ్యాయని ఎవరైనా తేలిగ్గా చెప్పేయొచ్చు. ప్రపంచంలోనే మొట్టమొదటి ‘ఎగ్జిట్ పోల్ స్టాక్ మార్కెట్ స్కామ్’ ఇండియాలో జరిగి ఉంటుంది’’ అంటారు చక్రవర్తి.

మీడియా నిర్వహించినవి కనుక ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు లీక్ అయే అవకాశం ఉందనే విషయాన్ని పక్కనపెడదాం. ఒకవేళ విదేశీ ఇన్వెస్టర్లే తమ సొంతంగా ఎగ్జిట్ పోల్స్‌ని జరిపించుకొని ఉండి, ఆ ఫలితాలు కూడా మీడియా నిర్వహించిన ఫలితాల దిశనే సూచిస్తూ ఉండి, వాటి ఆధారంగా వాళ్లు షేర్లు కొని ఉంటే అప్పుడది నియమబద్ధం అవుతుందా? ఒకటే ప్రశ్న ఏమిటంటే... విదేశీ ఇన్వెస్టర్లు అంత ప్రయాసతో ఎగ్జిట్ పోల్స్ జరిపించుకొని ఉంటారా? నాకైతే సందేహమే.

సగటు భారతీయ పెట్టుబడిదారుల విషయానికి వద్దాం. మొదట, వారు విన్నది ఇదీ: నరేంద్ర మోదీ ‘ఎకనమిక్ టైమ్స్’తో (మే 23న) మాట్లాడుతూ, ‘‘నేను నమ్మకంగా చెప్పగలను, జూన్ 4న బీజేపీ రికార్డు స్థాయిలో సీట్లు గెలుచుకుంటుంది. స్టాక్ మార్కెట్ కూడా కొత్త రికార్డులకు చేరుకుంటుంది’’ అన్నారు. అంతకు ముందు హోంమంత్రి ‘ఎన్డీటీవీ’తో (మే 13న) మాట్లాడుతూ, ‘‘జూన్ 4 లోపు షేర్లు కొనమని మీకు చెబుతున్నాను. అవి అమాంతం పెరగబోతున్నాయి’’ అన్నారు.

ఆ సలహాలపై వారు షేర్లు కొని ఉంటే, జూన్ 4న ఎన్నికల ఫలితాల తర్వాత స్టాక్ మార్కెట్ కుప్పకూలి పోవటం, వారి షేర్ల విలువ పాతాళానికి పడిపోవటం చూశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆ రోజు స్టాక్ మార్కెట్‌కు వచ్చిన నష్టం రూ. 30 లక్షల కోట్లు.

దాంతో సాధారణ ఇన్వెస్టర్లు నష్టపోయారు. అయితే మూడు రోజుల తర్వాత, వారాంతంలో శుక్రవారం 7వ తేదీన స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి 4వ తేదీన వచ్చిన నష్టాన్ని భర్తీ చేసుకోవటం మాత్రమే కాదు, షేర్ల పెరుగుదల ఎన్నడూ లేనంతగా గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. ఇక్కడ ఇన్వెస్టర్లకు వచ్చినదానికంటే పోయినది ఎక్కువ.

దీనర్థం ‘సమస్య’ విదేశీ ఇన్వెస్టర్లలో ఉందని! అది దర్యాప్తు జరిపించవలసినంత సమస్యా? భారతదేశంలోని వ్యక్తులు, సంస్థల తరఫున వారు షేర్లలో పెట్టుబడి పెట్టి ఉంటారని మీకు అనుమానంగా ఉంటే అప్పుడు దర్యాప్తు అవసరం కావచ్చు. మీకలాంటి అనుమానం లేదా? వాళ్లు తమకై తామే ఇన్వెస్ట్ చేసి ఉంటారని బహుశా మీకు అనిపిస్తోందా? అప్పుడైతే తదుపరి చర్య అవసరం అవుతుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఉత్తి పుణ్యానికి...



ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య జరుగుతున్న విషాదాన్ని వర్ణించడానికి నేను మాటలు వెతుక్కుంటున్నాను. ఫాక్ లాండ్స్ యుద్ధాన్ని అర్జెంటీనా రచయిత బోర్హెస్ ‘ఇద్దరు బట్టతల వాళ్లు దువ్వెన కోసం కొట్లాడుకోవడం’ అని అభివర్ణించారు (అర్జెంటీనా, బ్రిటన్‌ల మధ్య జరిగింది). నేను అంత కంటే బాగా చెప్పలేను.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

వేటాడటం తగునా?



అరుంధతీ రాయ్‌ను వేటాడటం న్యాయం కాదు. ఆమె గొప్ప రచయిత్రి, తనకంటూ ఒక అభిప్రాయం కలిగివుండే హక్కు ఉంది. దశాబ్దం క్రితం ఆమె అన్నదాని మీద ఇప్పుడు కేసు పెట్టడంపై అంతర్జాతీయ గగ్గోలు రేగాలి.

– అమితవ్ ఘోష్, రచయిత

‘పని’ కాదు!



వ్యభిచారం చేయించేందుకు మహిళల్ని ఎందుకు బలవంతంగా అక్రమ రవాణా చేస్తారు? అదే ప్లంబర్లనో, ఫైర్ ఫైటర్లనో, వైద్యులనో ఎందుకు బలవంతంగా తరలించరు? ‘సెక్స్ వర్క్’ గురించి అదేం చెబుతోంది? మహిళల్ని మోసం చేసి, బలాత్కరించి దాన్ని చేయిస్తారనేగా?

– హన్నా బెర్రెల్లి, సంపాదకురాలు

పనిచేయాలా?



సీనియర్ సిటిజన్‌లా కనబడుతున్న ఒక పెద్దమనిషి నుంచి నా ‘స్విగ్గీ’ ఆర్డర్ తీసుకోవడం నన్ను మూగబోయేలా చేసింది. ఉపాధి హామీ పథకం కింద వచ్చే కూలీ కోసం వృద్ధులు ఎండలో పనిచేయడం గుర్తొచ్చింది. 70, 80 ఏళ్ల వృద్ధులు పనిచేస్తుంటే చూడటానికి బాధగా ఉంటుంది. వాళ్లకు సామాజిక భద్రత లేకపోవడం విషాదకరం.

– తారా కృష్ణమూర్తి, యాక్టివిస్ట్

అనడం ఆమోదనీయమా?



సైన్యం బలవంతంగా కశ్మీర్‌ను ఆక్రమించుకుందని అరుంధతీ రాయ్ చెప్పినట్టుగా ఆడియో, డాక్యుమెంటరీ సాక్ష్యాలున్నాయి. ఇది ఎలా ఆమోదనీయం? ఆమె మీద ఎందుకు చర్య తీసుకోకూడదు? దేశాన్ని ‘బనానా రిపబ్లిక్’ అని ఎందుకు అంటున్నారు?

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

నెమ్మదిగా జరుగుతుంది!



జనాలు ఎప్పుడూ ఏదో ఒక టర్నింగ్ పాయింట్ వచ్చి మొత్తం మారిపోతుందని ఎదురు చూస్తుంటారు. అలాంటిది ఒకటి అంటూ ఉండదు. నెమ్మదిగా మరింత మరింత మెరుగు కావడమే ఉంటుంది.

– రాబర్ట్ గ్రీనీ, రచయిత

ఇన్ బాక్స్

వామపక్షాలకు నూతనోత్తేజం

పార్లమెంటు ఎన్నికలలో సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. రెండు సీట్లు గెలుపొంది వామపక్ష శ్రేణులకు నూతనోత్తేజాన్ని కలిగించింది. బిహార్‌లోని అరా, కరాకట్ లోక్‌సభ స్థానాల నుండి లిబరేషన్ అభ్యర్థులు సుధామ ప్రసాద్, రాజారామ్ సింగ్‌లు విజయ బావుటా ఎగురవేశారు. భారత గడ్డపై ఫాసిస్టు శక్తుల పెరుగుదల అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన నేపథ్యంలో ప్రతిపక్షాలను ఒకతాటిపైకి తెచ్చేందుకు లిబరేషన్ తన వంతు కృషి చేస్తూ ‘ఇండియా’ కూటమిలో భాగస్వామిగా మారింది. అరా, కరాకట్, నలందా, కొడర్మ సీట్లలో బరిలో నిలిచింది. నలందా నియోజకవర్గంలో గట్టి పోటీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే సందీప్ సౌరభ్ రెండో స్థానంలో నిలిచారు. జార్ఖండ్‌లో కొడర్మలో వినోద్ సింగ్ (బాగోదర్ ఎమ్మెల్యే) రెండో స్థానంలో నిలిచారు. బిహార్‌లో అజియాన్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగగా దానిని లిబరేషన్ నిలబెట్టుకుంది. ఇక్కడ శివ్ ప్రకాష్ రంజన్ విజయం సాధించారు.

మొదట సాయుధ మార్గాన్ని అనుసరించిన లిబరేషన్ పార్టీ కాలక్రమంలో తన పంథాను మార్చుకుంది. ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్ (ఐపీఎఫ్)ను ఏర్పాటు చేసి 1985 ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికల్లో పాల్గొంది. 1989 పార్లమెంటు, 1990 అసెంబ్లీ ఎన్నికలలో బరిలో నిలిచి ఆశ్చర్యకరమైన ఫలితాలు సాధించింది. 1989లో తొలిసారిగా రామేశ్వర ప్రసాద్‌ను అరా నియోజకవర్గం నుంచి పార్లమెంటుకి పంపింది. ఆ తర్వాత జయంతా రోంగ్పి అస్సాంలోని కర్బీ అంగ్లాంగ్ నుంచి పలుమార్లు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ ఇద్దరు ఎంపీలను బిహార్ నుంచి పార్లమెంట్‌కు పంపింది.


1995 అసెంబ్లీ ఎన్నికల నాటి నుండి సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ పేరుతో పోటీ చేస్తోంది. 2010 ఎన్నికల్లో తప్ప మినహా ఆ పార్టీ ప్రతినిధులు మిగిలిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తమ గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. గతంలో ఒంటరిగా పోటీ చేసి పదకొండు మంది సభ్యులను అసెంబ్లీకి పంపిన చరిత్ర లిబరేషన్‌కు ఉంది. జైలులో ఉండి శాసన సభకు గెలిచిన చరిత్రా ఉంది. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లిబరేషన్ అపూర్వ విజయాల్ని సొంతం చేసుకుంది. 19 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల గెలిచింది. ఒక మహిళా ఎమ్మెల్సీ శాసన మండలిలో ప్రాతినిధ్యం కలిగి ఉంది. సీట్ల సంఖ్యలో తరుగుదల, పెరుగుదల ఉన్నప్పటికీ నికరమైన, స్థిరమైన ఓటు బ్యాంకు, బలమైన ప్రజా పునాది కలిగి ఉండటం విశేషం. జార్ఖండ్ రాష్ట్రంలోనూ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం సుదీర్ఘ కాలంగా ఉంది. గతంలో అస్సాం, పంజాబ్ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. 25 రాష్ట్రాలలో పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం కలిగి ఉంది.

‘రణవీర్ సేన’ లాంటి ప్రైవేటు సైన్యాలను ఎదుర్కొన్న వీరోచిత చరిత్ర లిబరేషన్‌ది. అణచివేతలపైనా, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల తరబడి పోరాటాలు కొనసాగిస్తూ వస్తోంది. విద్య, వైద్యం, భూమిలేని పేదల కోసం, రైతుల హక్కుల కోసం, ప్రాజెక్టుల కోసం ఉద్యమాలు నడిపింది. నిరంతరం పేదల కోసం పోరాడిన సుధామ ప్రసాద్, రాజారామ్ సింగ్‌లు పేదల హక్కుల్ని కాపాడడం కోసం పార్లమెంట్‌లో తమ గళాన్ని బలంగా వినిపించబోతున్నారు.

– మామిండ్ల రమేష్ రాజా,
సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి । 78932 30218

ఇకపైన పొటాషియం ఉప్పు వాడకం?!

అభిప్రాయం



డా. కె.బి. గోపాలం

మానవ జీవితంలో ప్రాధాన్యం ఉన్న లవణం ఉప్పు (సోడియం క్లోరైడ్). దీన్ని ఆహారంలో తీసుకునే పరిమాణాన్ని బట్టి మన ఆరోగ్య పరిస్థితి ఆధారపడి ఉంటుందనేది ప్రచారంలో ఉన్న విషయం. ఒకప్పుడు అయోడిన్ అనే సూక్ష్మ పోషకం లోపం కారణంగా చాలామంది ఆరోగ్య సమస్యను ఎదుర్కొన్నందున అయోడిన్ కలిపిన ఉప్పును వాడుతూ ఆ సమస్య నుంచి బయటపడ్డారు. ఇప్పుడు మరో కొత్త విషయాన్ని కనుగొన్నారు. పొటాషియాన్ని తగినంతగా తీసుకోకపోవడం వల్ల బీపీ (బ్లడ్ ప్రెషర్) పెరుగుతున్నదనీ, అందువల్ల ఉప్పులో పొటాషియంను కలిపి తీసుకోవాల్సిన అవసరం ఉందనీ పరిశోధకుల సలహా.

ప్రజల్లో అయోడిన్ లోపాన్ని సరిదిద్దడానికి ప్రభుత్వపరంగా నిర్ణయాలు జరిగాయి. పరిశ్రమల వారు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కనుక ప్రపంచంలో అందరికీ ఉప్పుతో పాటు అయోడిన్ కూడా అందింది. మొత్తం మీద ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఒక ఆరోగ్య సమస్యకు అన్ని దేశాల వారూ కలిసి సమాధానం తెలుసుకుని అమలు చేయగలిగారు. మరి అదే విధంగా పొటాషియం లోపాన్ని తగ్గించడానికి ఇంతటి కృషి ప్రపంచవ్యాప్తంగా జరుగుతుందా?



మనకు తెలిసి హైపర్ టెన్షన్, లేదా అధిక రక్తపోటు అనేది పెద్ద ఆరోగ్య సమస్య. అసలు నిజానికి అనారోగ్యాలు, మరణాలకు ఇదే ఎక్కువగా కారణంగా ఉంటున్నది. అందుకు కారణం ఏమిటి అని వెతికితే ఉప్పు ఎక్కువగా తినడం అని తెలిసిపోయింది. ఇంకేముంది, అందరూ వీలైనంత తక్కువగా ఉప్పు తింటున్నారు. చాలామంది కారం కూడా తినడం లేదు. మొత్తానికి తిండి తీరు మారిపోయింది. ఇక్కడ ఒక చిన్న చిక్కు ఉన్నది. ఉప్పు ప్రభావం అందరి మీద ఉంటుంది అనడానికి లేదు. ప్రభావం కనిపించే 50 శాతం మందిలో మాత్రం అది సూటిగా తెలిసిపోతుంది. ఉప్పు ప్రభావం మీద జన్యుపరంగా వచ్చే లక్షణాల పాత్ర ఉందని తెలిసింది. పరిశోధకులు అంతా పూనుకుని ఈ విషయం గురించి ఎన్నో సంగతులను కనుగొన్నారు. ఇప్పుడు అందరూ పొటాషియం కలిపిన ఉప్పు తింటే ఈ బ్లడ్ ప్రెషర్ సమస్య తగ్గుతుందని అంటున్నారు. అంటే మనం తినే తిండి తీరు మరొకసారి మారిపోతుందన్నమాట.

ఏదో ఒక పేరున అందరూ సోడియం బాగా తింటున్నారు. అవసరం కన్నా ఎక్కువ తింటున్నారు. కనుక రక్తపోటు పెరుగుతున్నది. ఎవరికీ ప్రయత్నించి పొటాషియం తినడం అన్నది తెలియదు. శరీరానికి అవసరమైనంత పొటాషియం తినేవారు మొత్తం జనాభాలో 14 శాతం మాత్రమే ఉన్నారని పరిశోధకులు గుర్తించారు.

సోడియం పూర్తిగా తినకుండా ఉండడం కుదరదు. అదే సమయంలో శరీరంలో సోడియం – పొటాషియం ఉండవలసినంత ఉంటేనే ఆరోగ్యం బాగుంటుంది. ఈ సంగతి ఎవరికీ అంత వివరంగా తెలియదు. అంటే మరోసారి ప్రభుత్వాలు, పరిశ్రమల వారు పరిస్థితిని గుర్తించి పనిలోకి దిగవలసిన సమయం వచ్చింది. ఒకప్పుడు ఉప్పుతో కలిపి అయోడిన్ తిన్నట్టే, ఇప్పుడు ఉప్పుతోనూ, మరిన్ని రకాలుగానూ సోడియం బదులు పొటాషియం తీసుకోవాలి. ఈ మార్పు వస్తే వెంటనే బ్లడ్ ప్రెషర్ అంటే రక్త పోటు అనే సమస్యకు దానంతట అదే సమాధానం దొరుకుతుంది. కనుక ప్రస్తుతం మన పరిస్థితిని గుర్తించుకొని వెంటనే అదనంగా పొటాషియం తీసుకోవడం మొదలుపెట్టాలి. పరిశ్రమల వారు ఉప్పుతోనూ, తిండి పదార్థాలతోనూ పొటాషియం అదనంగా అందించే పరిస్థితి లేకపోతే ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి.


రక్తపోటు పెరగడం ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలకు ప్రపంచం తల్లడిల్లిపోతున్నది. సోడియంతో పాటు పొటాషియం తిన్నందుకు రుచిలో ఎటువంటి తేడా కూడా రాదు. ఇది అందరూ గుర్తించవలసిన మరొక విషయం. సిడ్నీ (ఆస్ట్రేలియా)లో ఉన్న ‘జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్’ అనే సంస్థలో పనిచేస్తున్న బ్రూస్ నీల్ పొటాషియం వాడుక మంచిదని గట్టిగా చెబుతున్నారు.

ఇక్కడ గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. మనం తినే తిండిలో ఎంత పొటాషియం ఉంది అని గుర్తించడం కష్టం. అందరూ అవసరమైన దానికి తక్కువ తీసుకుంటున్నారు అన్నది మాత్రం నిజం. కనీసం 3.5 గ్రాముల పొటాషియం శరీరానికి అందాలి. అందుకోసం అందరూ పండ్లు ఎక్కువగా తినాలట! అన్నట్టు అరటిపళ్ళలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. బొప్పాయి పళ్లలో కూడా ఉంటుంది. ఏదో రకంగా పొటాషియం శరీరానికి అందే పద్ధతులు రావాలి. త్వరలోనే రక్తపోటు సమస్య తగ్గుతుందని పరిశోధకులు భరోసా ఇస్తున్నారు.

వ్యాసకర్త సైన్స్ విషయాల రచయిత । 98490 62055

మౌలిక విధులు

ఇస్లామ్ ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాల్లో ‘హజ్’ కూడా ఒకటి. కలిమా, నమాజ్ , రోజా, జకాత్ , హజ్ అనే మౌలిక సూత్రాల్లో ఏ ఒక్క దాన్ని నమ్మక పోయినా విశ్వాసం పరిపూర్ణం కాదు. అందుకని ఈ ఐదు అంశాల పట్ల విశ్వాసం కలిగి ఉండాలి. ఇందులోని చివరి అంశం హజ్. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం మక్కాలో నిర్మించిన దైవ గృహ సందర్శనా ప్రక్రియను ‘హజ్’ అంటారు. హజ్ అనేది ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా తప్పక ఆచరించాల్సిన విధి. ఇది జిల్ హజ్జ్ నెల పదవ తేదీన మక్కాలో నిర్వహించబడుతుంది. అదేరోజు యావత్ ప్రపంచ ముస్లింలు ఈద్ జరుపుకొని ఖుర్బానీలు సమర్పిస్తారు. ఇస్లామీయ క్యాలండరులో ఇది చివరి నెల. దీని తరువాత కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది.



అందుకే ఈ నెలకు ఎనలేని ప్రాముఖ్యం ఏర్పడింది. ఈ నెలలోని మొదటి పదిరోజులూ చాలా ప్రాముఖ్యం కలిగినవి. ఈ దశకంలో దైవ కారుణ్యం కుండపోతగా వర్షిస్తూ ఉంటుంది. ఈ రోజుల్లో చేసే ప్రతి సత్కార్యమూ గొప్ప ప్రాముఖ్యాన్ని కలిగి దేవుని కృపకు పాత్రమవుతుంది. ఈ దినాల్లో చేసిన ఆరాధనలు ప్రీతికరమైనంతగా, మరే ఇతర దినాల్లో చేసిన ఆరాధనలు కూడా దైవానికి అంతగా ప్రీతికరం కావు. ఈరోజుల్లో పాటించే ఒక్కొక్క రోజా (ఉపవాసం)... ఏడాది మొత్తం పాటించే రోజాలకు సమానం. ‘అరఫా’ (జిల్ హజ్ నెల 9వ తేదీ) నాటి ఒక్క రోజా రెండు సంవత్సరాల పాపాలను ప్రక్షాళన చేస్తుంది. అరఫా రోజు సైతాన్ ఘోర పరాజయాన్ని చవిచూస్తాడు. అవమాన భారంతో చితికి పోతాడు.

‘అరఫా’ రోజు ‘లాయిలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీక లహూ, లహుల్ ముల్కు వలహుల్ హందు వహువ అలాకుల్లి షయ్ ఇన్ ఖదీర్’ అనే దుఆ ఎక్కువగా పఠిస్తూ ఉండాలి. దీనితో పాటు ‘తహ్ లీల్’ అంటే, ‘లాయిలాహ ఇల్లల్లాహ్’; ‘తక్బీర్’ అంటే, ‘అల్లాహు అక్బర్’; ‘తహ్ మీద్ ’ అంటే, ‘అల్ హందులిల్లాహ్’; ‘తస్ బీహ్’ అంటే, ‘సుబ్ హానల్లాహ్’ అని తరచుగా ధ్యానిస్తూ ఉండాలి. అరఫా రోజే కాకుండా ‘అయ్యామె తష్రీఖ్’లో కూడా అంటే, పండుగ తరువాతి మూడు రోజులూ (జిల్ హజ్ నెలలోని 11, 12, 13 తేదీలు) వీలైనంత అధికంగా ఈ వచనాలు పఠించాలి. కనుక ఈ సుదినాలను సద్వినియోగం చేసుకుంటూ పండుగ ముందు రోజు పాటించే ‘అరఫా’ ఉపవాసం పాటించి, సత్కార్యాలు ఆచరిస్తూ దైవకృపకు పాత్రులు కావడానికి ప్రయత్నించాలి. దైవం మనందరికీ సన్మార్గ పథం అనుగ్రహించుగాక!

– మదీహా అర్జుమంద్ (నేడు బక్రీద్)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ఏకాదశి తె.4.26 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** చిత్త ప.12.35 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.6.40 నుండి 8.24 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.19 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.5.06 నుండి 6.50 వరకు(తెల్లవారితే మంగళవారం); **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.29 ; **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

'హత్యాచారం నిందితుడిని కఠినంగా శిక్షించాలి'

సాక్షి, హైదరాబాద్: ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారం చేసిన నిందితునికి కఠిన శిక్ష విధించాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల పక్కనే బాలిక ఉన్నా కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆమె విజ్ఞప్తి చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితునికి శిక్ష ఖరారు చేయాలని ఆ ప్రకటనలో సునీతారావు డిమాండ్ చేశారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

రామగుండం: తనకు ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో మంచిర్యాల తిలక్‌నగర్‌కు చెందిన బెడద రాజేశ్ (27) ఆదివారం పెద్దపల్లి జిల్లా రామగుండం సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతర్గాం ఎస్ఐ బోయ వెంకట్ కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన బెడద దుర్గయ్య కుమారుడు రాజేశ్ రెండుసార్లు కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. తమ్ముడు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండటం, తనకు ఉద్యోగం రావడం లేదని తరచూ మనస్తాపానికి గురయ్యేవాడు. ఈక్రమంలో శ్రీరాంపూర్‌లోని మిత్రుడి వద్దకు వెళ్తున్నానని శనివారం రాత్రి ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనం తీసుకొని బయటికెళ్లాడు. ఆదివారం వరకూ రాకపోవడంతో పలుచోట్ల గాలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వంతెనపై ద్విచక్ర వాహనం, చెప్పులు కనిపించడంతో ప్రాజెక్టు సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద లభించిన ఆధారాల ప్రకారం రాజేశ్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ వెంకట్ తెలిపారు.

దోషులను వదిలి బాధితులపై చర్యలా?

- పోలీసుల తీరుపై వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: బక్రీద్ పండగ పేరిట గోవధను ప్రోత్సహిస్తున్న వారిని వదిలేసి పోలీసులు ఆగడాలను అడ్డుకుంటున్న వారిని రిమాండ్‌కు తరలించడాన్ని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్‌దళ్ తీవ్రంగా ఖండించాయి. పోలీసులు పక్షపాతధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ పెద్దల కోసం, ఓటు బ్యాంకు రాజకీయాలకు తలొగ్గిన పోలీసులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, రాష్ట్ర ప్రచార్ ప్రముఖ్ పి.బాలస్వామి, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. తక్షణమే గోవధకు పాల్పడుతున్నవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

రెండు మార్కెట్ కమిటీల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: నెక్కొండ, కోటిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలక సభ్యులను, చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు మంత్రి తుమ్మల శుభాకాంక్షలు తెలిపారు.

రామోజీరావుకు నివాళి



మాట్లాడుతున్న తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): క్రమశిక్షణకు మారుపేరు రామోజీరావు అని, ఆయన జీవితం చూసి నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలుగు పత్రికకు జాతీయస్థానం కల్పించిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఆయన వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనదని, అంత పేరు ప్రఖ్యాతులు వచ్చినా ఏనాడూ ప్రచారం కోసం తహతహలాడలేదని స్పష్టం చేశారు. జర్నలిజాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకువెళ్లిన వ్యక్తి రామోజీ అని ప్రశంసించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, అల్లం నారాయణ, డి.ఎస్.ప్రసాద్, ఎం.నాగేశ్వర రావుతో పాటు పెద్ద సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.


వీహెచ్‌కు రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు జన్మదినం సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి వీహెచ్ మరింత సేవ చేయాలని కోరుకుంటున్నట్టు ఎక్స్ వేదికగా రేవంత్ ట్వీట్ చేశారు.

సాగులో యంత్రాలేవీ?

- డ్రోన్ల వినియోగంపై నిర్లక్ష్యం
- వ్యవసాయంలో యాంత్రీకరణను పట్టించుకోని ప్రభుత్వం
- సాగు పెరిగినా యంత్రాలు లేక రైతుల ఇబ్బందులు
- కూలీల కొరతతో రైతుల అవస్థలు

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. సంప్రదాయ సాగు నుంచి ఆధునిక శైలిలో పంటలు పండించే పద్ధతి పెరుగుతోంది. యంత్రాలకు తోడు డ్రోన్లు వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. విత్తనాలు వేయడం నుంచి ఎరువులు చల్లడం వరకు అన్ని రంగాల్లో డ్రోన్లు గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు డ్రోన్లు అందుబాటులో ఉంచాలని ఆగ్రోస్ నిర్ణయించినా, ఆచరణలో మాత్రం అమలుకావడంలేదు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా వాటిని అందుబాటులోకి తెచ్చి రైతులకు అద్దెకు ఇవ్వాలని భావించారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలుంటే, వాటన్నింటిలోనూ డ్రోన్లు అందుబాటులో ఉంచాలనుకున్నారు. కానీ ఇప్పటికీ డ్రోన్లతోపాటు వ్యవసాయ యంత్రాలను కూడా రైతులకు సబ్సిడీపై ఇవ్వడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణపై మార్గదర్శకాలను ఖరారు చేయడంలోనే వ్యవసాయశాఖలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్న విమర్శలున్నాయి.



దుక్కు యంత్రాలు కూడా ఇచ్చే దిక్కులేదా?

రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వ్యవసాయంలో విస్తీర్ణ పరంగా దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఉత్పత్తి కూడా అదే స్థాయిలో ఉంది. ఇపుడు వానాకాలం సీజన్ మొదలై రైతులు విత్తనాలు చల్లుతూ, దుక్కులు చేస్తున్నారు. ఈ కీలకమైన సమయంలో రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం ఎదురు చూస్తున్నారు. దుక్కు యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్ వంటివి సైతం రైతులకు సబ్సిడీపై ఇచ్చే దిక్కు కూడా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక్కో డ్రోన్ రూ.10 లక్షలు...

ఇప్పటివరకు వ్యవసాయ యాంత్రీకరణలో ఇకపై డ్రోన్లను కూడా ఇవ్వాలని నిర్ణయించారు. డ్రోన్ ఆధారిత స్ప్రే పద్ధతుల వల్ల తక్కువ మొత్తంలో నీరు, పురుగుమందులు అవసరమవుతాయి. విత్తనాలు చల్లడంలో డ్రోన్లను వినియోగించడం వల్ల కచ్చితత్వం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎరువులను డ్రోన్ల ద్వారా చల్లితే ప్రతీ మొక్కకు చేరుతుందని భావిస్తున్నారు. ఒక్కో డ్రోన్ ధర రూ.10 లక్షలు అవుతుందని అంచనా వేశారు. అయితే సీజన్ మొదలైనా సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల సరఫరాపై స్పష్టత రాలేదు.

కూలీలు దొరక్క రైతుల అవస్థలు

దుక్కు యంత్రాలను బయట మార్కెట్లో కొనాలంటే ధరలు భరించడం కష్టం. మరోవైపు కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరాది నుంచి కూలీలను తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సబ్సిడీపై యంత్రాలను ఇవ్వాలి. 2018 వరకు భారీగా ట్రాక్టర్లు సహా వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై ప్రభుత్వమే ఇచ్చింది. వ్యవసాయ యంత్రాలు తీసుకునే ఎస్సీ, ఎస్టీలకు ట్రాక్టర్లు సహా కొన్నింటిపై 95 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీతో సరఫరా చేసింది. ఐదేళ్లుగా ఈ పథకం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏమయ్యాయి?

వరి సాగు భారీగా ఉండటంతో రాష్ట్రంలో కోత యంత్రాలకు కొరత ఏర్పడుతోంది. ఒక్కసారే కోతకు రావడంతో మిషిన్లు అందుబాటులో లేక అనేక సార్లు వడగండ్లకు, వర్షాలకు పంట నష్టపోతున్నారు. దీంతో ఓలా, ఊబర్ మాదిరి వ్యవసాయానికి సంబంధించిన భారీ కోత, నాటు మిషిన్లు బుక్ చేసుకుంటే అద్దెకు పంపించేలా కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని గతంలో వ్యవసాయశాఖ చెప్పింది. అయితే ఇంతవరకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఎలా ఉండాలి? ఎవరి ఆధ్వర్యంలో నడిపించాలనే దానిపై స్పష్టత లేకుండా పోయింది.

మెదక్ బంద్ ప్రశాంతం

- భారీగా పోలీసుల మోహరింపు...అర్ధరాత్రి బీజేపీ నాయకుల అరెస్ట్
- గొడవకు కారణమైన 45 మందిపై కేసు...9 మందికి రిమాండ్

సాక్షి, హైదరాబాద్/ మెదక్‌జోన్/శంషాబాద్: మెదక్ పట్టణ బంద్ ప్రశాంతంగా జరిగింది. బీజేపీ నేతల ఆదివారం బంద్‌కు పిలుపునివ్వగా, వర్తక, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఇరువర్గాల ఘర్షణల నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. శనివారం అర్ధరాత్రి దాటాక బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బీజేవైఎం నేత సతీష్‌తోపాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం వారిని జడ్జి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించగా మెదక్ సబ్ జైలుకు తరలించారు.



పట్టణంలో స్వచ్ఛందంగా మూసి ఉంచిన దుకాణాలు

ఎవరినీ ఉపేక్షించం: ఐజీ రంగనాథ్

గొడవకు బాధ్యులైన ఎవరినీ ఉపేక్షించమని, ఇందుకు కారణమైన 45 మందిపై కేసులు నమోదు చేశామని మల్టీజోన్ ఐజీ రంగనాథ్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, దాని అనుబంధ సంస్థలకు చెందిన 23 మందితోపాటు 22 మంది ముస్లింలపై కేసులు నమోదు చేశామన్నారు. పోలీసులు ఒక్కవర్గం వారిని మాత్రమే రిమాండ్ చేశారని, మరోవర్గం వారిని చేయలేదంటూ సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాన్ని నమ్మొద్దని, ఘటనకు బాధ్యులైన ముస్లింలను కూడా రిమాండ్ చేస్తామన్నారు.

- మెదక్‌లో రెండువర్గాల మధ్య జరిగిన ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.
- మెదక్ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణలో ఎలాంటి మత కల్లోలాలకు తావు లేకుండా పూర్తి ప్రశాంతంగా ఉండేదని గుర్తు చేశారు.
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మెదక్ పర్యటనను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ముంబయి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అల్లర్లలో గాయపడిన వారిని మియాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం రాజాసింగ్ తన నివాసానికి వెళ్లేంత వరకు ఆర్‌జీఐఏ పోలీసులు ఆయన వెంటే ఉన్నారు.

మెదక్ ఘర్షణల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సాక్షి, హైదరాబాద్

మెదక్ ఘర్షణల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. మెదక్ పట్టణంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బీజేవైఎం, భజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు విధ్వంసం సృష్టించారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించిన మీడియా సమావేశంలో కూడా వీరి ప్రమేయమున్నట్టుగా పేర్కొన్నారన్నారు. ప్రజల మధ్య భావోద్వేగాలు రెచ్చగొట్టి, వైషమ్యాలు సృష్టించి తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ఏమాత్రం తగదని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో ఆయన హెచ్చరించారు.

కేసీఆర్ వివరణ ఇవ్వాలి

గత ప్రభుత్వ హయాంలో చత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో జరిగిన విద్యుత్తు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై కమిషన్ లేవనెత్తిన అంశాల పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వివరణ ఇవ్వాలని తమ్మినేని డిమాండ్ చేశారు. విచారణ పారదర్శకంగా లేకపోవడంతో తాను కమిషన్ ముందు హాజరుకానని, కమిషన్ చైర్మన్ స్వచ్ఛందంగా తప్పుకోవాలని కేసీఆర్ చెప్పడం సరికాదని హితవు పలికారు.

కేసీఆర్ వ్యవహారాన్ని కోర్టు సుమోటోగా తీసుకోవాలి

చట్టవిరుద్ధంగా లేఖ రాయడం ఆయన అహంకారానికి నిదర్శనం: టీపీసీసీ నేత నిరంజన్

సాక్షి, హైదరాబాద్: జస్టిస్ నర్సింహారెడ్డిని ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర హైకోర్టు సుమోటోగా తీసుకోవాలని, ఆయనను మందలించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...తానొక్కడినే మేధావినని, తనకే అన్నీ తెలుసునని, తాను చట్టానికి అతీతుడనని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారన్నారు. ఓ అంశంపై విచారణ జరుపుతున్న జస్టిస్‌ను తప్పుకోవాలని అనడం ఆయన అహంకారానికి నిదర్శనమని చెప్పారు. విచారించే అర్హత కోల్పోయారని, నిష్పాక్షికత కనిపించడం లేదని, ఏం చెప్పినా ప్రయోజనం ఉండదని ఒక జస్టిస్‌ను ఉద్దేశించి కేసీఆర్ ధిక్కార పూర్వక వ్యాఖ్యలు చేయడం క్షమార్హం కాదని, కేసీఆర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీఆర్ తీరు సరికాదు

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ విచారణ కమిషన్ ఎదుట మాజీ సీఎం కేసీఆర్ హాజరుకాకుండా, అసలు కమిషన్‌కు విచారణ జరిపే అర్హత లేదంటూ విమర్శించడాన్ని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా తప్పుపట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, పవర్ ప్లాంట్ల ఏర్పాటు అంశాలపై కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు చేసిన కమిషన్ ముందు కేసీఆర్ హాజరై వివరణ ఇచ్చి ఉంటే, ఆయనకే గౌరవంగా ఉండేదని, అసలు వివరణ ఇవ్వకుండా, విచారణ కమిషన్‌ను విమర్శిస్తూ లేఖ రాయడం విచారణ వ్యవస్థలను అగౌరవపరచడమే అని, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ తీరు అప్రజాస్వామికమని మహేశ్వర్‌రెడ్డి ఆక్షేపించారు.



ముత్యాలమ్మకు బోనాలు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పూసూరు గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మకు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించి ఏడాదైన సందర్భాన్ని పురస్కరించుకుని గోదావరి నదీ జలాలు తెచ్చి.. ప్రతి ఇంటి నుంచి బోనాన్ని అమ్మవారికి సమర్పించి కొలిచారు.

కాట్నపల్లి ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- నిందితుడికి సత్వరమే శిక్ష పడేలా చర్యలు
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ
- మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి), పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని రైస్‌మిల్లు సమీపంలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, ఆ పై హత్య చేసిన దారుణ ఘటనలో నిందితుడికి సత్వరమే శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క, ఐటీ, పురపాలక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రి వర్గం ఈమేరకు నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్న దంపతుల ఆరేళ్ల కూతురిని బీహార్‌కు చెందిన యువకుడు ఈనెల 14న అపహరించి హత్యాచారం చేసిన ఘటన తమను కలచివేసిందన్నారు. మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం రైస్‌మిల్లు సమీపంలోని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, హత్యాచార ఘటనపై సీఎంతోపాటు మంత్రివర్గం, ఎంపీ, ఎమ్మెల్యేలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. నిందితునికి త్వరగా శిక్ష పడేలా చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు చర్యలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

బాధిత కుటుంబానికి రూ.8లక్షలు

బాధిత కుటుంబానికి రైస్‌మిల్లు యాజమాన్యం నుంచి రూ.5.50లక్షలు ఇప్పించాలని, ప్రభుత్వం ద్వారా మరో రూ.2.50లక్షలు పరిహారం అందించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అదే విధంగా చిన్నారి తండ్రికి ఉద్యోగావకాశం కల్పించడంతో పాటు సొంతిల్లు మంజూరు చేసేలా వారి స్వస్థలం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌తో చర్చించామని ఆయన తెలిపారు. మంత్రుల వెంట కలెక్టర్ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాస్ ఉన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది కాట్నపల్లి లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయాలపై నిరంతర నిఘా పెంచి వాటిపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. మంత్రులు పెద్దపల్లిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, మత్తులో ఉండడంవల్లే సుల్తానాబాద్ రైస్‌మిల్లులో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య జరిగిందని భావిస్తున్నామన్నారు.

స్క్రాప్ పేరిట విదేశాలకు వాహనాల తరలింపు

- ఈఎంఐ కడతామని వాహనాల కొనుగోళ్లు...
- అంతర్జాతీయ ముఠా అరెస్టు

రామన్నపేట(వరంగల్): ఈఎంఐలు చెల్లిస్తామని వాహనాలు కొనుగోలు చేసి.. స్క్రాప్ కింద విదేశాలకు తరలించే అంతర్జాతీయ ముఠాను అరెస్ట్ చేసినట్టు డీసీపీ మహ్మమద్ అబ్దుల్ బారీ తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ నందిరాంనాయక్‌తో కలిసి ఆ వివరాలు వెల్లడించారు. దశరథ, దుర్గం సందాన్, కొశెట్టి రాకేశ్, మహ్మద్‌జాబీర్‌లు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో ఆర్థిక ఇబ్బందులతో పెద్దపెద్ద వాహనాలను అమ్మకానికి పెట్టిన యజమానుల నుంచి ఈఎంఐలు చెల్లిస్తామని నమ్మించి వాటిని కొన్నారు. ఆపై స్క్రాప్ చేసి ముంబయిలో కొన్ని టీంల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి 16 కేసుల్లో జైలుకు వెళ్లారు. తిరిగి వచ్చాక వారి తీరు మారలేదు. 2023 నుంచి మట్టెవాడ, తిప్పర్తి, ఆమనగల్లు, మోకిల కల్వకుర్తి, కీసరలో రూ.4.5 కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని స్క్రాప్ కింద నెదర్లాండ్, సౌత్ఆఫ్రికా, కంబోడియా దేశాలకు ఎగుమతి చేశారు. నిందితులను వరంగల్ ఆటోనగర్‌లోని హనుమాన్‌జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 లక్షల విలువైన కార్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 12 కేసులు ఉన్నాయి. 23 వాహనాలు అక్రమ పద్ధతిలో విదేశాలకు పంపించినట్టు పోలీసులు గుర్తించారు.

బస్టాండ్‌లో మహిళ ప్రసవం

- పురుడుపోసిన ఆర్టీసీ సిబ్బంది
- ఒడిశాకు చెందిన తల్లీబిడ్డ క్షేమం
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఘటన



పురుడుపోస్తున్న ఆర్టీసీ, 108 సిబ్బంది

కరీంనగర్ టౌన్: భర్తతో కలిసి స్వస్థలానికి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ నిండు గర్భిణి కరీంనగర్ బస్టాండులో ఆదివారం సాయంత్రం పండంటి ఆడబిడ్డను ప్రసవించింది. ఆర్టీసీ, 108 సిబ్బంది ఆ మహిళకు పురుడుపోశారు. ఒడిశాకు చెందిన కుమారి– దూల దంపతులు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఇటుక బట్టీలో కొద్దిరోజులుగా కూలీలుగా పనిచేస్తున్నారు. నిండు గర్భిణీ అయిన కుమారిని తీసుకుని ఆమె భర్త దూల ఆదివారం కుంట–భద్రాచలం మీదుగా స్వస్థలానికి వెళ్లేందుకు కరీంనగర్ బస్‌స్టేషన్ చేరుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో కుమారికి పురిటినొప్పులు వచ్చాయి. కాసేపటికి ఎక్కువ కావడంతో ఆమె భర్త అక్కడే ఉన్న ఆర్టీసీసిబ్బంది సాయం కోరాడు. వారు వెంటనే 108 సిబ్బందికి ఫోన్ చేశారు. ఇంతలో అక్కడే ఉన్న ఆర్టీసీ మహిళా సిబ్బంది పరిస్థితిని గమనించి ప్లాట్‌ఫాం ఎదురుగా ఉన్న చెట్టు కిందకు కుమారిని తీసుకెళ్లారు. చుట్టూ చీరలు అడ్డుగా పెట్టి డెలివరీ చేశారు. అదే సమయంలో 108 సిబ్బంది అక్కడికి చేరుకొని సాయం అందించారు. పండంటి ఆడబిడ్డ జన్మించగా.. 108 వాహనంలో తల్లీబిడ్డను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. పురుడుపోసిన ఆర్టీసీ స్వీపర్లు సైదమ్మ, స్రవంతి, లావణ్య, భవానీ, రేణుకను అధికారులు, ప్రయాణికులు అభినందించారు. కాగా తన భార్యకు డెలివరీ సమయం వచ్చే వరకు ఇటుక బట్టీ యాజమాని కూలీ డబ్బులు ఇవ్వలేదని, రేపుమాపు అంటూ దాటవేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కుమారి భర్త దూల ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఏర్పాటులో కేశవరావు జాదవ్ పాత్ర కీలకం



ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పంజగుట్ట(హైదరాబాద్): తెలంగాణరాష్ట్ర ఏర్పాటులో ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ పాత్ర ఎనలేదనిని, రాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కేశవరావు జాదవ్ 6వ వర్ధంతి ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ ప్రెస్‌అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ప్రెస్‌అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, రామ్ మనోహర్ లోహియా రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్, వక్త అభిషేక్ రంజన్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, తెలంగాణ ఉద్యమకారులు విఠల్, దాసు సురేశ్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌తో పాటు సోషలిస్టు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన కేశవరావు జాదవ్ సేవలను కొనియాడారు. జాదవ్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయనతో ఉన్న జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

అల్లుడిని రాళ్లతో కొట్టి చంపిన మామ

- కూతురిని వేధిస్తున్నాడనే కోపంతో..
- జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో ఘటన

ఉండవెల్లి: కూతురుని వేధిస్తున్నాడనే కోపంతో అల్లుడిని మామ రాళ్లతో కొట్టి చంపిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో చోటుచేసుకుంది. సీఐ రవిబాబు కథనం మేరకు.. ఉండవెల్లికి చెందిన మద్దిలేటి తన కూతురు మహేశ్వరిని ఆరేళ్ల క్రితం కర్నూలులోని కొండారెడ్డినగర్‌కు చెందిన దేవేందర్(36)కు ఇచ్చి పెళ్లి చేశారు. కొద్ది రోజులుగా భార్య మహేశ్వరిని భర్త దేవేందర్ మద్యం తాగి వచ్చి వేధిస్తుండటంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో శనివారం రాత్రి దేవేందర్ ఉండవెల్లికి రాగా.. మామతో గొడవ జరిగింది. ఆ తర్వాత దేవేందర్ మద్యం తాగి మత్తులో ఇంట్లో నిద్రిస్తుండగా మామ మద్దిలేటి సిమెంట్ ఇటుకలు, రాళ్లతో పడుకున్న దేవేందర్ తలపై దాడికి పాల్పడ్డాడు. అతని రెండు చేతులను తాడుతో కట్టేసి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దేవేందర్ తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హ్యాక్ చేయొచ్చు..!

ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించొద్దు ● స్పేస్ ఎక్స్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సలహా

- ఇండియాలో ఈవీఎంలు సురక్షితమే
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పష్టీకరణ
- ఈవీఎంలు బ్లాక్‌బాక్సుల్లాంటివే: రాహుల్ గాంధీ
- ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి: అఖిలేష్



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) పనితీరు, పారదర్శకతపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈవీఎంలలో నమోదైన ఫలితాలను సులభంగా తారుమారు చేయొచ్చని, ఎన్నికల్లో వీటిని ఉపయోగించకపోవడమే మంచిదని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. స్పేస్ ఎక్స్, టెస్లా కంపెనీల యజమాని, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఈవీఎంలపై స్పందించారు. ఈ మేరకు తాజాగా 'ఎక్స్'లో తన అభిప్రాయం వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో వినియోగిస్తున్న ఈవీఎంల పనితీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యంత్రాలను హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉందన్నారు. మస్క్ అభిప్రాయాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మాజీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఖండించారు. భారత్‌లో ఉపయోగిస్తున్న ఈవీఎంలు పూర్తిగా సురక్షితమేనని తేల్చిచెప్పారు. దీనిపై మస్క్ ఘాటుగా స్పందించారు. ఏదైనా హ్యాక్ చేయొచ్చని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌లు కూడా ఆదివారం స్పందించారు. ఈవీఎంలు ఎవరూ తనిఖీ చేయలేని బ్లాక్‌బాక్సుల్లాంటివేనని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. 'ఎక్స్'లో ఎలాన్ మస్క్ చేసిన పోస్టును తన 'ఎక్స్' ఖాతాల్లో రాహుల్ షేర్ చేశారు. ఈవీఎంల విశ్వసనీయతను అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు.

రిస్క్ చిన్నదైనా పరిణామం పెద్దదే



మనుషులు లేదా కృత్రిమ మేధ(ఏఐ)తో ఈవీఎంలను హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉంది. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను వాడొద్దు. ఎన్నికల నుంచి ఈ యంత్రాలను దూరంగా ఉంచాలి. ఈవీఎంలను హ్యాక్ చేసే రిస్క్ తక్కువగా ఉన్నప్పటికీ అది ముమ్మాటికీ హ్యాకింగే అవుతుంది. రిస్క్ చిన్నదైనా అది పెద్ద పరిణామానికి దారితీస్తుంది.

- ఎలాన్ మస్క్, స్పేస్ ఎక్స్, టెస్లా కంపెనీల అధినేత

ఎన్నికల ప్రక్రియపై అనుమానాలున్నాయి



భారత్‌లో ఉపయోగిస్తున్న ఈవీఎంలు బ్లాక్‌బాక్సుల్లాంటివే. వాటిని తనిఖీ చేయడానికి ఎవరినీ అనుమతించరు. మన దేశంలో అమల్లో ఉన్న ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవస్థల్లో జవాబుదారీతనం, పారదర్శకత లోపించినప్పుడు ప్రజాస్వామ్యం ఓ బూటకంగానే మిగిలిపోతుంది

- 'ఎక్స్'లో రాహుల్ గాంధీ

ఈవీఎంలు పూర్తి సురక్షితం



పూర్తిగా సురక్షితమైన ఎలక్ట్రానిక్ పరికరాలను, డిజిటల్ హార్డ్‌వేర్‌ను ఎవరూ తయారు చేయలేరన్న సాధారణ అభిప్రాయం ప్రజల్లో ఉంది. అలా అనుకోవడం పొరపాటు. ఈవీఎంలపై ఎలాన్ మస్క్ వ్యక్తం చేసిన భయాందోళలు సమంజసం కాదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను హ్యాక్ చేయడం అమెరికాతోపాటు ఇతర దేశాల్లో సాధ్యమవుతుందేమో గానీ ఇండియాలో ఎంతమాత్రం వీలుపడదు. ఇతర దేశాల్లో ఇంటర్నెట్‌తో అనుసంధానించిన ఓటింగ్ యంత్రాలను వాడుతుంటారు. ఇండియాలో అలాంటి పరిస్థితి లేదు. ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేసినప్పుడు అవకతవకలు జరిగే అవకాశం ఉండొచ్చు. ఇండియాలో ఈవీఎంలకు ఇంటర్నెట్‌తో గానీ, బ్లూటూత్‌తో గానీ, వై-ఫైతోగానీ ఎలాంటి అనుసంధానం ఉండదు. ఇవి పూర్తిగా సురక్షితమైనవి. ఫ్యాక్టరీలో ప్రోగ్రామ్ చేసిన ఈవీఎం కంట్రోలర్లను బయట రీప్రోగ్రామింగ్ చేయడం సాధ్యం కాదు. ఇండియాలో ఉపయోగిస్తున్న ఈవీఎంలు, వాటి భద్రత గురించి ఎలాన్ మస్క్‌కు ట్యూషన్ చెప్పడానికి నేను సిద్ధమే

- రాజీవ్ చంద్రశేఖర్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మాజీ సహాయ మంత్రి

"ఏదైనా(ఏ ఎలక్ట్రానిక్ పరికరమైనా) హ్యాక్ చేయొచ్చు"
- రాజీవ్ చంద్రశేఖర్ వ్యాఖ్యలపై ఎలాన్ మస్క్ ప్రతిస్పందన

ఈవీఎంలకు స్వస్తి పలకాలి



టెక్నాలజీ అనేది సమస్యలను పరిష్కరించేలా ఉండాలి. అదే టెక్నాలజీ ఒక సమస్యగా మారినప్పుడు దాన్ని పక్కనపెట్టమే మంచిది. ఈవీఎంలను హ్యాక్ చేయొచ్చని నిపుణులు ఇప్పటికే నిరూపించారు. ప్రపంచవ్యాప్తంగా ఈవీఎంలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నా యి. ఓటింగ్ యంత్రాలను హ్యాక్ చేస్తున్నట్లు సందేహాలున్నాయి. ఈవీఎం ట్యాంపరింగ్‌పై ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ నిపుణులు సైతం బహిరంగంగా ప్రకటనలు చేశారు. అలాంటప్పుడు మన దేశంలో ఈవీఎంలను బలవంతంగా ఉపయోగించాల్సిన అవసరం ఏమిటి? దీనిపై అధికార బీజేపీ సమాధానం ఇవ్వాలి. ఈవీఎంలకు స్వస్తి పలకాలి. భవిష్యత్తులో జరిగే ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి.

- 'ఎక్స్'లో అఖిలేష్ యాదవ్

దమ్ముంటే హ్యాక్ చేసి చూపించండి



ఎలాన్ మస్క్ గానీ, ఇంకెవరైనా గానీ ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని చెబుతున్న వ్యక్తులు భారత ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలి. అక్కడ ఈవీఎంను తీసుకొని హ్యాక్ చేసి చూపించాలి. ఇదే మా చాలెంజ్. భారతదేశ ప్రజాస్వామ్యం గురించి రాహుల్ గాంధీ ఎందుకు ఎలాన్ మస్క్‌కు ఫిర్యాదు చేస్తున్నారు? మస్క్ ఏం చేయగలరు? ప్రపంచం ముందు కన్నీళ్లు పెట్టుకోవడం, భారతదేశ ప్రతిష్టను దిగజార్చడం కాంగ్రెస్ డీఎన్ఏలో ఒక భాగమా? వారసత్వ రాజకీయాలను ప్రజలు వరుసగా మూడోసారి తిరస్కరించారు. అయినా ఆ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు?

- అమిత్ మాలవీయ, బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి

మహా ఈవీఎం వివాదం

- ముంబై నార్త్‌వెస్ట్‌లో 48 ఓట్లతో నెగ్గిన శివసేన అభ్యర్థి
- మొబైల్ ఫోన్‌తో ఈవీఎంను హ్యాక్ చేశారనే ఆరోపణలు
- కౌంటింగ్ కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఫోన్‌ను వాడిన వాయ్‌కర్ బంధువు
- ఫలితాన్ని ప్రభావితం చేశారని మిడ్–డే పత్రిక కథనం
- ఖండించిన రిటర్నింగ్ ఆఫీసర్
- ఈవీఎంలను తెరవడానికి ఓటీపీ అక్కర్లేదు
- డేటా ఎంట్రీ ఆపరేటర్ లాగిన్ కావడానికి మాత్రమే ఓటీపీ
- ఓట్లలో ఎలాంటి మార్పులకు అవకాశం లేదు
- మిడ్–డేపై పరువునష్టం కేసు

18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4న అందరి దృష్టిని ఆకర్షించిన లోక్‌సభ స్థానం ముంబై నార్త్ వెస్ట్. ఎందుకంటే అక్కడ గెలుపొందిన శివసేన అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్‌కు వచ్చింది కేవలం 48 ఓట్ల ఆధిక్యం. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇదే అత్యల్ప మెజారిటీ. ఇప్పుడు దానిచుట్టే రగడ మొదలైంది. వాయ్‌కర్‌కు అనుకూలంగా కౌంటింగ్ కేంద్రంలో ఉన్న ఆయన బంధువు మొబైల్ ఫోన్‌తో ఈవీఎంను హ్యాక్ చేశారనే వార్తా కథనం సంచలనం రేకెత్తిస్తోంది. ఈ కథనం క్లిప్పింగ్‌తో ఆరోపణలు మొదలయ్యాయి. అయితే ఈవీఎంలను హ్యాక్ చేయడానికి వీల్లేదని, వాటిని తెరవడానికి ఓటీపీ అవసరమే లేదని, బాహ్య వ్యవస్థలతో ఎలాంటి అనుసంధానం లేకుండా ఈవీఎంలు స్వతంత్రంగా పనిచేస్తాయని ముంబై నార్త్‌వెస్ట్ రిటర్నింగ్ ఆఫీసర్ వందనా సూర్యవంశీ చెప్పారు. అనధికారికంగా కౌంటింగ్ కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఫోన్‌ను వాడిన వాయ్‌కర్ బంధువుపై కేసు నమోదైందని వెల్లడించారు.

ముంబై: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లు బాహ్య ప్రపంచంతో ఎలాంటి అనుసంధానం, సాంకేతిక సంబంధాలు లేకుండా స్వతంత్రంగా పనిచేస్తాయని, సురక్షితమని ముంబై వాయువ్య లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వందనా సూర్యవంశీ ఆదివారం తెలిపారు. సమాచార మార్పిడికి ఈవీఎంలలో ఎలాంటి ఏర్పాటు ఉండదని పేర్కొన్నారు. ఈవీఎంలను తెరవడానికి ఎలాంటి ఓటీపీ అవసరం లేదని, వాటిపై ఉండే బటన్‌ను నొక్కడం ద్వారా ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆమె వివరించారు. ముంబై నార్త్‌వెస్ట్‌లో శివసేన అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్ కేవలం 48 ఓట్లతో నెగ్గారు. రవీంద్ర వాయ్‌కర్ బంధువు మంగేష్ పాండిల్కర్ కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంకు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను వాడారని, దీని ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారని, హ్యాక్ చేశారని మిడ్–డే పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. దీనిపై రిటర్నింగ్ ఆఫీసర్ వందన స్పందిస్తూ.. 'ఈవీఎంలు సాంకేతికంగా లోపరహితమైనవి. బయటినుంచి ఏ ఇతర సాంకేతిక వ్యవస్థలపై ఆధారపడకుండా స్వతంత్రంగా పనిచేస్తాయి. వాటిని ప్రోగ్రామ్ చేయడం కుదరదు. వైర్‌లెస్‌గా, వైర్లను కనెక్ట్ చేసి సమాచార మార్పిడి చేయడానికి ఈవీఎంలలో ఎలాంటి ఏర్పాటు లేదు' అని తెలిపారు. రవీంద్ర వాయ్‌కర్ బంధువు మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారనే వాదనలను కొట్టిపారేశారు. ఇది శుద్ధ అబద్ధం. ఒక పత్రిక దీన్ని వ్యాపింపచేస్తోంది. మిడ్–డే పత్రికకు ఐపీసీ 499, 505 సెక్షన్ల కింద పరువునష్టం, అసత్య వార్తల ప్రచారానికి గాను నోటీసులు జారీచేశామని వందనా సూర్యవంశీ వెల్లడించారు. ముంబై నార్త్‌వెస్ట్‌లో శివసేన (యూబీటీ) అభ్యర్థి అమోల్ సజానన్ కీర్తికర్ గెలిచారని తొలుత వార్తలు వెలువడ్డాయి. అయితే రవీంద్ర వాయ్‌కర్ (శివసేన– షిండే) 48 ఓట్లతో గెలిచారని ఎన్నికల సంఘం ప్రకటించింది.

మేము గెలిచినందుకేనా ఈ సందేహాలు: ఏక్‌నాథ్ షిండే

ముంబై నార్త్‌వెస్ట్‌లో తమ (శివసేన) అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్ గెలిచినందుకే ఈవీఎంలపై అనుమానాలు రేకెత్తిస్తున్నారని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే మండిపడ్డారు. ఈ ఒక్క నియోజకవర్గం ఫలితంపైనే ఎందుకు సందేహాలు లేవనెత్తుతున్నారు. రాష్ట్రంలోని మిగతా స్థానాల ఫలితాలపై ఎందుకు అనుమానాలు వ్యక్తం చేయడం లేదు? ఎందుకంటే ముంబై నార్త్‌వెస్ట్‌లో నా అభ్యర్థి వాయ్‌కర్ గెలిచారు. వారి అభ్యర్థి (శివసేన–యూబీటీ) ఓడిపోయారు.. అని షిండే వ్యాఖ్యానించారు. ప్రజా తీర్పు వాయ్‌కర్‌కు అనుకూలంగా ఉందన్నారు.

అది డాటా ఎంట్రీ ఆపరేటర్ మొబైల్



రవీంద్ర వాయ్‌కర్ బావమరిది మంగేష్ పాండిల్కర్ కాల్స్ చేయడానికి, అందుకోవడానికి కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ దినేశ్ గౌరవ్ ఫోన్ వాడారని రిటర్నింగ్ ఆఫీసర్ వందన వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రంలో మొబైల్ వాడకూడదనే అధికారిక ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఐపీసీ 188 సెక్షన్ కింద మంగేష్‌పై పోలీసు కేసు నమోదైంది. అలాగే దినేశ్ గౌరవ్‌పై కూడా కేసు నమోదైంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ డేటాను పొందుపర్చడానికి మాత్రమే మొబైల్ ఫోన్‌ను వాడాలని, ఫోన్‌తో అవసరం తీరగానే సీనియర్ అధికారికి అప్పగించాలని, ఎల్లప్పుడూ మొబైల్ ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లోనే పెట్టాలి. దినేశ్ ఈ నిబంధనలను పాటించలేదని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్.. సిస్టమ్‌లోకి లాగిన్ అవుతారు. డేటా ఎంట్రీ, ఓట్ల లెక్కింపు రెండు వేర్వేరు అంశాలు. కౌంటింగ్ ప్రక్రియకు, మొబైల్ ఫోన్ అనధికారిక ఉపయోగానికి ఎలాంటి సంబంధం లేదు. మొబైల్ ఫోన్ వాడకం దురదృష్టకర ఘటన, దీనిపై దర్యాప్తు జరుగుతోందని వందన వెల్లడించారు. 'అధునాతన సాంకేతిక ఫీచర్లు, గట్టి అధికారిక నిఘా ఉందని.. అందువల్ల ఓట్లను తారుమారు చేసే అవకాశమే లేదని చెప్పారు. ప్రతిదీ అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల ఎదుటే జరుగుతుందన్నారు. రవీంద్ర వాయ్‌కర్ గాని, ఓటమి పాలైన అమోల్ కీర్తికర్ గాని రీ కౌంటింగ్‌ను కోరలేదని తెలిపారు. చెల్లని పోస్టల్ బ్యాలెట్లను పునఃపరిశీలించాలని డిమాండ్ చేయగా.. తాము అది చేశామని వివరించారు. అధీకృత కోర్టు ఆదేశాలు ఉంటే తప్ప సీసీటీవీ ఫుటేజీని బయటపెట్టలేమని తెలిపారు.

ఫలితాన్ని నిలిపివేయాలి: పృథ్వీరాజ్ చౌహాన్

ముంబై నార్త్‌వెస్ట్ నియోజకవర్గ ఫలితాన్ని నిలిపివేయాలని సీనియర్ కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ ఆదివారం డిమాండ్ చేశారు. భారత ఎన్నికల సంఘం అన్ని పార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని లోతుగా చర్చించాలని కోరారు. 'మొబైల్ ఫోన్ అనధికారిక వినియోగంపై దర్యాప్తు జరగాలి. ఎఫ్ఐఆర్‌ను బహిరంగపర్చలేదు' అని చౌహాన్ అన్నారు.

ఉక్రెయిన్‌లో శాంతికి ప్రాదేశిక సమగ్రతే ముఖ్య భూమిక

80 దేశాల ఉమ్మడి ప్రకటన

బెర్న్: ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఎలాంటి శాంతి ఒప్పందానికైనా ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతే ముఖ్య భూమిక అవుతుందని 80 దేశాలు తేల్చిచెప్పాయి. ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని తాము గౌరవిస్తున్నామని స్పష్టం చేశాయి. ఉక్రెయిన్‌లో శాంతి సాధన కోసం స్విట్జర్లాండ్‌లో రెండు రోజులపాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. దాదాపు 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివారం 80 దేశాల ప్రతినిధులు ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ సహా కొన్ని దేశాలు ఈ ప్రకటనలో పాలుపంచుకోలేదు. తుది డాక్యుమెంట్‌పై సంతకం చేయలేదు. యుద్ధం మొదలైన తర్వాత స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ భూభాగాలను వెనక్కి ఇచ్చేయాలని పలుదేశాలు రష్యాకు సూచించాయి. స్విట్జర్లాండ్ సదస్సు పట్ల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హర్షం వ్యక్తం చేశారు. తమ దేశంలో శాంతికి ఇదొక తొలి అడుగు అని అభివర్ణించారు. అయితే, ఈ సదస్సుకు రష్యా మిత్రదేశం చైనా హాజరుకాలేదు. రష్యాను ఆహ్వా నించలేదు. భారత్ తరఫున విదేశాంగ శాఖ కార్యదర్శి(పశ్చిమ) పవన్ కపూర్ హాజరయ్యారు.

గంగా నదిలో పడవ మునక.. నలుగురు గల్లంతు

పట్నా: బిహార్ రాష్ట్రం పట్నా జిల్లాలో గంగా నదిలో పడవ మునిగిన ఘటనలో నలుగురు గల్లంతయ్యారు. బర్హ్ సబ్ డివిజన్‌లోని ఉమానాథ్ గంగా ఘాట్ వద్ద ఆదివారం ఉదయం 9.15 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పడవలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నది మధ్యలో ఉండగా పడవ బోల్తా పడి మునిగిందని, 13 మందిని రక్షించి, ఒడ్డుకు చేర్చామని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ శుభమ్ కుమార్ చెప్పారు. కనిపించకుండాపోయిన ముగ్గురు పురుషులు, ఒక మహిళ జాడ కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నా: మేఘ్వాల్

కోల్‌కతా: దేశంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ చెప్పారు. ఇప్పటికే ఈ దిశగా కొన్ని రాష్ట్రాలు చర్యలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఆదివారం కోల్‌కతాలో మాట్లాడారు. బీజేపీ మేనిఫెస్టోలో యూసీసీని ప్రస్తావించామని ఆయన గుర్తు చేశారు.

బాబ్రీ కాదు.. 3 గోపురాల నిర్మాణం

- అయోధ్య పాఠ్యాంశం 2 పేజీలకు కుదింపు
- రథయాత్ర, కరసేవకులు, కూల్చివేత అంశాలు తొలగింపు
- గుజరాత్ అల్లర్ల అధ్యాయం సైతం
- ఎన్‌సీఈఆర్‌టీ 12 పొలిటికల్ సైన్స్ బుక్‌లో అనేక మార్పులు

న్యూఢిల్లీ : హేతుబద్ధీకరణ పేరుతో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్య పుస్తకాల్లో పలు మార్పులు, చేర్పులు చేసిన సంగతి తెలిసిందే. అయితే 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకంలోనూ అనేక మార్పులు చేసింది. 'బాబ్రీ మసీదు' సహా అనేక కీలక అంశాలను, చాలా సమాచారాన్ని తొలగించింది.



తొలగింపులు అంశాలవారీగా..

- **'బాబ్రీ మసీదు' పదం తొలగింపు:** పాఠ్య పుస్తకంలోంచి బాబ్రీ మసీదు అనే పదాన్ని పూర్తిగా తొలగించింది. దాని స్థానంలో 'మూడు గోపురాల నిర్మాణం'ను చేర్చింది.
- **అయోధ్య అధ్యాయం తగ్గింపు:** నాలుగు పేజీలున్న అయోధ్య అధ్యాయాన్ని రెండు పేజీలకు తగ్గించింది. రథయాత్ర, కరసేవకుల పాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేత, అనంతరం జరిగిన హింస, ఆ తరువాత బీజేపీ పాలిత ప్రాంతాల్లో విధించిన రాష్ట్రపతి పాలన అంశాలను తొలగించింది.
- **చారిత్రక వివరాల సవరణ:** బాబ్రీ మసీదుకు సంబంధించిన వివరాల్లో కూడా అనేక మార్పులు చేసింది. బాబ్రీ మసీదును 16వ శతాబ్దంలో మీర్ బాకీ నిర్మించినట్లుగా గత పుస్తకంలో ఉండగా.. 1528లో రాముడి జన్మస్థలంలో నిర్మించబడిన మూడు గోపురాల నిర్మాణంగా ఇప్పుడు పేర్కొన్నది. అంతేకాదు ఈ నిర్మాణంలో అనేక హిందూ చిహ్నాలు ఉన్నాయని, లోపలి, వెలుపలి గోడలపై శిల్పాలు ఉన్నాయని కొత్త పుస్తకం పేర్కొంది.
  హిందూ చిత్రాలు, విగ్రహాలను కూడా కొత్తగా ప్రస్తావించింది.
- **చట్టపరమైన, మతపరమైన కథనాల్లోనూ మార్పులు:** ఆలయంలో పూజలు చేసుకునేందుకు బాబ్రీ మసీదు నిర్మాణాన్ని తెరచి ఉంచాలని 1986 ఫిబ్రవరిలో ఫైజాబాద్ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును పాత పుస్తకం వివరించగా, వాటన్నింటిని తొలగించి మూడు గోపురాల నిర్మాణం, తరువాత వచ్చిన మతపరమైన వైరుధ్యాలను కొత్త పుస్తకం క్లుప్తంగా ప్రస్తావించింది. వివాదాస్పద భూమి ఆలయానికే చెందుతుందంటూ 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాత్రం కొత్త ఎడిషన్‌లో చేర్చింది.

అల్లర్ల గురించి బోధించాల్సిన అవసరం లేదు | ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్




ద్వేషం, హింస బోధనాంశాలు కావని, పాఠశాల పాఠ్యపుస్తకాలు వాటిపై దృష్టి పెట్టకూడదని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) చీఫ్ దినేష్ ప్రసాద్ సక్లానీ అన్నారు. గుజరాత్ అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత గురించి బోధిస్తే పాఠశాల విద్యార్థులు హింసాత్మకంగా తయారవుతారని, అందుకే వాటిని పాఠ్యాంశాల్లోంచి తొలగించామని వెల్లడించారు. పాఠ్య పుస్తకాల్లో మార్పులు, బాబ్రీ మసీదు కూల్చివేత, తరువాత మతపరమైన హింసకు సంబంధించిన అంశాల తొలగింపులపై శనివారం ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. సమాజంలో విద్వేషాలను సృష్టించే విధంగా బోధనలు అవసరం లేదని, చిన్న పిల్లలకు అల్లర్ల గురించిన నేర్పించాల్సిన అవసరం లేదని, అది ఎందుకు జరిగిందో పెద్దయ్యాక వారే తెలుసుకుంటారని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లోని అంశాలను కాషాయీకరణ చేశారనే ఆరోపణలను కొట్టి పారేశారు. రామజన్మభూమికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిస్తే దాన్ని పాఠ్యపుస్తకాల్లో ఎందుకు చేర్చకూడదని, పార్లమెంటు నూతన భవనాన్ని నిర్మించడం విద్యార్థులకు ఎందుకు తెలియకూడదని ఆయన ప్రశ్నించారు. చరిత్రను యుద్ధభూమిగా మార్చడానికి కాకుండా విద్యార్థులకు వాస్తవాలు తెలిసేలా బోధిస్తామన్నారు. పాఠ్యపుస్తకాల పునర్విమర్శ ప్రపంచవ్యాప్తంగా జరిగే అభ్యాసమని, ఏది మార్చాలన్నది సబ్జెక్ట్, బోధనా శాస్త్ర నిపుణులే నిర్ణయిస్తారని, తాను ఆ ప్రక్రియలో జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల్లో 2014 నుంచి ఇప్పటివరకూ నాలుగు పర్యాయాలు మార్పులు చేశారు.

- **వార్తాపత్రికల కటింగ్స్ తీసివేత:** పాత పుస్తకంలో వార్తాపత్రిక కథనాలకు సంబంధించిన అనేక ఛాయాచిత్రాలు ఉన్నాయి. వీటిలో డిసెంబర్ 7, 1992న 'బాబ్రీ మసీదు కూల్చివేత, కేంద్రం కళ్యాణ్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం కూడా ఉంది. వీటన్నింటినీ తొలగించారు.
- **గుజరాత్ అల్లర్ల అధ్యాయం తొలగింపు:** ప్రజాస్వామ్య హక్కుల అధ్యాయం నుంచి గుజరాత్ అల్లర్ల ప్రస్తావనను పూర్తిగా తొలగించింది.

కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయండి

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశం



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయడం ద్వారా ఒక కొత్త ఒరవడి సృష్టించడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల వరుసగా ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి, పలువురు ముష్కరులతోపాటు భద్రతా సిబ్బంది సైతం మరణించారు. ఈ నేపథ్యంలో అమిత్ షా ఆదివారం భద్రతా దళాలతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తాజా పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేయాలని ఆదేశించారు. కశ్మీర్ లోయలో చేపట్టిన జీరో–టెర్రర్ ప్రణాళికలతో మంచి ఫలితాలు వచ్చాయని, జమ్మూ డివిజన్‌లో సైతం అమలు చేయాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. ఈ యాత్రకు పటిష్టమైన భద్రత కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని అమిత్ షా ఆదేశించారు. యాత్ర విషయంలో అధికారుల సన్నద్ధతను సమీక్షించారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, సీఆర్‌పీఎఫ్ డీజీ అనీష్‌దయాళ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ పరిణామాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల క్రితం సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్‌లో ఇకపై ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

టీడీపీ స్పీకర్ పదవికి పోటీ చేస్తే.. ఇండియా కూటమి మద్దతిస్తుంది

ముంబై: లోక్‌సభ స్పీకర్ పదవికి అధికార ఎన్డీఏ పక్షంలోని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) పోటీ చేస్తే ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలన్నీ మద్దతిచ్చే అవకాశముందని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ చెప్పారు. లోక్‌సభ స్పీకర్ పోస్టు చాలా కీలకమైందని, ఈ పదవి బీజేపీకి దక్కితే, ప్రభుత్వానికి మద్దతిచ్చే టీడీపీ, జేడీయూలతోపాటు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరిలకు చెందిన పార్టీలను ముక్కలు చేస్తుందని ఆరోపించారు. బీజేపీని నమ్మి మోసపోయిన అనుభవం తమకు కూడా ఉందని రౌత్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'లోక్‌సభ స్పీకర్ పదవిని టీడీపీ కోరుతున్నట్లుగా విన్నాను. అదే జరిగితే, ఇండియా కూటమి ఈ విషయాన్ని చర్చిస్తుంది. మా భాగస్వామ్య పక్షాలన్నీ టీడీపీకి మద్దతిచ్చేందుకు ప్రయత్నిస్తాయి'అని చెప్పారు. నిబంధన ప్రకారం ప్రతిపక్ష పార్టీకి డిప్యూటీ స్పీకర్ పోస్టు కేటాయించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అగ్ర నేతలు బీజేపీపై చేసిన వ్యాఖ్యలపై సంజయ్ రౌత్.. గతంలో బీజేపీ చేసిన తప్పిదాలను ఆర్‌ఎస్‌ఎస్ సరిచేయాలనుకోవడం మంచి పరిణామమేనని పేర్కొన్నారు. జూన్ 7వ తేదీన పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన భేటీలో ప్రధాని మోదీ ఎన్డీఏ పార్లమెంటరీ పక్షం నేతగా, బీజేపీ పార్లమెంటరీ పార్టీ, లోక్‌సభలో బీజేపీ నేతగా ఎన్నికయ్యారని రౌత్ అన్నారు. 'బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ప్రత్యేకంగా జరగలేదు. అలా జరిగిన పక్షంలో నేత ఎవరనే ప్రశ్న ఉదయిస్తుంది, అప్పుడిక పరిణామాలు వేరుగా ఉంటాయి'అని అభిప్రాయపడ్డారు. మోదీ ఎన్డీఏ పార్లమెంటరీ పక్షం నేతగా మాత్రమే ఎన్నికవడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని రౌత్ వ్యాఖ్యానించారు.

'నీట్'లో అక్రమాల ఆరోపణలు.. బిహార్ పోలీసుల దర్యాప్తు వేగవంతం

ప్రశ్నపత్రం లీక్ చేసిన వారి వద్ద ఆరు చెక్కులు స్వాధీనం

పట్నా: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో బిహార్ పోలీసుల దర్యాప్తు మరింత పురోగతి సాధించింది. ఇప్పటికే ఈ కేసులో 13 మందిని అదుపులోకి తీసుకున్న బిహార్ ఆర్థిక నేరాల విభాగం(ఈఓయూ) పోలీసులు ఆరు చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.30 లక్షలు డిమాండ్ చేసిన మాఫియా ముఠా సభ్యులకు చెందాల్సినవిగా వీటిని భావిస్తున్నామని ఈఓయూ డీఐజీ మానవ్‌జీత్ సింగ్ ధిల్లాన్ ఆదివారం చెప్పారు. సంబంధిత బ్యాంకుల నుంచి ఆయా ఖాతాదారుల వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా, పట్నాలో ప్రశ్నాపత్రాన్ని, జవాబులను అభ్యర్థులకు మాఫియా సభ్యులు వెల్లడించిన ఇంట్లో పాక్షికంగా కాల్చివేసిన ప్రశ్నాపత్రాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఎన్‌టీఏ నుంచి రిఫరెన్స్ ప్రశ్నాపత్రం కోరామని, అది అందాక రెండింటిని సరిపోల్చుతామని డీఐజీ చెప్పారు. ఇప్పటి వరకు పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో 9 మంది అభ్యర్థులతోపాటు నలుగురు ఎగ్జామినర్లున్నారు. వీరంతా బిహారీలే. అదేవిధంగా, ఈ లీకేజీ వ్యవహారంతో సంబంధమున్నట్లు అనుమానిస్తున్న బిహార్‌కే చెందిన మరో ఏడుగురు, యూపీ, మహారాష్ట్రలకు చెందిన ఒక్కో అభ్యర్థికి కూడా పోలీసులు నోటీసులు పంపారు.

నీట్ ఒక కుంభకోణం: ఎంకే స్టాలిన్

చెన్నై: మెరిట్‌కు కొలమానంగా పేర్కొంటున్న నీట్ ఒక కుంభకోణం, ఈ పరీక్ష పేద విద్యార్థుల ప్రయోజనాలకు, సామాజిక న్యాయానికి విరుద్ధమని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఇటువంటి విధానం అమలును నిలిపివేయాలని ఆదివారం ఆయన 'ఎక్స్'లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 'నీట్ చుట్టూ ముసురుకున్న వివాదాలు, ఈ విధానంతో జరుగుతున్న అన్యాయాన్ని చెప్పకనే చెబుతోంది. సమాజంలో అణగారిన వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి మరిన్ని దారులు తెరవడానికి బదులుగా వారికి నీట్ అవకాశాలను దూరం చేస్తోంది'అని ఆరోపించారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ఎన్‌టీఏను సమర్థిస్తున్నప్పటికీ వాస్తవం మరోలా ఉంది. గుజరాత్‌లో ఓఎంఆర్ షీట్లను ట్యాంపర్ చేసినట్లుగా వచ్చిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదంతా ఓ కుట్ర. నీట్ కోచింగ్ సెంటర్లు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, ఓ స్కూల్ ప్రిన్సిపల్‌కు ఇందులో హస్తముంది. ఈ వ్యవస్థను మార్చాల్సిన అవసరముంది'అని స్టాలిన్ పేర్కొన్నారు.

విచారణ జరిపించాలి: కపిల్ సిబల్

న్యూఢిల్లీ: నీట్ అవకతవకల ఆరోపణల్లో నిగ్గు తేల్చేందుకు అధికారులతో కమిటీని నియమించాలని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ సుప్రీంకోర్టును కోరారు. భవిష్యత్తులో నీట్‌ను మరింత మెరుగ్గా నిర్వహించే అంశంపై రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. నీట్‌ను నిర్వహించే ఎన్‌టీఏ వ్యవస్థలోనే అవినీతి నెలకొన్న పరిస్థితుల్లో ప్రధాని మోదీ మౌనంగా ఉండటం ఏమాత్రం మంచిదికాదన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నీట్‌లో అక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించాలని సిబల్ అన్ని రాజకీయ పార్టీలను కోరారు.

దోషులుగా తేలితే ఎన్‌టీఏ అధికారులనూ వదలం

'నీట్' అవకతవకల ఆరోపణలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: నీట్ యూజీ–2024 పరీక్ష పారదర్శకంగా జరిగిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన పునరుద్ఘాటించారు. అవకతవకలకు బాధ్యులుగా తేలితే ఉన్నతాధికారులపైనా కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1,563 మంది అభ్యర్థులకు మళ్లీ పరీక్ష పెడతాం. పేపర్ లీకేజీ మాత్రం జరగలేదు. రెండు పరీక్ష కేంద్రాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. ఈ అంశాన్ని ప్రభుత్వం తీవ్రమైందిగా పరిగణిస్తోంది. దోషులుగా తేలితే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఉన్నతాధికారులను సైతం వదలం. తప్పుచేసిన వారిపై కఠినచర్యలుంటాయి'అని మంత్రి చెప్పారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 17 । జూన్ । 2024

బీఫ్ దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: బక్రీద్ సందర్భంగా ఈ నెల 17, 18వ తేదీల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గోవధ శాలలు, బీఫ్ విక్రయ దుకాణాలను మూసివేయాలని జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సంబంధిత అధికారులు, పురపాలక సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆమె ఆదేశించారు.



ఒడిశా టు సిటీ

ఒడిశా నుంచి నగరానికి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న రెండు ముఠాలకు సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ పెట్టారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/25.0

రానున్న 24 గంటల్లో మహా నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. తేలికపాటి, ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.





ర్యాంప్‌పై రాజహంసలు!



విద్యార్థుల ఫ్యాషన్ షో అదరహో అనిపించింది. ర్యాంప్‌పై వారు హొయలొలికించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లో ఫ్యాషన్ డిజైనర్ రెని ఏర్పాటు చేసిన రెని క్రిస్టల్ ఫ్యాషన్ షోలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్‌తో పాటు ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. సూపర్ మోడల్ కాంపిటీషన్‌లో మూడు టైటిల్స్ గెలుచుకున్న కశ్వి అనే విద్యార్థిని సైతం పాల్గొని ఆకట్టుకుంది. సినీ దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి ర్యాంప్ వాక్‌తో అలరించింది. కార్యక్రమంలో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ విన్ ఓవెత్, కజకిస్తాన్ కాన్సుల్ జనరల్ నాసిర్ అలీఖాన్, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, టర్కీ కాన్సులేట్ జనరల్ ఆర్కాన్ అల్మాన్ ఒకాన్ తదితరులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్

కానిస్టేబుల్ ఔదార్యం

పరీక్ష కేంద్రానికి బైక్‌పై తీసుకెళ్లి యువతికి సహాయం



యువతిని బైక్‌పై పరీక్ష కేంద్రానికి తీసుకెళుతున్న కానిస్టేబుల్ సురేశ్

రాజేంద్రనగర్: యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న ఓ యువతిపై కానిస్టేబుల్ ఔదార్యం కనబర్చిన ఘటన రాజేంద్రనగర్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మైలార్‌దేవ్‌పల్లి పల్లె చెరువు మహవీర్ కళాశాలలో యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు బందోబస్తులో ఉన్నారు. ప్రధాన రహదారి నుంచి కళాశాల కిలో మీటర్‌కు పైగా దూరం ఉంటుంది. అర్ధ కిలో మీటర్ దూరమే పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లేందుకు అనుమతించారు. ఈ క్రమంలో ఓ యువతి ఆటోలో వచ్చింది. పరీక్ష ప్రారంభానికి సమయం నాలుగు నిమిషాలే ఉండటంతో కంగారు పడుతూ పరుగెత్తసాగింది. అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్ గమనించి.. తన ద్విచక్ర వాహనంపై ఆ యువతిని పరీక్ష కేంద్రానికి చేర్చాడు. సదరు యువతి కేంద్రంలోకి అడుగు పెట్టగానే కళాశాల గేట్లను మూసివేశారు. 5 సెకన్లు ఆలస్యమైనా గేట్లు మూసేవారని అక్కడే ఉన్న వారు వెల్లడించారు. తోటి సిబ్బందితో పాటు అధికారులు కానిస్టేబుల్ సురేశ్‌ను అభినందించారు.

కలెక్టర్‌ను సైతం.. తనిఖీ చేసి..



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని తనిఖీ చేస్తున్న పోలీస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో యూపీఎస్సీ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 57.31 శాతం, మధ్యాహ్నం జరిగిన పేపర్–2 పరీక్షకు 56.83 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. మెహిదీపట్నం సంతోష్ నగర్ కాలనీలోని సెయింట్ ఆన్స్ మహిళా పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. కాగా.. పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందు కలెక్టర్‌ను పోలీసులు తనిఖీ చేయడం గమనార్హం. గుర్తింపు కార్డు లేకుండా ఎవరినీ పరీక్ష కేంద్రంలోనికి వెళ్లకుండా చూడాలని పోలీసులకు కలెక్టర్ సూచించారు. అంతకుముందు ఆయన నిజాం కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీస్ సిబ్బందితో ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను కేంద్రాలకు తరలించే ప్రక్రియను పరిశీలించారు. హైదరాబాద్ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ తెలిపారు.

సీసీఎస్ ప్రక్షాళన



- వరుస వివాదాల నేపథ్యంలో కీలక నిర్ణయం
- 16 మందిని సరెండర్ చేస్తూ నగర సీపీ ఉత్తర్వులు
- వీరిలో 12 మంది ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్సైలు
- పర్యవేక్షణ అధికారులపై చర్యలు శూన్యం

సాక్షి, సిటీబ్యూరో: ఏసీబీ దాడులులతో ఏర్పడిన వరుస వివాదాల నేపథ్యంలో నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) ప్రక్షాళనపై కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి దృష్టి పెట్టారు. ఒకేసారి 16 మందిని జోన్, రేంజ్‌లకు సరెండర్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 12 మంది ఇన్‌స్పెక్టర్లు కాగా, నలుగురు సబ్–ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. వీరిని పర్యవేక్షించే అధికారుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

90 శాతం 'కొత్తవారే'..

ప్రతిసారీ సార్వత్రిక ఎన్నికల సందర్భంలో నగరంలో పోలీసు అధికారుల బదిలీలు ఉంటాయి. నిర్దిష్ట గడువులో నాలుగేళ్ల శాంతిభద్రతల విభాగం సహా కీలక విభాగాల్లో పని చేసిన ఎస్సైలు ఆ నియోజకవర్గం/సొంత నియోజకవర్గం, ఇన్‌స్పెక్టర్లు కమిషనరేట్ వదిలి వెళ్లాల్సిందే. సైబరాబాద్, రాచకొండల్లో ఒకటి కంటే ఎక్కువ రెవెన్యూ జిల్లాలు ఉండగా.. హైదరాబాద్‌లో మాత్రం ఒక్కటే ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ రెండింటి కంటే హైదరాబాద్ పైనే ఎన్నికల బదిలీల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు గత ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, ఈ ఏడాది మే నెలలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెండుసార్లు బదిలీలు చేపట్టాల్సి వచ్చింది. దీంతో సీసీఎస్ సహా నగర కమిషనరేట్‌లోని వివిధ విభాగాల్లో 90 శాతం మంది నగరంతో పరిచయం, సంబంధం లేని అధికారులే పని చేస్తున్నారు.

పట్టు లేక.. కట్టు తప్పి..

సీసీఎస్‌లో పర్యవేక్షణ స్థాయిలో ఉండే ఉన్నతాధికారుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ కారణంగానే దర్యాప్తు విధులు నిర్వర్తించే కీలక అధికారులపై పర్యవేక్షణ పక్కాగా లేకుండా పోయింది. దీనిని సొమ్ము చేసుకోవాలని నిర్ణయించిన కొందరు అధికారులు సీసీఎస్‌ను అవినీతికి అడ్డాగా మార్చి వసూళ్లకు తెరలేపారు. 'సాహితి' కేసుల్లో ఏసీపీ టీఎస్ ఉమామహేశ్వరరావు గోల్‌మాల్ చేసినా, మోసం కేసులో బాధితుడు–నిందితుడు మధ్య రాజీ చేసిన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్ లంచం డిమాండ్ చేసినా ఉన్నతాధికారులు కనిపెట్టలేకపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సీసీఎస్ అత్యంత వివాదాస్పదంగా మారింది. ఈ వరుస పరిణామాలను తీవ్రంగా పరిగణించిన కొత్వాల్ 12 మంది ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్సైలపై చర్యలు తీసుకుంటూ వారికి సరెండ్ చేశారు. ఏదైనా ఠాణాలో ఒక ఎస్సై లంచం తీసుకుంటూ దొరికినా, అవకతవకలకు పాల్పడినా ఆ పోలీసు స్టేషన్‌కు సంబంధించిన పర్యవేక్షణ అధికారులనూ బాధ్యుల్ని చేస్తారు. సీసీఎస్ విషయంలో కింది స్థాయి సిబ్బందిపై ఇలాంటి కఠిన చర్యలు తీసుకున్న కొత్వాల్.. పర్యవేక్షణ అధికారుల విషయంలో ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

అందరినీ ఒకే గాటన కడితే ఎలా?

సీసీఎస్ నుంచి జోన్–2కు సరెండ్ అయిన ఇన్‌స్పెక్టర్లలో శివశంకర్, రఘుబాబు, అప్పల నాయుడు, బూక్యా రాజేష్, రాములు, హుస్సేన్ ధరావత్, జి.సత్యం, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణ, కె.సత్యనారాయణ, ఇమ్మానుయేల్, క్రాంతి కుమార్ ఉండగా.. రేంజ్‌కు సరెండర్ అయిన ఎస్సైల్లో పండు, శివరాజ్, ముజఫర్, రజిత ఉన్నారు. వీరిలో కొందరిపై ఆరోపణలు ఉండగా, మరికొందరు సమర్థంగా విధులు నిర్వర్తించట్లేదని, ఇంకొందరు నగరంలో సుదీర్ఘకాలం పని చేస్తున్నారనే కారణాలతో సరెండర్ చేశారు. అయితే.. ప్రస్తుతం సీసీఎస్‌లో వరుస అవినీతి వివాదాలు చోటు చేసుకోవడం, వీరిని ఒకేసారి సరెండర్ చేయడంతో అంతా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారనే సందేశం ఇచ్చినట్లు అవుతోంది. దీనిపై కొందరు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఈ అధికారుల స్థానంలోకి వేరొకరిని తీసుకురావాల్సి ఉంది. గతంలో నగరంలో పని చేసిన అనుభవం, సమర్థత ఆధారంగా ఆ అధికారులను తీసుకురావాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తోంది.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన శ్రీదేవసేన



బంజారాహిల్స్: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. సైఫాబాద్ సైన్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మొత్తం 124 మంది అభ్యర్థులకుగాను 77 మంది హాజరయ్యారు. ఇక్కడి పరీక్ష కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవసేన పరిశీలించారు. ఖైరతాబాద్ పోలీసులు ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల హాల్ టికెట్లను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్ నాయక్ పరిశీలించారు.

కృత్రిమ అవయవాల పంపిణీ భేష్

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కృత్రిమ అవయవాలను అమర్చుకున్న దివ్యాంగులు

సుల్తాన్‌బజార్: దివ్యాంగులకు నారాయణ సేవా సంస్థాన్ కృత్రిమ అవయవాలను అందజేయడం ఎంతో అభినందనీయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్‌లో 600 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా అమర్చారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. నారాయణ సేవా సంస్థాన్ దివ్యాంగులకు ఎన్నో ఏళ్లుగా చేయూతనందిస్తోందన్నారు. కృత్రిమ అవయవాలను పంపిణీ చేసి దైనందిన జీవితంలో వారి పనులు వారే చేసుకునేలా చేయూతనందిస్తోందని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్, బీజేపీ నాయకురాలు మాధవీలత, గౌరీ శంకర్, కమల్ నారాయణ వంటి ప్రశాంత్ అగర్వాల్, రిదేష్ జాగిర్దార్, జస్మత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



నాట్య ప్రదర్శనకు ముందు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథి శేషాద్రి తదితరులు

నాట్య మనోహరం..



న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు పి.నాగజ్యోతి, సీతా నాగజ్యోతి శిష్యబృందం సమర్పించిన 'కూచిపూడి దర్పణం' ఆహూతులను ఆకట్టుకుంది. ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన 'స్వరజతి వసంతరాగం' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాణికి వందనం, దశావతారం, తులసీదాస్ కీర్తన, కొలువైతివా, బృందావన సారంగ తిల్లాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో ప్రొఫెసర్ టి.జి రూప, భమిడిసాయి శిరీష, ఎల్.శృతి, శ్రీయ శేషాద్రి, కావ్య గోపాలకృష్ణ, రుద్ర వైష్ణవి కరణం, శివాని, కీర్తన సుబ్రహ్మణ్యం, సాయియుక్త, పి.చార్వి, శ్రీమేఘ, శ్రీమనస్వి, చరితలు తమ నృత్యాలతో అలరించారు. కార్యక్రమానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూచిపూడి నృత్య రీతిని వ్యాప్తి చేయడంలో విశిష్ట కృషి చేసిన గురువులను కొనియాడారు. తన కుమార్తె శ్రీయ వీరి శిష్యురాలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

– మాదాపూర్



ప్రాణాలతో చెలగాటం!

పారాహుషార్.. నగరంలో నకిలీ డాక్టర్



- శంకర్ దాదా ఎంబీబీఎస్‌లు ఎందరో..
- 100కు పైగా నకిలీ వైద్యుల గుర్తింపు
- రాష్ట్రంలోనే అత్యధికంగా హైదరాబాద్‌లో..
- తెలంగాణ వైద్య మండలి దాడుల్లో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శిశువుల విక్రయాలకు పాల్పడుతూ కొందరు నకిలీ వైద్యులు పట్టుబడుతున్నారు. ఖమ్మంలో ఓ నకిలీ వైద్యుడు సున్తీ పేరిట మర్మాంగాన్ని తొలగించేస్తే.. మంచిర్యాలలో ఓ పాపను బలితీసుకున్నాడు. ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వారిని ఏరిపారేయడానికి కొత్తగా ఏర్పడిన తెలంగాణ వైద్య మండలి రాష్ట్రవ్యాప్తంగా వరుస దాడులు నిర్వహిస్తోంది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో నకి'లీలలు' బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

అపాయంలో అమాయకులు..

ఏ అనారోగ్యమైనా, అనుకోని ప్రమాదమైనా.. ఎమర్జెన్సీ అంటే సాధారణంగా ఎవరైనా సరే దగ్గరలోని క్లినిక్‌నే ఎంచుకుంటారు. తక్షణ చికిత్స కోసం వైద్యుడి దగ్గరకు వెళ్లి ఎంత ఖర్చుకైనా సిద్ధపడతారు. ఆ చికిత్స చేస్తోంది నిజమైన డాక్టరేనా? అని భయపడాల్సిన పరిస్థితి నగరంలో మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్య మండలి జరుపుతున్న దాడుల ఫలితాలు చూస్తుంటే అమాయక రోగుల ప్రాణాలెంత అపాయంలో ఉన్నాయో అర్థమవుతోంది.

నకిలీలలెన్నో..

గ్రేటర్‌లోని మేడ్చల్ పరిధిలో ఉన్న ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్ సహా పలు ప్రాంతాల్లో ఎనిమిది బృందాలుగా ఏర్పడి ఆసుపత్రులపై దాడులు చేశారు. కొందరు కనీస అర్హత లేకుండానే ఎంబీబీఎస్ వైద్యులుగా చలామణి అవుతున్నారని, రోగులకు విచ్చలవిడిగా యాంటీ బయొటిక్‌లను వాడుతున్నారని, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇవ్వటంతో పాటు గర్భ విచ్ఛిత్తి సైతం చేస్తున్నారని కౌన్సిల్ దాడుల్లో వెల్లడవడం గగుర్పాటుకు గురి చేస్తోంది. పలు ఆసుపత్రుల్లో నర్సింగ్ స్థాయి సేవలు అందించి ఆ అనుభవంతో ఎంబీబీఎస్ వైద్యులుగా కొందరు క్లినిక్‌లు నిర్వహిస్తున్నారని కూడా తేల్చారు. 5 బెడ్స్ నుంచి 20 ఆపైన బెడ్స్ వరకూ ఉన్న ఆసుపత్రులు, కొన్ని క్లినిక్స్‌లో ఆపరేషన్ థియేటర్లు సైతం ఉన్నాయని అబార్షన్ కిట్స్ కూడా దొరికాయని బృందం సభ్యులు తెలిపారు.

నకిలీ వైద్యుల ఆట కట్టిస్తాం



ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల ఆటకట్టించే ఉద్దేశంతో గత 4 నెలలుగా యాంటీ క్వాకరీ టీమ్ సభ్యులు, పోలీసుల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నాం. నగరం మాత్రమే కాకుండా సూర్యాపేట, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో సైతం 55 మంది నకిలీ వైద్యులను గుర్తించాం. అన్ని జిల్లాల కంటే అత్యధికంగా హైదరాబాద్‌లోనే 50కిపైగా కేసులు వచ్చాయి. బోరబండలో ఒకరితో పాటు నగరంలో ఇద్దరు నకిలీ డాక్టర్లకు రిమాండ్‌కు కూడా పంపించాం. నకిలీ వైద్యులకు ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం ఏడాది జైలు, రూ.5 లక్షల జరిమానా విధిస్తారు.

– డా.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తెలంగాణ వైద్య మండలి

మణికొండలో ఆటోట్రాలీ బీభత్సం

- సైకిల్‌ను ఢీకొనడంతో ఇద్దరు చిన్నారులకు గాయాలు
- వీరిలో ఒకరి పరిస్థితి విషమం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

మణికొండ: మణికొండలో ఆటోట్రాలీ బీభత్సం సృష్టించిన ఘటనలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అల్కాపురి టౌన్‌షిప్ రోడ్డులో సైకిల్‌పై ఇద్దరు చిన్నారులు వెళ్తున్నారు. ఇదే సమయంలో మితిమీరిన వేగంతో ఓ ఆటోట్రాలీ దూసుకొచ్చి సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు చిన్నారులకు గాయాలు కావడంతో ఆటోట్రాలీ డ్రైవర్ పారిపోయేందుకు యత్నించాడు. స్థానికులు అతడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన చిన్నారులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

అబిడ్స్: షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.వెంకటరమణారెడ్డిని సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వెంకటరమణారెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో కమిషనర్ విచారాణ జరిపి సస్పెండ్ చేశారు. షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వద్ద ఒక మైత్రి సభ్యుడి ద్వారా వారితో అవినీతి కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిసింది. వెంకట రమణారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

రహమత్‌నగర్: ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బోరబండ పోలీసుల సమాచారం మేరకు... బోరబండ డివిజన్ సాయిబాబానగర్ సైట్–3 చెందిన దండు గణేష్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తాడు. గురువారం తన ద్విచక్ర వాహనమైన హోండా యాక్టివాను తన ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఉదయం చూసే సరికి వాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేనందున బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా టు సిటీ!

- గుట్టుగా గంజాయి అక్రమ రవాణా
- రెండు ముఠాలకు చెక్ చెప్పిన టాస్క్‌ఫోర్స్ టీమ్
- ఆరుగురి అరెస్టు, 164 కేజీల సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాల్

సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా నుంచి నగరానికి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న రెండు ముఠాలకు సౌత్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వీరి నుంచి 164 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ సాధన రష్మి పెరుమాల్ పేర్కొన్నారు. అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావుతో కలిసి ఆదివారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా, పిట్లం ప్రాంతానికి చెందిన ధరావత్ రవి వ్యవసాయదారుడు. గంజాయి దందాకు అలవాటుపడిన ఇతడిపై గతంలో మహారాష్ట్ర, కామారెడ్డిల్లో కేసులు నమోదయ్యాయి. రెండుసార్లు జైలుకు వెళ్లి వచ్చినా వైఖరి మార్చుకోని అతను తన పంథా కొనసాగించాడు. తన స్నేహితులైన మహారాష్ట్రకు చెందిన సయ్యద్ బహదూర్, రాంజీకదమ్‌లతో కలిసి ఇటీవల ఒడిశా లోని ముచ్చుంపుట్ వెళ్లాడు. అక్కడ గంజాయి పండించే గోవింద్ అనే వ్యక్తి నుంచి 100 కేజీల బరువు ఉన్న 32 ప్యాకెట్ల సరుకు ఖరీదు చేశాడు. దీని కారులో రహస్యంగా దాచి హైదరాబాద్ తీసుకువచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి నేతృత్వంలోని బృందం హుమాయున్‌నగర్ ప్రాంతంలో వలపన్ని అతడిని అదుపులోకి తీసుకుంది.

జైలు పరిచయాలతో గంజాయి దందా..

మరోపక్క ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ కూడా గంజాయి దందా చేస్తున్నాడు. ఇతడిపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని రావులపాలెం, నగరంలోని లంగర్‌హౌస్ ఠాణాల్లో రెండు కేసులు నమోదయ్యాయి. రావులపాలెం కేసులో ఇతను కొన్నాళ్లు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నాడు. అప్పట్లో పర్వేజ్‌కు ఒడిస్సాలోని కలిమెల్లకు చెందిన గంజాయి వ్యాపారి దీపక్‌తో పరిచయమైంది. ఆ పరిచయంతోనే అతడితో కలిసి గంజాయి దందా చేస్తూ లంగర్‌హౌస్ పోలీసులకు చిక్కాడు. ఈ కేసులో ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. అయినా వైఖరి మార్చుకోని ఇతను తన స్నేహితులైన క్యాబ్ డ్రైవర్లు మహ్మద్ అన్వర్, అబ్దుల్ రవూఫ్‌లతో కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పథకం వేశాడు. పర్వేజ్ నుంచి వచ్చే ఆర్డర్ ఆధారంగా దీపక్ ఆర్టీసీ బస్సుల్లో గంజాయి పంపేవాడు. దీనిని తీసుకునే ఈ త్రయం రెండు కార్లలోని రహస్య అరల్లో సర్దుకుని తమకు అనువైన ప్రాంతాలకు తరలించే వారు. తాజాగా దీపక్ పంపిన 64 కేజీల గంజాయిని తీసుకుని ఇరువురు ఈ రెండు వాహనాల్లో బయలుదేరారు. పోలీసు నిఘాను కనిపెట్టడానికి మరొకరు ముందు ద్విచక్ర వాహనంపై వెళ్తూ పైలెటింగ్ చేస్తున్నారు. వీరిపై సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ జోన్ పోలీసులు భవానీనగర్ పరిధిలో పట్టుకున్నారు. ఈ రెండు ముఠాల నుంచి మూడు కార్లు, బైక్, 164 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు.

ఎర్రగడ్డ ఆస్పత్రి పైనుంచి దూకి మానసిక రోగి ఆత్మహత్య

రహమత్‌నగర్: చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోరబండ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి నాంపల్లి ఓంనగర్‌కు చెందిన నర్సింగరావు(50) మానసిక వ్యాధితో బాధపడుతూ పదేళ్లుగా ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం తన కుమారుడు దీపక్‌తో కలిసి ఆస్పత్రికి వచ్చిన నర్సింగరావు వాష్ రూంకు వెళ్తున్నట్లు కుమారుడికి చెప్పి మొదటి అంతస్తు పై నుంచి కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బోరబండ పోలీసులు పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య అందాలి

ఉస్మానియా యూనివర్సిటీ: అర్హులైన ప్రతి పేద విద్యార్థికి ఇంజినీరింగ్ విద్య అందాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్స్ యూనియన్ ఓయూ ఇన్‌చార్జి, రాష్ట్ర కన్వీనర్ బోయ రమేష్ అన్నారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సుల్లో బీ కేటగిరి సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు. అయితే రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు బీ కేటగిరి సీట్లను రూ. లక్షల్లో విక్రయిస్తున్నాయని ఆరోపించారు. దీంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించిన పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. విద్యాశాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇంజినీరింగ్ సీట్ల విక్రయాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

మల్కాజిగిరి అభివృద్ధికి నిరంతర కృషి



ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు

నాగోలు: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని ఈషా కన్వెన్షన్‌లో డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ 'స్థానిక ప్రజల భాగస్వామ్యం లేకుండా విజయం సాధ్యం కాదని, మీతో కలిసి ముందుకు నడుస్తానని, మీ కళ్ళలో కదలాడే బిడ్డగా' ఉంటానని తెలిపారు. నియోజకవర్గానికి అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్, కొత్తపేట డివిజన్ పార్టీ అధ్యక్షులు మంచి రాజేష్‌కుమార్, నాయకులు సుందర్ నారాయణ, జంగారెడ్డి, అశ్విన్‌సింగ్, వజీర్ కుమార్, ఉపేందర్‌సింగ్, శివచారి, తోట మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాగోలు డివిజన్‌లో...

మల్కాజిగిరి ఎంపీ భారీ మెజార్టీతో గెలిచిన ఈటల రాజేందర్‌కు నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నాగోలు శుభం కన్వెన్షన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంగ శ్యామ్‌కుమార్, దప్పు రాజు, వస్పరి మల్లేష్, శ్రీనివాస్, సిద్దాల ఐలయ్య, నరేందర్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిటీలోనూ విస్తరించిన బెల్ట్ షాపులు

- నిర్మూలనపై దృష్టి పెట్టిన టాస్క్‌ఫోర్స్ టీమ్స్
- నాలుగు ఠాణాల పరిధిలో ఏకకాలంలో దాడులు
- ఐదుగురి అరెస్టు, 242 మద్యం బాటిళ్లు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఒకప్పుడు గ్రామాలు, జిల్లాలకే పరిమితమైన బెల్ట్ షాపులు ఇప్పుడు నగరానికి విస్తరించాయి. వేళపాళా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ మద్యం దందా చేస్తున్నాయి. దీన్ని తీవ్రంగా పరిగణించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం ఏకకాలంలో వరుసదాడులు చేశారు. నగరంలోని నాలుగు ఠాణాల పరిధిలో చేపట్టిన ఈ దాడుల్లో ఐదుగురిని పట్టుకుని, 242 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ సాధన రష్మి పెరుమాల్ ఆదివారం వెల్లడించారు. కుల్సుంపుర, ఛత్రినాక, ముషీరాబాద్, కాచిగూడ ఠాణాల పరిధిలో నివసించే వినీత్ సింగ్, కురాడి సచిన్, దుర్గం చంద్రశేఖర్, ఎ.రవికుమార్, రత్నాల రాజారావు స్థానిక మద్యం దుకాణాల నుంచి వివిధ పరిమాణాల్లో ఉన్న లిక్కర్ బాటిళ్లు ఖరీదు చేస్తున్నారు. వీటిని తమ వద్ద అక్రమంగా నిలువ ఉంచి రాత్రి వేళల్లో, మద్యం విక్రయాలపై ఆంక్షలు ఉన్నప్పుడు ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందాలు వరుస దాడులు చేసి ఐదుగురినీ పట్టుకున్నాయి. వీరి నుంచి రూ.1.12 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించాయి.

పబ్‌లో సోదాలు చేస్తున్న రాయదుర్గం పోలీసులు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న దృశ్యం



పబ్‌లలో పోలీసుల సోదాలు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో మోష్ పబ్ డేటింగ్ యాప్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వలపుల వల విసిరి అందినకాడికి దండుకున్న వైనం వెలుగు చూడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా పబ్‌ల నిర్వహణ, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు పబ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేట్టారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు పబ్‌లలో తనిఖీలు నిర్వహించారు. శనివారం రాత్రి రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న ఆధ్వర్యంలో రెడ్ రేహినో పబ్, వైట్ హ్యాట్ పబ్, స్కై హ్యాట్ పబ్, బెర్లిన్ పబ్, విస్కీ సాంబ పబ్‌లలో సోదాలు చేశారు. డ్రగ్స్ వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా మైనర్లతో సేవలందిస్తున్నారనే కోణంలో సోదాలు చేశారు. పబ్‌లలో ఎలాంటి మాదకద్రవ్యాల అనవాళ్లు, నిబంధలను అతిక్రమించినట్లు ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. పబ్‌లపై దాడులు కొనసాగుతాయని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇద్దరు వ్యక్తుల కిడ్నాప్

- ఆర్థిక లావాదేవీలే కారణం
- కారును ఢీ కొట్టి ఆపై అపహరణ
- జగద్గిరిగుట్ట నుంచి వికారాబాద్‌కు తరలింపు
- పోలీసులు గాలిస్తున్నట్లు తెలియడంతో వదిలి వెళ్లిన వైనం
- ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్ట్

గచ్చిబౌలి: అధిక వడ్డీ ఆశతో చేసిన అప్పుల విషయంలో తేడా రావడంతో ఇద్దరు వ్యక్తులను కిడ్నాప్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కిడ్నాప్‌కు గురైన ఇద్దరు బాధితులను వికారాబాద్ జిల్లాలో రెస్క్యూ చేసినట్లు గచ్చిబౌలి పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేపీహెచ్‌బీలో ఉంటున్న సత్తెనపల్లికి చెందిన చదలవాడ సాయి గుప్తా, నిజాంపేట్‌లో ఉంటున్న కర్రె సతీష్ రెడ్డి స్నేహితులు. వీరు ఇద్దరూ గచ్చిబౌలిలోని పీఎస్‌ఆర్ ప్రైమ్ టవర్స్‌లో కిక్ స్టార్ట్ కో వర్కింగ్ స్పేస్ నిర్వహిస్తున్నారు. సాయి గుప్తా సత్తెనపల్లికి చెందిన తన సమీప బంధువు భవిశెట్టి గౌతమ్ అధిక వడ్డీకి అప్పు తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని మరింత ఎక్కువ వడ్డీకి మరొకరికి అప్పుగా ఇచ్చాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఇచ్చిన అప్పుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సాయిగుప్తాను కిడ్నాప్ చేసైనా డాక్యుమెంట్లు రాయించుకోవాలని గౌతమ్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఆల్విన్ కాలనీలో ఉంటున్న సత్తెనపల్లికి చెందిన అన్నం అశోక్‌రెడ్డిని సంప్రదించగా అతను జగద్గిరిగుట్టకు చెందిన ముఠాతో కిడ్నాప్ చేయించేందుకు పథకం వేశాడు. ఈ నెల 14న రాత్రి కారులో సాయిగుప్తా, సతీష్ రెడ్డి గచ్చిబౌలిలోని పీఎస్‌ఆర్ టవర్ నుంచి ఇంటికి వెళుతుండగా రెండు కార్లలో గౌతమ్‌తో పాటు మరో పది మంది వారిని వెంబడించారు. హఫీజ్‌పేట్‌లో వారి కారును వెనక నుంచి ఢీ కొట్టడంతో ఏమి జరిగిందోనని సాయిగుప్తా, సతీష్ రెడ్డి కిందదు దిగారు. దీంతో వారిపై దాడి చేసి కారులో ఎక్కించుకుని జగద్గిరిగుట్టలోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అప్పు తీసుకున్నట్లు డాక్యుమెంట్లపై సంతకం చేయాలని ఒత్తిడి చేయడమేగాక వారిని చితకబాదారు. అక్కడినుంచి రాత్రికి రాత్రే వికారాబాద్ జిల్లాలోని ఓ ఫాం హౌస్‌కు తీసుకెళ్లి అక్కడ కూడా హింసించారు. సాయి గుప్తా భార్య తులసి శనివారం ఉదయం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్‌ఐ శోభన్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని వికారాబాద్‌కు పంపారు. పోలీసులు వస్తున్నట్లు సమాచారం అందడంతో నిందితులు బాధితులను అక్కడే వదిలి పరారయ్యారు. బాధితులను రెస్క్యూ చేసి హైదరాబాద్‌కు తీసుకురావడంతో కథ సుఖాంతమైంది. ప్రధాన నిందితులైన గౌతమ్, అశోక్ రెడ్డిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో 10 మంది నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'గోవుల తరలింపు కేసులో సాక్ష్యాలు తారుమారు చేసే యత్నం'

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న చాదర్‌ఘాట్ గోవుల తరలింపు కేసు దారిమళ్లుతోందని.. ప్రాణాలకు తెగించి గోవులను పట్టుకుంటే వాటి జాడ లేకపోవడం దారుణమని సంఘటన జరిగి దాదాపు 30 గంటలు గడుస్తున్నా ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడం దారుణమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు ఓ ప్రకటనలో ఆరోపించారు. పట్టుకున్న ఎద్దుల జాడ లేకపోవడం, అదేవిధంగా తరలిస్తున్న రెండు వాహనాలను ఇప్పటికి గుర్తించకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రాణాలకు తెగించి వాహనాలను అడ్డుకున్న యువతులను తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతూ.. చంపేస్తామంటూ ద్విచక్ర వాహనాలను పైకి ఎక్కించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై ఇప్పటికి కేసు నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధునాతనమైన టెక్నాలజీతో నగరం అంతా సీసీ కెమెరాలు అమర్చామని చెప్పుకుంటున్న మనం.. వాహనాలు ఎటు వెళ్లాయో.. అందులో తరలిస్తున్న ఎద్దులు ఎటు వెళ్లాయో గుర్తించలేకపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు. అక్రమంగా తరలిస్తున్న ఎద్దులు, వాటిని తీసుకువచ్చిన డ్రైవర్లు, వాహనాలను వెంటనే సీజ్ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది ఇద్దరు వ్యక్తులు సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, వాహనాన్ని ఆపిన యువతుల సెల్ ఫోన్ లాక్కు, వాటిలోని వీడియోలను డిలీట్ చేశారని ఆరోపించారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

నిమ్స్‌లో హబ్ అండ్ స్పోక్ విధానంలో డయాలసిస్



సదస్సులో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను చాకచక్యంగా నిర్వహించే నిమ్స్ కిడ్నీ బాధితులకు హబ్ అండ్ స్పోక్ విధానంతో డయాలసిస్ చేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఆదివారం నిమ్స్ హబ్‌లోని 38 స్పోక్ డయాలసిస్ సెంటర్‌లో పని చేస్తున్న టెక్నీషియన్లు, ఇతర సిబ్బందికి ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, నిమ్స్ నెఫ్రాలజీ విభాగం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో కూడిన డయాలసిస్ సేవలను అందించడంలో టెక్నీషియన్ల పాత్ర కీలకమన్నారు. రోగులు ఇన్‌ఫెక్షన్‌కు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి మూడు, నాలుగు సార్లు డయలాసిస్ చేయించుకోవాల్సి వస్తుందన్నారు. నిమ్స్‌లో 100 యంత్రాలపై నిత్యం 400 మందికి డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో అత్యధికంగా ఆరోగ్యశ్రీలో సేవలు పొందుతున్న వారు ఉన్నారన్నారు. కార్యక్రమంలో నిమ్స్ నెఫ్రాలజీ హెచ్‌ఓడి డాక్టర్ స్వర్ణలత, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీభూషన్ రాజు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రాజా కార్తీక్, నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ జి ఉప్పిన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

సాక్షి, సిటీబ్యూరో: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ఓల్డ్ మల్కాజ్‌గిరి లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను నిరుపేద వైశ్యులకు అందేలా చూస్తానని, అలాగే ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం దక్కేలా కృషి చేస్తానన్నారు. దేశ వ్యాప్తంగా 17 కోట్ల మంది వైశ్యులను ఏకం చేయడమే అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ లక్ష్యమన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పాత శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శిగా అలంపల్లి సురేష్ గుప్తా, కోశాధికారి బివిఎస్ గుప్తా, మహిళ విభాగం అధ్యక్షురాలిగా గీత రాణి, కార్యదర్శిగా ఉమా మహేశ్వరి, కోశాధికారిగా శారదలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ బీజేపీ నాయకులు ప్రభు గుప్త ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఐవీఎఫ్ తెలంగాణ కార్యదర్శి పబ్బ చంద్ర శేఖర గుప్త, మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ గుప్త, శ్రీనివాస్, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రైల్వే స్టేషన్లలో గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

నాంపల్లి: హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. ఆదివారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 26 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా, గిట్టివాడ అగ్రహారానికి చెందిన కర్రి రమణమ్మ, ఆమె కుమారుడు అర్లి గోవింద్ ఆదివారం హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా వారి దగ్గర ఉన్న ట్రాలీ బ్యాగ్‌లో 26.68 కిలోల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు.

గంజాయి చాక్లెట్లు పట్టివేత: ఒకరి అరెస్ట్



హాఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులు 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శేరిలింగంపల్లి నెహ్రూనగర్‌కు చెందిన బియాస్ గుప్తా (46) గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం హాఫీజ్‌పేట్‌లో చాకెట్లు విక్రయిస్తున్న అతడిని అదుపులోకి తీసుకుని 320 గంజాయి చాక్లెట్లు, చార్మినార్ గోల్డ్ మునక్కా 8 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సన్మానం



లిబర్టీ: కేంద్ర గనుల బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆదిలీలా ఫౌండేషన్ ప్రతినిధి బృందం కలిసింది. ఇటీవల కేంద్ర కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆయనను ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ సారథ్యంలోని ప్రతినిధి బృందం కలిసి అభినందించి ఆత్మీయ సత్కారం చేశారు. రెండోసారి కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేయటం శుభ పరిణామం అని పేర్కొంటూ రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం మంత్రి కిషన్‌రెడ్డి పని చేస్తున్నారని ఆదినారాయణ ఆనందం వ్యక్తం చేశారు.

నియామకం



వంశీకృష్ణకు నియామక పత్రాన్నిస్తున్న నవీన్

వెంగళరావునగర్: ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ షేక్‌పేట కన్వీనర్‌గా బోయమాన వంశీకృష్ణ నియమితులయ్యారు. ఆదివారం యూసుఫ్‌గూడలో జరిగిన సమావేశంలో ఆయనకు సొసైటీ హైదరబాద్ జిల్లా నగర అధ్యక్షుడు ఎ.నవీన్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు వంశీకృష్ణ జూబ్లీహిల్స్ నియోజకవర్గం వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి పలువురి నుంచి అభినందనలు అందుకున్నారన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి తనను షేక్‌పేట కన్వీనర్‌గా నియమించడం పట్ల అభినందనలు తెలిపారు. సొసైటీ నేతలు జి.ఎస్.సంతోష్, ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాస్, యూత్‌వింగ్ ఇన్‌చార్జి విశాల్, సనత్‌నగర్ కన్వీనర్ రాజు, జూబ్లీహిల్స్ ఉపాధ్యక్షుడు కె.వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌కు వచ్చే లింక్‌లు నొక్కొద్దు..
డబ్బులు పోగొట్టుకోవద్దు..!

◆ మీరు కరెంటు బిల్లు చెల్లించలేదు.. మీ కరెంటు మీటర్ కట్ చేస్తున్నాం.. బిల్లు చెల్లించండి.. అంటూ ఇటీవల ప్రశాసన్ నగర్‌లో నివసిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారికి ఫోన్ కాల్ వచ్చింది. తాను బిల్లు చెల్లించానని ఆయన చెబుతున్నా వినకుండా ఆన్‌లైన్‌లో ఈ లింక్ ఓపెన్ చేసి పే చేయండి అంటూ భయపెట్టాడు. ఆయన లింక్ ఓపెన్ చేసిన నిమిషం వ్యవధిలోనే మూడు దఫాలుగా రూ. 70 వేలు ఆయన ఖాతా నుంచి విత్ డ్రా అయ్యాయి. దీంతో లబోదిబోమంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ మీకు ఫెడెక్స్ కొరియర్‌లో వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. మిమ్మల్ని అరెస్టు చేయడానికి వస్తున్నామని బంజారాహిల్స్‌లో నివసిస్తున్న ఓ వైద్యురాలికి ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ ఫోన్ వచ్చింది. మేము ఇచ్చిన ఖాతాలోకి డబ్బు పంపకపోతే మిమ్మల్ని వెంటనే అరెస్టు చేయాల్సి వస్తుందంటూ ఆమెను బెదిరించారు. వెంటనే ఆమె లింక్ నొక్కి రూ. లక్ష సమర్పించుకున్నారు.



సైబర్ మోసాలపై అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఫిలింనగర్ పోలీసులు

బంజారాహిల్స్: సైబర్ చీటర్స్ చేతిలో మోసపోతున్న ఇలాంటి ఘటనలు ప్రతి పోలీస్‌స్టేషన్ లోనూ రోజుకు 5 నుంచి 10 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక్క బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఈ ఏడాదిలో ఇప్పటివరకు సైబర్ మోసాలపై 80 వరకు ఫిర్యాదులు అందుకున్నారు. దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ సైబర్ మోసాలపై రోజూ ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. లింక్‌లు నొక్కవద్దంటూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కలిగిస్తున్నా బాధితుల సంఖ్య పెరగడమే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కోసం గత కొంతకాలంగా ఫిలింనగర్ పోలీసులు ఆస్పత్రులు, బ్యాంక్‌లు, హోటళ్లు, మాల్స్ ఇతర రద్దీ ప్రాంతాల్లో మోసపోవద్దు అంటూ హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

- వెస్ట్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, పంజగుట్ట, బోరబండ, మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ మోసాలపై తరచూ సిబ్బందితో పాటు అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.
- మోసపూరితమైన ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సూచించారు.
- రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను ఆధారంగా చేసుకుని అమాయక జనానికి అధిక వడ్డీ ఆశ చూపించి పెట్టుబడి కంటే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పి మోసం చేస్తున్న ఘటనలు కూడా ఇటీవల పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.
- గుర్తుతెలియని నెంబర్ నుంచి వచ్చే లింక్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని, మన ప్రమేయం లేకుండానే మొబైల్స్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని పోలీసులు పేర్కొంటున్నారు.
- ఎవరైనా ఇలాంటి మోసాలకు పడితే బాధితులు వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు లేదా డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు పేర్కొంటున్నారు.
- సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని కూడా పేర్కొంటున్నారు.
- కస్టమర్ కేర్ నెంబర్లను కూడా ఇటీవల ఓ విశ్రాంత అధికారి గ్యాస్ పొయ్యి రిపేర్ కోసం వెతికి భారీగా డబ్బులు పోగొట్టుకున్న విషయాన్ని కూడా పోలీసులు హెచ్చరిస్తున్నారు.
- కస్టమర్ కేర్ నెంబర్లను గూగుల్‌లో వెతకవద్దని సూచిస్తున్నారు. అపరిచితుడి నెంబర్ నుంచి ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్ ద్వారా వచ్చే వీడియోకాల్స్‌కు స్పందించవద్దని కూడా హెచ్చరిస్తున్నారు.
- ప్రజలు లింక్‌ల జోలికి పోకపోతే ఖాతా నుంచి పైసా కూడా బయటకు పోదని, ఈ ఒక్క విషయాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించుకుని తమ బంధుమిత్రులు, చుట్టుపక్కల వారికి కూడా ఫంక్షన్లు, శుభకార్యాల్లో చర్చించుకుంటే ఎంతోమందిని కాపాడినవారమవుతామని పోలీసులు అంటున్నారు.

సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన

మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయండి

రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీల ద్వారా చైతన్యం

సైబర్ మోసం..? డయల్ 1930:



ఎవరైనా సైబర్ మోసానికి గురైతే క్షణాల్లోనే 1930కు ఫోన్ చేయాలి. మీరు ఎలా మోసపోయారో వివరిస్తున్న సమయంలోనే అక్కడి సిబ్బంది వెంటవెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ మరుక్షణంలోనే డబ్బులు పోగొట్టుకున్న బాధితుల బ్యాంక్ అకౌంట్లు, చీటింగ్ చేసిన సైబర్ మోసగాడి బ్యాంక్ అకౌంట్‌ను, సైబర్ మోసగాడి బ్యాంక్ అకౌంట్ నుంచి ఇతరులకు డబ్బులు మళ్లించిన వారి ఖాతాలను కూడా స్తంభింపజేశారు. సైబర్ మోసం జరిగిన మరుక్షణంలోనే ఇలా 1930కు ఫోన్ చేయడం వల్ల బాధితుడి నుంచి మిగతా డబ్బు విత్‌డ్రా కాకుండా సైబర్ మోసగాడి ఖాతా నుంచి డబ్బు ఇతర ఖాతాల్లోకి మళ్లకుండా చేయవచ్చు. ఈ ఒక్క విషయంలో ప్రజలు బాగా అవగాహన పెంచుకోవాలి. సైబర్ మోసాల పట్ల పలు కార్యక్రమాల ద్వారా మేము అవగాహన కల్పిస్తున్నాం. లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దు. అపరిచితుల కాల్స్‌కు స్పందించవద్దు. ఫెడెక్స్ పార్సిల్, కొరియర్ అంటూ ఇటీవల డ్రగ్స్ పేరిట ముంబాయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ చాలామందికి ఫోన్లు వస్తున్నాయి. ఏ ఒక్కరూ భయపడవద్దు. అలా ఫోన్ వచ్చిన మరుక్షణమే డయల్ 100కు సమాచారం ఇవ్వండి. అలాగే లింక్స్ ఓపెన్ చేయమని చెబుతారు. స్పందించవద్దు. బ్యాంక్ ఖాతాలు ఇస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయవద్దు. ఇలాంటి చిన్న చిన్న విషయాల్లో జాగ్రత్తగా ఉండి పోలీసుల రక్షణ కోరాలి.

– రాఘవేంద్ర, ఇన్‌స్పెక్టర్, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్

భక్తిశ్రద్ధలతో పండగలను జరుపుకోవాలి



కవర్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: ఏ పండగైనా భక్తి శ్రద్ధలు, ఐక్యతతో, ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ సూచించారు. సోమవారం జరగనున్న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పలు మసీదుల వద్ద పలువురికి ఆమె చెత్త కవర్లను పంపిణీ చేశారు. బక్రీదు సందర్భంగా తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మాంస విక్రయాలు, పంపిణీలను పురస్కరించుకుని వచ్చే వ్యర్థాలను తప్పనిసరిగా కవర్లలోనే వేయాలని వారికి సూచించారు. మన ఏరియాలను నిత్యం మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు మసీదుల కమిటీల నేతలు, ముస్లిం మత పెద్దలు మన్నాన్, అబ్దుల్లా, సమద్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, మహబూబ్, ఆంజనేయులు యాదవ్, జహంగీర్, దేవీసింగ్, అబున్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ ద్వారానే సీట్లను భర్తీ చేయాలి

లిబర్టీ: ఇంజినీరింగ్ బీ కేటగిరీ సీట్లను కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. యాజమాన్యం కోటా కింద లక్షలాది రూపాయలు దండుకొని సీట్లు అమ్ముకుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అన్నింటా వెనుకబడి దయనీయ జీవితాలు వెల్లడిస్తున్న బీసీ విద్యార్థులకు అన్యాయం చేయవద్దని ఆయన కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇంజినీరింగ్ బీ కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయకుండా ఇంజినీరింగ్ కళాశాల యజమాన్యాలు లక్షలాది రూపాయలకు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు 600 పైగా ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు విద్యను వ్యాపారంగా మార్చాలని విద్యను పేదలకు అందకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు అమ్ముకోకుండా కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేయాలని కుమారస్వామి కోరారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి



చెక్కు అందిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

లక్డీకాపూల్: పేద విద్యార్థుల చదువులకు అవసరమైన సహాయం చేసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఎంఎస్‌ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో నిరుపేదలైన విద్యార్థులకు చదువులకు సహాయం అందించారు. ఈసందర్భంగా ప్రసాద్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్య, వైద్యానికి సహాయం చేసేవారు మంచి పేరు సంపాదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులకు చెక్కుల రూపంలో సాయం అందచేశారు. ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీష రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి దైవ సన్నిధానం వార్షిక బ్రహ్మోత్సవాలు



ఫిలింనగర్ దైవ సన్నిధానం

బంజారాహిల్స్: విశాఖ శ్రీశారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవ సన్నిధానం వింశతి (20వ) వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 (సోమవారం) నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సోమవారం ఉదయం 8 గంటలకు విశేష అలంకారం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, హారతితో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు. 18న ఉదయం 8 గంటలకు శ్రీస్మార్తాగమ, శ్రీవైఖానస ఆగమముల ప్రకారం విశేష అలంకారం, సాయంత్రం 5 గంటలకు శ్రీభ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జునస్వామి వారి శాంతి కల్యాణం హారతి, శేష వాహనం, రాత్రి 7 గంటలకు అమృత గోపాల్‌చే కర్ణాటక సంగీత కచేరీ ఉంటాయన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, నిత్య హోమం, సాయంత్రం 5 గంటలకు శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి శాంతి కల్యాణం, గజ వాహనం, హారతి, రాత్రి 7 గంటలకు ఐశ్వర్యవల్లి కాకులపాటి శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శన ఉంటాయని తెలిపారు. 20న ఉదయం 7 గంటలకు శ్రీశ్రీ భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి విశేష పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం, అలంకారం, రాత్రి 7 గంటలకు గరుడసేవ, నిత్యపూజ, మోమం, ప్రసన్నలక్ష్మీ బృందంచే త్యాగరాజ సంకీర్తనల కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 21న ఉదయం చూర్ణోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, కైంకర్య దాతలకు స్వామి వారి శేష వస్త్ర ప్రసాదం, జ్యోతిపూర్ణిమచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 8 గంటలకు ధ్వజారోహణం ఉంటాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

ఆవుల తరలింపు ఆపేందుకు ముమ్మర తనిఖీలు



చెక్‌పోస్టుల వద్ద వ్యాన్లను తనిఖీ చేస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆవులను కబేళాలకు తరలించకుండా వెస్ట్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు వారాలుగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సోమవారం బక్రీద్ కావడంతో ఆదివారం అన్ని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఆటో ట్రాలీలు, లారీలు, డీసీఎం వ్యాన్‌లను, ప్రజా రవాణా ఆటోలను కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఒక్కో చెక్‌పోస్టులో ఆరు మంది పోలీసులు విధుల్లో ఉండి రేయింబవళ్లు తనిఖీలు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చెక్‌పోస్టులో ఏర్పాటు చేసిన పికెటింగ్ వద్ద బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తనిఖీల్లో పాల్గొన్నారు. సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా డీసీఎం వ్యాన్‌లను, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు.

కులగణనతోనే బీసీల సామాజిక అభివృద్ధి

కాచిగూడ: కులగణనతోనే బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నీలం వెంకటేష్, రాజేందర్, వేముల రామకృష్ణలతో కలిసి ప్రతినిధుల బృందం ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన పూర్తి చేసి పంచాయతీ రిజర్వేషన్లను 42 శాతం పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వీహెచ్‌ను వారు కోరారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే విధంగా చూడాలన్నారు.

కళాకారులకు పురస్కారం

చిక్కడపల్లి: కళలు, సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తాయని వక్తలు అన్నారు. సాంస్కృతిక సేవా సంస్థ సత్య సంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో సామాజిక చైతన్యమూర్తుల పేరిట సినీనటులు, కళాకారులకు ఆత్మీయ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లు పలువురు ప్రముఖులకు ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించి మాట్లాడారు. మన సంస్కృతిని ప్రతిబింబించే కళాకారులు సాహితీవేత్తలను సత్కరించడం హర్షణీయమన్నారు. సంస్థ కళాకారులు, నటులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించడం అభినందనీయమన్నారు. ప్రముఖులు శ్రీమణి, కె.కృష్ణ, హనుమంతరాయశర్మ, క్రాంతికృష్ణ, పూజిత, శైలజ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 57, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 60, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 70, పచ్చ కాకర 55, పందిరి బీర 75, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 35, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 35, దోసకాయ 28, రూట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 33, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఇంట్లోని విలువైన ఆభరణాల చోరీ

రహమత్‌నగర్: బోరబండ డివిజన్ సైట్-3లోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... బోరబండ సైట్-3 నాట్కో స్కూల్ వద్ద నివాసం ఉండే తోట నాగేశ్వర్‌రావు వాటర్ ప్రూఫ్ పనిచేస్తుంటాడు. శుక్రవారం తన కుటుంబ సభ్యులు కలిసి పనిమీద బయటికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి ఇంట్లోని బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. అనుమానం వచ్చిన నాగేశ్వర్‌రావు లాకర్ తెరిచి చూడగా అందులోని విలువైన బంగారు, వెండి నగలతోపాటు ల్యాప్‌టాప్, గడియారాలు కనిపించ లేదు. దీంతో బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జోరుగా గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు

సనత్‌నగర్: బక్రీద్‌ను పురస్కరించుకుని గొర్రెలు, పొట్టేళ్ల అమ్మకాలు ఆదివారం జోరుగా సాగాయి. ఎర్రగడ్డ–సనత్‌నగర్ రహదారిలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటుచేసి విక్రయాలు జరిపారు. ఆదివారం మార్కెట్ కావడంతో గొర్రెలు, మేకల కొనుగోలుదారులతో కిటకిటలాడింది. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గొర్రెల దిగుమతి తగ్గడం..ఇదే క్రమంలో డిమాండ్ పెరగడంతో ధరలు కూడా పెరిగిపోయాయి. గత ఏడాది రూ.10 వేలు పలికిన గొర్రె ఈ ఏడాది రూ. 15 వేలకు తగ్గడం లేదు. చెంగిచెర్ల, కర్నూలు, వైఎస్సార్ జిల్లా, పెబ్బేరు వంటి దూర ప్రాంతాల నుంచి నగరానికి తీసుకురావడంలో రవాణా భారం అధికంగా ఉంది. రవాణా సమయంలో కొన్ని జీవాలు దెబ్బతినడం, వాటిని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురాకపోవడం తదితర కారణాలతో ధరలు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతు న్నాయి. కొనుగోలుదారులు అంత పెద్దమొత్తం చెల్లించి కొనాలంటే ఆలోచిస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

భగత్‌సింగ్‌కాలనీ ప్రెసిడెంట్‌గా మోడల సహదేవ్



సహదేవ్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీ ప్రెసిడెంట్‌గా మోడల సహదేవ్ ఘన విజయం సాధించారు. ఆదివారం బస్తీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 220 ఓట్లకుగాను 216 ఓట్లు పోలయ్యాయి. ప్రెసిడెంట్‌గా గెలిచిన సహదేవ్‌కు 110 ఓట్లు రాగా ఆయనపై పోటీ చేసిన గందె అరుణ్‌కుమార్‌కు 95 ఓట్లు, వెంకటయ్యకు 11 ఓట్లు వచ్చాయి. ప్రెసిడెంట్‌గా గెలిచిన అనంతరం సహదేవ్ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్‌ను కలవగా ఆయన అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సహదేవ్ మాట్లాడుతూ... బస్తీ అభివృద్ధి కృషి చేస్తానని, ఈ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ అందరినీ కలుపుకుంటూ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజాసేవ కోసం అంకితమవుతానన్నారు. బస్తీ పరిశుభ్రతకు పాటుపడతానని, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. కాలనీ వాసుల ఐకమత్యం, అందరి సంక్షేమం కోరుకుంటానని పేర్కొన్నారు.

బ్యాగులో ఉంచిన ల్యాప్‌టాప్ మాయం

వెంగళరావునగర్: బ్యాగ్‌లో ఉంచిన ల్యాప్‌టాప్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీలోని అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతానికి చెందిన హేమలత మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ అమీర్‌పేటలో చదువుతోంది. ఈ నెల 13వ తేదీ రాత్రి తన ల్యాప్‌టాప్‌ను బ్యాగ్‌లో ఉంచి నిద్రపోయింది. ఉదయం లేచి బ్యాగ్ చూసే సరికి ల్యాప్‌టాప్ మాయమైంది. పలుప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేనందున మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాట్య ప్రదర్శనకు పంపుతామని నగదు తీసుకుని మోసం

నాట్య ప్రదర్శనకు పంపుతానని నగదు తీసుకుని మోసం చేసిన మహిళపై బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన వినీల మధురానగర్‌లో కూచిపూడి నేర్పిస్తుంటుంది. ఆమెకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మనోజ్ఞ అనే మహిళ కూచిపూడి నృత్య ప్రదర్శన చేయించడానికి వినీలతో ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో నాట్య ప్రదర్శన ఉంటుందని మనోజ్ఞ తెలియజేసింది. ఇందుకోసం దాదాపు 12 మంది కళాకారుల నుంచి రూ. 2.40 లక్షల వరకు వినీల ప్రోగ్రాం మేనేజర్ మనోజ్ఞకు ఆమె భర్త అకౌంట్ ద్వారా పంపించారు. అనుకోకుండా మనోజ్ఞ భర్త మృతిచెందాడు. దాంతో నాట్య ప్రదర్శనలు రద్దు చేశారు. ప్రదర్శనల నిర్వహణ కోసం తీసుకున్న నగదును తిరిగి ఇవ్వాలని వినీల ఆమెను అడగ్గా తాను ఇవ్వనంటూ చెప్పింది. దాంతో తాము మోసపోయామని గ్రహించిన వినీల, ఆమె శిష్యబృందం మధురానగర్ పీఎస్‌లో మనోజ్ఞపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే బిహార్‌కు చెందిన గ్యాంగ్ నీట్ పేపర్ లీకేజ్ చేశాయన్న విషయం బయటకు రావడంతో ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వెంటనే స్పందించాలన్నారు. మెడికల్ కౌన్సెలింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోనే నీట్ పరీక్ష పెద్ద స్కామ్‌గా మారిందని, నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సీబీఐ దర్యాప్తు సంస్థచే విచారణ జరిపించాలన్నారు. ఈ స్కామ్ వెనుక ఉన్న ఎంతటివారినైనా వదిలిపెట్టకుండా దేశద్రోహం కింద శిక్షించాలన్నారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాజేష్, వినోద్, ప్రవీణ్, ఉదయ్, అభిలాష్, గిరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు వేదికగా డంపింగ్ యార్డు



క్వారీ మైదానం

రహమత్‌నగర్: ఒకప్పుడు గుంతలు, వ్యర్థాలతో నిండిన ఈ ప్రాంతం డంపింగ్ యార్డుగా ఉండేది. ఇప్పుడు వేడుకలకు వేదికగా మారింది. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ ప్రాంతంలోని గోరఖ్‌నాథ్ శివాలయం ముందు దాదాపు నాలుగు ఎకరాల స్థలంలో 50 అడుగుల గుంత ఉండేది. క్రీడాస్థలంగా మార్చాలనే లక్ష్యంతో వేలాది వాహనాలతో మట్టిని పోసి గుంతలో నింపారు. ఇందు కోసం మూడు నెలల సమయం పట్టింది. దానికి తోడు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిధులు సైతం మంజూరయ్యాయి. ఇప్పుడు ఈ క్వారీ మైదానం వేడుకలు, ప్రార్థనలు, సంబరాలు, క్రీడా పోటీలకు వేదికగా మారింది. విశాలంగా, అనుకూలంగా ఉండటంతో క్రిస్మస్ వేడుకలు, రంజాన్, బక్రీద్ ప్రార్థనలు, రెండు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోనే కొనసాగుతుండటం విశేషం. తాజాగా మరోమారు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైంది ఈ మైదానం.

'ద్వానా'శాస్త్రికి ఘన నివాళి

చిక్కడపల్లి: ద్వానాశాస్త్రి అని పిలవబడే ద్వాదశి నాగేశ్వర శాస్త్రి వివిధ పత్రికలకు పలు సాహితీ ప్రక్రియల్లో రచనలు అందించి సాహితీ ఖజానాగా గుర్తింపు పొందారని ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకని కొనియాడారు. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికపై 'ఎందరో మహానుభావులు' కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ద్వానా శాస్త్రి జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎందరో గ్రంథాలకు సమీక్షలు నిర్మోహమాటంగా రాసిన శాస్త్రి 80కి పైగా వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారని వివరించారు. తెలంగాణ సాహిత్య వీణ పేరిట రాష్ట్రంలో లబ్ద ప్రతిష్ట పొందిన గత కాలపు సాహితీవేత్తలను నేటి వారికి పరిచయం చేశారన్నారు. ఇది పరిశోధక విద్యార్థులకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. స్నేహశీలి ఉత్తమ వ్యక్తిత్వం కలశాస్త్రికి గానసభతో తన అన్నదీక్షితులుతో ఆత్మీయ అనుబంధం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన 12గంటల సాహితీ ప్రసంగం గానసభలో చేసినప్పుడు అశేష ప్రేక్షకులు ప్రత్యేకించి సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు హాజరు కావటం విశేషమన్నారు. ప్రముఖ గాయని ఆమని తదిరతులు పాల్గొన్నారు.

యువత ఉపాధి వైపు పయనించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయనించి జీవనోపాధిని పొందాలని కేశవ స్మృతి సంవర్ధన సమితి అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ శిబిరం ఐదో జట్టు 25 మందితో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి యువతలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ యజమాని కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

5కే గ్రీన్ రన్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఖైరతాబాద్: కాలుష్యపు కోరల నుంచి పర్యావరణాన్ని రక్షించాలని కోరుతూ ఆదివారం ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులో 5కే రన్ నిర్వహించారు. సంజీవయ్య పార్కు నుంచి జలవిహార్ వరకు సాగిన ఈ గ్రీన్ రన్‌ను ట్రస్ట్ చైర్మన్, విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ అలీషా జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణం పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా వన సంపదను పెంచడమే ప్రధాన ధ్యేయంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని, ప్రజలంతా నీటి సంరక్షణకు పాటుపడాలని, ప్రకృతి ప్రసాదిత వర్షపునీటిని ఒడిసి పట్టి నీటిని కాపాడుకోవాలన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే గ్రీన్ రన్ నిర్వహించామని తెలిపారు. కృత్రిమ ఆక్సిజన్ సిలిండర్‌తో చిన్నారులు, ప్రజలకు అవగాహన కల్పించారు.

బ్లడ్ డోనర్స్ వాక్

లక్డీకాపూల్: దాదాపు 1,500 మంది.. మూడు కిలోమీటర్లు.. ఏకరూప దుస్తులతో నడక సాగించారు.. రక్తదానం ప్రాధాన్యతను చాటిచెప్పారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వాక్.డొనేట్.రిపీట్ అనే థీమ్‌తో బ్లడ్ డోనర్స్ వాక్ నిర్వహించారు. అపోలో హాస్పిటల్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సంయుక్తంగా రక్తదానం ప్రాముఖ్యత, అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశంగా జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్ వద్ద ఈ వాక్ నిర్వహించాయి. రక్తదానంపట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఒక యూనిట్ బ్లడ్ ముగ్గురి జీవితాలలో వెలుగులు నింపుతుందన్నారు. టీసీఎస్ సహకారం అందించడం హర్షణీయమని అపోలో తెలంగాణ రీజియన్ సీఈవో తేజస్వీరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర బాబు అన్నారు. టీసీఎస్ రీజినల్ హెడ్ చల్ల నాగ్, హైదరాబాద్ హెచ్‌ఆర్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ అపోలో హాస్పిటల్ భవిష్యత్తులో ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అపోలో బ్లడ్ బ్యాంక్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధా రంగనాథన్ తదితరుల పాల్గొన్నారు.



వాక్. డొనేట్. రిపీట్ అనే థీమ్‌తో నిర్వహించిన వాక్ దృశ్యం

గోడలపై ఓంకారం.. 'రంగుల'కు శ్రీకారం


ఆలయ గోడలపై ఓంకారం రాస్తున్న అనిల్ కుమార్ యాదవ్

చాంద్రాయణగుట్ట: పాత నగరంలో పుట్టి పెరిగిన తాను లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతోనే చిన్న వయసులో ఎంపీని కాగలిగానని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనంతరం ఆయన మొదటిసారిగా అమ్మవారి ఆలయానికి ఆదివారం విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, బోనాల అనంతరం కమిటీ సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విస్తరణ విషయమై విన్నవిస్తామన్నారు. ఢిల్లీలో నిర్వహించే బోనాలకు కూడా ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామన్నారు. అనంతరం బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆయన ఆలయ గోడపై ఓంకారం రాసి నూతన రంగులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్‌తోపాటు ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, కోశాధికారి పోసాని సతీష్ ముదిరాజ్, కన్వీనర్ అరవింద్ గౌడ్‌తోపాటు మాజీ చైర్మన్లు కె.వెంకటేష్, విష్ణుగౌడ్, బంగ్లా రాజు యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ క్యాంటీన్ పరిశీలన

'సాంబార్‌లో పురుగు'రాలేదన్న ప్రిన్సిపాల్



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలోని క్యాంటీన్ సాంబారులో పురుగు వచ్చిందని విద్యార్థులు చేసిన ఆరోపణలపై ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి స్పందించారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ హాస్టల్‌కు వెళ్లి వంటగది, వంటపాత్రలు, హాస్టల్ ఆవరణను పూర్తిస్థాయిలో పరిశీలించారు. హాస్టల్ సిబ్బంది, వార్డెన్‌తో మాట్లాడిన తరువాత ఎక్కడా పొరపాటు జరగలేదని నిర్ధారణకు వచ్చారు. ఇది ఎవరో ఉద్దేశపూర్వకంగా చేసినట్లుగా తెలుస్తున్నదని అనుమానం వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనల పట్ల కమిటీ వేసి, నిజ నిర్ధారణ చేసిన తరువాత ఇటువంటి ఆరోపణలు చేసినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రిన్సిపాల్, కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా హాస్టల్‌లో ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోనున్నట్లు, ఇటువంటివి తిరిగి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. హాస్టల్ వార్డెన్ డాక్టర్ దుర్గాకుమార్ కూడా హాస్టల్‌లో భోజనం, సాంబార్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించారు. పురుగు లేదని, కేవలం ఉద్దేశపూర్వకంగా కొంతమంది ఆరోపణలు చేశారని అన్నారు.

కనులపండువగా శ్రీవారి రథోత్సవం


రథోత్సవంలో దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

హిమాయత్‌నగర్: టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు లిబర్టీలోని శ్రీవారి ఆలయంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు రథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారి రథాన్ని దర్శించిన వారికి జన్మాదిదుఃఖాలు నశించి, మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. సాయంత్రం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

గర్వించదగ్గ ఇంద్రజాలికుడు పట్టాభిరాం

బంజారాహిల్స్: ఇంద్రజాలికుడిగా, హిప్నటిస్టుగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, మానవ సంబంధాల కౌన్సెలర్‌గా, ప్రజాప్రతినిధులకు నడవడిక నేర్పిన కమ్యూనికేషన్ చతురుడిగా పట్టాభిరాం తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేశారని పలువురు వక్తలు ప్రశంసించారు. డాక్టర్ పట్టాభిరాం, ఆయన సతీమణి జయశేషుల వైవాహిక జీవిత స్వర్ణోత్సవం సందర్భంగా ఆదివారం 'జీవితం ఒక ఉత్సవం'అనే పట్టాభిరాం 'బతుకు కథ'పుస్తక ఆవిష్కరణ దసపల్లా హోటల్‌లో ఘనంగా జరిగింది. ఎమెస్కో విజయకుమార్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు, సినీ నటుడు రాజేంద్రప్రసాద్, ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణకుమార్, డాక్టర్ కె.వి.పి.రామచంద్ర రావు, పూర్వ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.వి.ఆర్.కృష్ణారావు, ఏపీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ ప్రసాదరావు, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్ తదితరులు ప్రసంగించారు. లక్షలాది విద్యార్థుల కెరీర్‌లను, ఆత్మహత్యల స్థాయికి చేరుకున్న నిర్వేదంలోంచి యువత జీవితాలను కాపాడి తీర్చిదిద్దిన మార్గదర్శిగా, వేలాది కుటుంబాల్లో మానవ సంబంధాలను నిలబెట్టిన కౌన్సెలర్‌గా జాతీయ స్థాయిలోనే ప్రామాణికంగా నిలిచారని కొనియాడారు.

వృద్ధాప్యం బరువై.. ఆదరణ కరువై..

సాక్షి, సిటీబ్యూరో: పండుటాకులకు ఎంత కష్టం.. జీవనయానం ఎంత దయనీయం.. మలిసంధ్య వేళ వెలుగురేఖల్లేక అంధకారం అలముకుంది. వృద్ధాప్యం బరువైంది.. ఆదరణ కరువైంది. వృద్ధులను నిరాదరణ, నిర్లక్ష్యం ఆవరించాయి. అనువైన జీవనం కోసం ఎక్కువ శాతం మంది వృద్ధులు సంరక్షకులపై ఆధారపడాల్సి వస్తోందని హెల్ప్‌ఏజ్ ఇండియా నివేదిక వెల్లడించింది. హెల్ప్ ఏజ్ ఇండియా ఈ ఏడాది జాతీయ నివేదిక విడుదల చేసింది. పది రాష్ట్రాల్లో 20 ముఖ్యమైన టైర్ 1, 2 నగరాల్లో 5,169 వృద్ధులు, 1,333 వృద్ధుల సంరక్షకులు, కుటుంబసభ్యులపై అధ్యయనం చేసింది. ఈ సర్వేలో భాగంగా పలు కీలక ఆర్థిక, ఆరోగ్య, ప్రాథమిక సంరక్షణ విషయాలు వెలుగుచూశాయి. ప్రతి ముగ్గురు వృద్ధుల్లో ఒకరు ఆర్థిక సమస్యల్లో ఉన్నారు. వృద్ధుల్లో ఎలాంటి ఆదాయంలేని పురుషులు 27 శాతం, మహిళలు 38 శాతం ఉన్నారు. 32 శాతం వృద్ధులు రూ.50 వేల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నారు. 29 శాతం వృద్ధులు మాత్రమే సామాజిక భద్రతా పథకాలైన వృద్ధాప్య పెన్షన్/కాంట్రిబ్యూటరీ పెన్షన్/ప్రావిడెంట్ ఫండ్‌లను పొందుతున్నారని సర్వే వెల్లడించింది. నిరక్షరాస్యులైన వృద్ధులు (40 శాతం) ఎలాంటి ఆదాయ వనరులు లేక అవస్థలు పడుతున్నారు.

54 శాతం మందికి వ్యాధులు

52 శాతం వృద్ధులు ఆరోగ్యపరంగా నిత్యం ఏదో ఒక ప్రాథమిక సవాలును ఎదుర్కొంటున్నారు. 54 శాతం మంది రెండు లేదా అంతకంటే ఎక్కువ వ్యాధులతో బాధపడుతున్నారు. 31 శాతం మంది వృద్ధులు మాత్రమే ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రామ్, ఈఎస్ఐ–సీజీహెచ్‌ఎస్ వంటి ఆరోగ్య బీమాలను కలిగి ఉండగా, 3 శాతం మంది మాత్రమే కమర్షియల్ హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసినట్లు నివేదించారు. ఆరోగ్య బీమా లేకపోవడానికి ప్రధాన కారణాలుగా అవగాహన లేకపోవడం(32%), ఆర్థిక స్తోమత లేకపోవడం (24%), దాని అవసరం లేకపోవడం (12%) అని గుర్తించారు. 1.5 శాతం మంది మాత్రమే టెలీ–హెల్త్ సేవలను ఉపయోగించారు. 79 శాతం మంది వృద్ధులు ప్రభుత్వ ఆసుపత్రులు/క్లినిక్‌లు/పీహెచ్‌సీలను సందర్శించారు. 80 ఏళ్లపైబడిన 47 శాతం మందికి ఆసుపత్రులకు వెళ్లడానికి వ్యక్తిగత ఆదాయం లేక అవస్థలను ఎదుర్కొంటున్నారని హెల్ప్‌ఏజ్ ఇండియా పాలసీ రీసెర్చ్ అండ్ అడ్వకేసీ హెడ్ అనుపమ దత్తా వెల్లడించారు.

నిరక్షరాస్యులపట్ల నిర్లక్ష్యం

వృద్ధులు నిర్లక్ష్యానికి గురికావడంలో కుమారులు 42 శాతం, కోడళ్లు 28 శాతం కారణంగా ఉన్నారు. నిర్లక్ష్యం ఎదుర్కొన్నవారిలో అత్యధికులు నిరక్షరాస్యులు కాగా, వృద్ధుల ఆదాయం తగ్గడంతో వారిపై నిర్లక్ష్యం పెరిగిందని 73 శాతం బాధితులు నివేదించారు. ఈ బాధితులు (94 శాతం మంది) కనీసం ఒక దీర్ఘకాలిక వ్యాధికి గురికావడం వల్ల కుటుంబ సభ్యులపై ఆధారపడుతున్నారని వెల్లడైంది. నిర్లక్ష్యానికి గురైన బాధితులు.. వారిని దూషించడం, కొట్టడం వంటి చర్యలను తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు తెలియజేయగా, పరిష్కారం లభించలేదని కుమిలిపోతున్నారు. దీనికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు చాలా అత్యల్పమని హెల్ప్‌ఏజ్ ఇండియా సీఈఓ రోహిత్ ప్రసాద్ పేర్కొన్నారు.



మంచాన పడినప్పుడు...

వృద్ధుల సంరక్షణలో కుటుంబసభ్యులు ప్రాథమిక పాత్ర పోషించారని సర్వే తెలిపింది. వృద్ధులు మంచాన పడినప్పుడు వారి జీవిత భాగస్వామి లేదా పిల్లలు చూసుకున్నారని, 68 శాతం మంది సంరక్షకులు వారికి బాసటగా నిలిచామని తెలిపారు. సగటున వారంలో దాదాపు 20 గంటలు వారి సేవలకే అంకితం చేశామని సంరక్షకులు తెలిపారు. అయితే సంరక్షణలో భాగంగా 10 శాతం మంది మాత్రమే సమీపంలో వృద్ధాశ్రమం, డే కేర్ సెంటర్లు, పాలియేటివ్ కేర్(ఉపశమన సేవలు) వినియోగించుకున్నారని వెల్లడైంది. జెరియాట్రిక్ హెల్త్‌కేర్ సౌకర్యాలను 15 శాతం మంది మాత్రమే అందించారు.

40 ఏళ్లు కాపాడితే.. ఉన్నట్టుండి కబ్జా


నేడు బోర్డు తొలగించి ఉన్న దృశ్యం


మొన్న హెచ్చరిక బోర్డుతో...

బంజారాహిల్స్: అది 460 గజాల సర్కార్ భూమి.. అందులో హెచ్చరిక బోర్డు కూడా ఉంది. 40 ఏళ్లుగా స్థానికులు దానిని కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే ఉన్నట్టుండి దానిపై కబ్జాదారుల కన్ను పడింది. జేసీబీలు ప్రత్యక్షమయ్యాయి. బోర్డు మాయమైంది. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జేసీబీలతో వచ్చినవారిని తరిమికొట్టారు. ఈ ఘటన బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13లోలని శ్రీరాంనగర్ బస్తీలో చోటు చేసుకుంది. బస్తీ దవాఖానాతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఈ స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నామని పేర్కొంటున్నారు. వీరికి ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మించే ప్రతిపాదనను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. 'శ్రీరామ్‌నగర్ బస్తీలో 460 గజాల స్థలాన్ని ఎవరో చదును చేస్తున్నారంటూ స్థానికులు ఫిర్యాదు చేయగా పనులు నిలిపివేశాం. ఈ స్థలాన్ని జీఓ 92 కింద క్రమబద్ధీకరించుకున్నామంటూ ఇద్దరు వ్యక్తులు నా దృష్టికి తీసుకురాగా, ఆ డాక్యుమెంట్లు తీసుకుని రావాలని చెప్పాను'అని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి అన్నారు.

ఆక్యుపంక్చర్‌తో సంపూర్ణ ఆరోగ్యం


వైద్యులకు పట్టాలు అందజేస్తున్న మాధవీలత

విజయనగర్‌కాలనీ: ఆక్యుపంక్చర్ వైద్యవిధానాన్ని అనుసరిస్తే మందులు లేకుండానే సంపూర్ణ ఆరోగ్యంతో జీవితాంతం ఉండవచ్చని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత కె.మాధవీలత, పలువురు వైద్యులు పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో ఆదివారం ఆక్యుపంక్చర్ డిప్లొమాలో ఉత్తీర్ణులైనవారికి స్నాతకోత్సవాన్ని నిర్వహించి పట్టాలు ప్రదానం చేశారు. కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్, నేచురోపతి వారి ఆధ్వర్యంలో ఘనంగా 10వ కాన్వొకేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాధవీలతతోపాటు ప్రముఖ వైద్యులు మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ విధానాన్ని అనుసరించినవారికి ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్, దుష్పరిణామాలు ఉండవన్నారు. వ్యాధి మూలాన్ని కనిపెట్టి చికిత్స అందించి, దినచర్యలో స్వల్ప మార్పులు చేస్తే సరిపోతుందన్నారు. బీపీ, షుగర్, మైగ్రేన్, మోకాళ్ల, కీళ్ల నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక రుగ్మతాలు సైతం ఈ చికిత్స విధానంతో శాశ్వతంగా దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్యుపంక్చర్ వైద్యనిపుణులు డాక్టర్ సుధాకర్ రావు, డాక్టర్ పీఎల్‌కే దుర్గ, డాక్టర్ చిదంబరంతోపాటు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆహుతులను అలరించాయి.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


5కే వాక్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న గీతా భాస్కర్, వాణి

శంకర్‌పల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలని ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ తల్లి నటి గీతాభాస్కర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శారద నేరెళ్ల అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం మోకిలలోని పీజీ హిల్స్‌లో గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మోకిల శారీథాన్ సెకండ్ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతా భాస్కర్, శారద నేరెళ్ల ముఖ్య అతిథులుగా హాజరై 5కే, 3కే వాక్‌లను జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద ఎత్తున మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నెదర్లాండ్స్ పర్యటనకు జీహెచ్‌ఎంసీ ఈఈ



సాక్షి, సిటీబ్యూరో: 'వేస్ట్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్' మిషన్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు నెదర్లాండ్ ఆహ్వానం మేరకు జీహెచ్‌ఎంసీలో ఘనవ్యర్థాల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.శ్రీనివాసరెడ్డి ఆ దేశానికి బయలుదేరి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం, నెదర్లాండ్స్ ప్రభుత్వం ఘనవ్యర్థాల నిర్వహణపై పనిచేసేందుకు గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా నెదర్లాండ్స్‌లో ఘనవ్యర్థాల నిర్వహణ కోసం రెండు దేశాలు పరస్పరం విజ్ఞానాన్ని పంచుకోనున్నాయి. నగరంలో చెత్త నిర్వహణలో మనం అనుసరిస్తున్న విధానాలు తదితరమైనవాటి గురించి శ్రీనివాసరెడ్డి అక్కడ వివరించనున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ప్రైవేటు విద్యాసంస్థల అక్రమాలను అరికట్టాలి

ఇండియన్ నేషనల్ యువజన పార్టీ డిమాండ్



మాట్లాడుతున్న క్రాంతికుమార్

హిమాయత్‌నగర్: ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో అక్రమాలను అరికట్టాలని ఇండియన్ నేషనల్ యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన విద్యావిధానం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజుల పేరుతో తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పుస్తకాలు, నోట్ బుక్స్‌ను పాఠశాలల్లో అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం అన్ని కాలేజీలు, ఇన్‌స్టిట్యూషన్స్ బంద్ చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో బెదిరింపులకు పాల్పడే కళాశాలల యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతి కాలేజీలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్‌ని అందుబాటులో ఉంచాలన్నారు. కాలేజీ బయట నోటీసు బోర్డు సైతం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే కాలేజీలపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీసీలు, సర్టిఫికెట్స్, ఆన్‌లైన్ ద్వారా కాకుండా డైరెక్ట్‌గా బోర్డు ద్వారా విద్యార్థులకు అందజేయాలని క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు కునాల్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

కూర రాజన్న క్షమాపణ చెప్పాలి

సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి గ్రూపునేత ప్రభాకర్ డిమాండ్



మాట్లాడుతున్న ప్రభాకర్ తదితరులు

సుల్తాన్‌బజార్: హత్యా రాజకీయాలు, బెదిరింపులు, భౌతికదాడులు, రాజకీయ తప్పిదాలపై జనశక్తి నేత కూర రాజన్న నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకుని విప్లవ ప్రజానీకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎంపీ ప్రసాద్, వసంతక్క లాంటి ఎందరో నిరాయుధులైన విప్లవకారులపై హత్య రాజకీయాలు కొనసాగించారని ఆరోపించారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రపుల్లారెడ్డి నిర్మించిన గోదావరిలోయ విప్లవ ప్రతిఘటన ఉద్యమం పెడదోవపట్టి బలహీన పడటానికి కూర రాజన్న కారకుడని ఆరోపించారు. రాజకీయ సైద్ధాంతిక, నిర్మాణపరమైన అంతర్గత పోరాటంలో నిలబడలేక విప్లవ సంస్కృతిలో రౌడీయిజం, గుండాయిజాన్ని చొప్పించారన్నారు. జూన్ 18 నుండి 25 వరకు తెలుగు రాష్ట్రాలో జరిగే ప్రసాదన్న, వసంతక్కల 19వ వర్ధంతి సభలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంస్థ జాతీయ కార్యదర్శి షేక్ షావలీ, భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు, భారత ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంపంగి పద్మ, రాష్ట్ర కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

తుళ్లి పడిపోయే ముందు తెలుసుకోవచ్చు

కిమ్స్ ఆస్పత్రి న్యూరో రిహాబిలిటేషన్ హెడ్ డాక్టర్ అజయ్ కుమార్

రాంగోపాల్‌పేట్: వృద్ధులు తుళ్లి కింద పడిపోవడాన్ని ముందే గుర్తించే న్యూరో రిహాబిలిటేషన్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి న్యూరో రిహాబిలిటేషన్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్ మిద్దె అన్నారు. రెండు రోజులపాటు కిమ్స్ ఆస్పత్రిలో జరిగిన జాతీయ స్థాయి సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది ఫిజియోథెరపిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్‌కుమార్ మిద్దె మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఎవరికి ఎలాంటి ఫిజియో థెరఫీ చేయాలన్నది ముఖ్యమని కొందరికి కొన్ని రకాలు మరికొందరికి కొన్ని అసలు చేయకూడదన్నారు. చికిత్సల్లో సరికొత్త ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినట్లే భవిష్యత్తులో వచ్చే సమస్యలను ముందుగానే తెలుసుకునే పరీక్షలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మోకాళ్ల కీలు మార్పిడి తదితర శస్త్ర చికిత్సలు చేయించుకున్న వృద్ధులు తరచూ కిందపడిపోతుంటారని, భవిష్యత్తులో ఇలా పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుగానే గుర్తించేవారికి తగిన సూచనలు, సలహాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ తరచూ ఇలాంటి సదస్సులు నిర్వహించుకోవడం వల్ల విజ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలకు చెందిన వైద్యులకు చేరవేసి గ్రామీణ ప్రాంత రోగులకు మంచి వైద్యాన్ని అందించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి, డాక్టర్ జయశంకర్, డాక్టర్ శ్వేత పెండ్యాల, డాక్టర్ సిద్ధార్థ తంటాయత్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న డాక్టర్ విజయ్‌కుమార్ మిద్దె తదితరులు

భూ పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ ఏదీ..?

- అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, అసైన్డ్ భూములు
- దృష్టి సారించని రెవెన్యూ శాఖ

సాక్షి,మేడ్చల్ జిల్లా: రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంతో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 11,384 అసైన్డ్ భూములు, 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా వాటికి రక్షణ కరవైంది. భూసంరక్షణకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్(కమిటీ)లు లేకపోవటంతో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ లేకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సగం భూములు పలు లిటికేషన్లతో వివాదాల్లో ఉండగా, మరికొన్ని భూములు రియల్టర్లు, భూఆక్రమణదారుల చేతుల్లో వెంచర్లు, విల్లాలు, ఇండిపెండెంట్ ఇళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో వాటిని స్వాధీనం చేసుకోవటం రెవెన్యూ శాఖకు సాధ్యం కాని పరిస్థితి నెలకొనటంతోపాటు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉన్న కొద్దిపాటి భూముల రక్షణకు ఫెన్సింగ్‌సహా బోర్డులు లేకపోవటంతో కబ్జాకు గురవుతున్నాయి.

ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిస్థితి ఇదీ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పేద వర్గాలకు అసైన్ చేసిన 80 శాతం భూములన్నీ రియల్టర్ల కబ్జాలో ఉన్నట్లు తెలుస్తుంది. 2004 సంవత్సరం వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని 116 గ్రామాలకు చెందిన 8,230 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను వ్యవసాయం, ఇళ్ల స్థలాల కోసం అసైన్ చేశారు. ఘటేస్కర్ మండలం 17 గ్రామాల్లో 1,610 ఎకరాలు, శామీర్‌పేట మండలం 30 గ్రామాల్లో 1,451 ఎకరాలు, కీసర మండలం 16 గ్రామాల్లో 1,500 ఎకరాలు, మేడ్చల్ మండలం 29 గ్రామాల్లో 4,400 ఎకరాలు, ఉప్పల్ మండలం 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలం 18 గ్రామాల్లో 855 ఎకరాలు అసైన్డ్ భూములు ఉండగా, ఇందులో చాలా భూములు అన్యాక్రాంతమయ్యాయి.



జిల్లాలోని ప్రభుత్వ భూముల పరిస్థితి కూడా అంతంతమాత్రమే. 12 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ లెక్కలు తేలినప్పటికిని,ఇందులో ఎన్ని భూములు కబ్జా అయింది..? సంరక్షణలో ఎన్ని ఉన్నాయన్న అంశాలను తేల్చటానికి సర్వే చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ప్రభుత్వ భూముల్లో 20 శాతానికి పైగా కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు జిల్లా అధికార యంత్రాంగం టాస్క్ ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

"ఏదైనా అతిగా చేస్తే అనర్థమే..! ఔను నిజమనే అంటున్నారు వైద్యులు.. ఇంతకీ ఏంటది? దేని గురించి? ఈ చర్చంతా దేనికి అనుకుంటున్నారా? అదే నండి బాబు సిక్స్ ప్యాక్ గురించి.. సిక్స్ ప్యాక్ అనగానే.. ప్రస్తుత తరానికి ఎంతో క్రేజ్. ఆ పేరు చెప్పగానే శరీరంలోని నరాలన్నీ జివ్వుమన్నట్లు అవుతుంది.. కానీ అతిగా చేస్తే ఆరోగ్యానికి అనర్థమే అంటున్నారు వైద్యులు.. ఇటీవల పలువురు హీరోలు అతిగా వ్యాయామం చేసి అనారోగ్యం పాలవ్వడమే దీనికి చక్కటి ఉదాహరణ. అసలు సిక్స్ ప్యాక్ కథేంటి? వైద్యులు ఏమంటున్నారు? తెలుసుకుందాం.. - సిటీబ్యూరో"



వారిరువురూ అన్నదమ్ములు.. ఒకరు చదువు కోసం ..మరొకరు ఉపాధి కోసం నగరానికి వచ్చారు.. అందరిలా కాకుండా తమ కాళ్లపై తాము నిలబడాలనుకున్నారు.. అనుకున్నదే తడవుగా తమ వద్ద ఉన్న కొద్ది మొత్తంతో ఓ టీ దుకాణాన్ని పెట్టారు.. అదే చాయ్ జీపీటీ..

అంతటితో ఆగకుండా.. తమ స్టాల్‌లో లభ్యమయ్యే ఫ్లేవర్‌తో టీ పొడర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయాలనుకుంటున్నారు.. అసలీ ఆలోచన ఎలా వచ్చింది? దీని వెనుక కథేంటి? తులుసుకుందాం..!

వెరైటీ'టీ'..

చాయ్ జీపీ'టీ'..



మరింత మందికి ఉపాధి..



ఉపాధిలో మనకున్న ప్రతిభతో అక్కడ రాణిస్తాం. కానీ వ్యాపారంలో మన ఆలోచనలు, సృజనాత్మకతను జోడించి మరికొంత మందికి ఉపాధిని అందిస్తాం. అందుకే ఉద్యోగం కన్నా వ్యాపారమే చేయాలన్న ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. మా దగ్గర ఉన్న పెట్టుబడితో టీ స్టోర్‌ని ఏర్పాటుచేశాం. కానీ మా లక్ష్యం మన తెలుగుదనం ఉట్టిపడేలా చాయ్ జీపీటీ టీ పొడర్ బ్రాండ్‌ని మార్కెట్‌లోకి తీసుకొచ్చి మన సత్తాచాటడమే. దానికి అనుగుణంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.
- రోహిత్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. చాయ్ జీపీటీ నిర్వాహకుడు

శ్రీనగర్‌కాలనీ: సరికొత్త ఆలోచనతో ఓ ఇద్దరు అన్నదమ్ములు నగరంలోని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. జిహ్వకో రుచి.. పుర్రెకో ఆలోచన అన్నట్లు.. వెరైటీగా ఆలోచించారు. అందరిలా ఉద్యోగాలు కాకుండా.. వ్యాపారంలో రాణించాలని భావించారు.. తమ వ్యాపారాన్ని విస్తరించడానికి మార్కెట్‌లో ఓ కొత్త టీ ప్రాడక్ట్‌ను లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే తెలుగు టీ రుచులను వినియోగదారులకు పరిచయం చేస్తామని ధీమాగా చెబుతున్నారు.

❖ టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న చాట్ జీపీటీ నేడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం జనాల బుర్రల్లో తిరుగుతున్న పేరునే తమ కంపెనీ పేరుగా మలుచుకున్నారు.. ఓ టెక్నాలజీ పేరైన చాట్ జీపీటీని తలపిస్తూ చాయ్ జీపీటీతో ఓ చాయ్ దుకాణాన్ని నగరంలోని మధురానగర్‌లో గత సంవత్సరం ప్రారంభించారు ఈ ఇద్దరు అన్నదమ్ములు రోహిత్, కిరణ్ దుమ్ము. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈ ఇద్దరూ చదువు నిమిత్తం నగరానికి వచ్చారు. రోహిత్ విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కిరణ్ డిగ్రీ చదువుతున్నాడు. ఉద్యోగాలు కాకుండా తమ సొంత కాళ్ళపై నిలబడాలన్న తపనలో చాయ్ జీపీటీ పేరిట చాయ్ స్టోర్‌ని ప్రారంభించారు. చాయ్‌లో ఏఐని తీసుకొని ఏఐ(అద్రక్-ఇలాచి), జీపీటీని(జెన్యూన్లీ ప్యూర్ టీ)గా మలిచారీ అన్నదమ్ములు.

ఆయుర్వేద మూలికలతో..

తెలుగు టీలలో ఎక్కువగా ఇలాచి, అద్రక్‌లను ఆయుర్వేద మూలికగా ఆరోగ్యానికి ఉపయోగిస్తారు. మనం రోజువారీ విధానంతో పాటు చలి కాలంలో ఎక్కువగా అల్లం, యాలుకల టీని తీసుకుంటాం. నిజానికి వీటిలో చాలా ఔషధగుణాలున్నాయి. వీటిని టీలో తీసుకుంటే ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా అనిపిస్తుంది. అందుకే టీలలో వీటికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ మన తెలుగుదనాన్ని ఉట్టిపడేలా టీని తయారుచేస్తున్నాం. మార్కెట్‌లో ఉండే వాటికంటే భిన్నంగా మా టీ ఉత్పత్తి ఉండేలా సన్నాహాలు చేస్తున్నాం. మన రుచిని మిస్ అవ్వకుండా టీ పొడర్‌లో కలపి చాయ్ జీపీటీ ప్రాడెక్ట్ చిన్న ప్యాకెట్లతో పాటు పెద్ద ప్యాకెట్లలో మార్కెట్‌లోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో అన్ని పర్మిషన్స్ తీసుకొని వినియోగదారుల ముందుకొస్తామని, అయితే తమకు ఇన్వెస్టర్స్ తోడైతే మరింత తోడ్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చదువు, ఉద్యోగం కోసం ఓ మారుమూల ప్రాంతం నుంచి నగరానికి వచ్చి.. సరికొత్త ఆలోచనతో చాయ్ జీపీటీ ప్రాడక్ట్‌ను మార్కెట్‌లో తీసుకురావాలన్న ఆలోచన చేసిన ఈ ఇద్దరి అన్నదమ్ముల కృషి యువతకు ఆదర్శనంగా నిలుస్తుంది.



తెలుగురుచికి తగ్గట్టుగా..

నేను డిగ్రీ చదువుతున్నాను. అన్నయ్య రోహిత్ బాటలో నడవాలన్నది నా ఆకాంక్ష. ఇప్పుడిప్పుడే స్టోర్ బాగా నడుస్తోంది. అల్లం, యాలుకలు మన ఆయుర్వేద ఔషధ మూలికలకు మన దైనందిన జీవితంలో ప్రత్యేకస్థానం ఉంది. వీటిని చాయ్ జీపీటీలో కలిపి మన తెలుగురుచికి తగ్గట్టుగా అసలు సిసలైన టీని అందించాలన్నది మా లక్ష్యం. అన్నయ్యతో కలిసి సాధిస్తాం.
- కిరణ్, డిగ్రీ విద్యార్థి, చాయ్ జీపీటీ నిర్వాహకుడు

బాహుబలి బఫెట్



భారతదేశంలోనే అతిపెద్ద ఫ్యామిలీ 'బఫెట్' రెస్టారెంట్ గచ్చిబౌలిలో అందుబాటులోకి వచ్చింది. మాస్టర్ షెఫ్ ఇండియా ఆధ్వర్యంలో దీన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే...300 రకాల విభిన్న వంటకాలు అందుబాటులో ఉండడం. 500 మంది కూర్చునే సామర్థ్యంతో సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ రెస్టారెంట్‌లో భారతీయ వంటకాలతోపాటు పాశ్చాత్య దేశాల రుచులను భోజన ప్రియులకు అందుబాటులో ఉంచారు. హైదరాబాద్ దమ్ బిర్యానీతోపాటు కరేబియన్ పుడ్డింగ్, రాజస్థానీ కోఫ్తా కర్రీ, థాయ్ రెడ్‌కర్రీ, జపనీస్ నకానా కుట్సు, డచ్ చికెన్‌తో పాటు అనేక రకాల వెజ్, నాన్‌వెజ్ వంటకాలు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వెరైటీ స్టార్టర్స్, డెజర్ట్స్, ఇతర అన్ని రుచులు కలిపి 300 రకాల వంటకాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. టేస్ట్‌కు టేస్ట్.. ఎన్నో వెరైటీలు అందుబాటులోకి రావడంతో ఫుడ్‌లవర్స్ ఖుషీ అవుతున్నారు. మరెందుకు ఆలస్యం.. మాస్టర్ షెఫ్ వైపు ఓ లుక్కేయండి మరి.
- గచ్చిబౌలి



సిక్‌ప్యాక్!

లుక్ కోసమైతే ఫసక్కే

అనారోగ్యంపాలవుతున్న బాడీ బిల్డర్స్

సిక్స్ ప్యాక్ శరీరానికి మంచిది కాదు..

ఆరోగ్యకరమైన కొవ్వులూ అవసరమే : వైద్యులు

బాలీవుడ్ టు టాలీవుడ్..

సిక్స్ ప్యాక్ సినిమా స్క్రీన్‌కు పరిచయమై రెండు దశాబ్దాలు పైమాటే. అయినా అంతకంతకూ తన క్రేజ్‌ను పెంచుకుంటోంది. దాదాపు బాలీవుడ్, టాలీవుడ్ అగ్రహీరోల్లో యుక్తవయసులో ఉన్న హీరోలందరూ ఆరున్నొక్కరాగం ఆలపిస్తున్నవారే. తెలుగులో 'దేశ ముదురు'తో అల్లు అర్జున్ నుంచి మొదలై సునీల్, ప్రభాస్, నితిన్, జూనియర్ ఎన్టీయార్, రామ్‌చరణ్, సుధీర్‌బాబు, విజయ్ దేవరకొండ...తాజాగా అఖిల్..ఇలా అనేకమంది ఆరు-ఎనిమిది పలకల దేహాలతో తెరపై గ్రీక్ లుక్‌లో తళుక్కుమంటున్నారు.

అదే అసలు కారణమా?

ఆ మధ్య టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ఉన్న నటుడు రానా దగ్గుబాటి ఆరోగ్యం విషయంలో రకరకాల వార్తలు గుప్పుమన్నాయి. బాహుబలి అనంతరమే ఆయన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాడని, సిక్స్ ఫిజిక్ కోసం ఆశ్రయించిన పలు మార్గాలే దీనికి కారణమని పలు వార్తలు వెలుగు చూశాయి. అలాగే ఇటీవల కొన్ని రోజుల క్రితం టాలీవుడ్ యువ నటుడు నాగశౌర్య ఆకస్మిక అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సినిమా షూటింగ్‌లో పాల్గొన్న ఆయన ఆకస్మికంగా సొమ్మసిల్లిపడిపోగా ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం కోలుకున్నారు. ఆసుపత్రిలో చేరే సమయంలో డీ హైడ్రేషన్, హై ఫీవర్‌తో బాధపడుతున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఇక కన్నడ సూపర్ స్టార్ పునీత్‌రాజ్ జిమ్ చేస్తూ స్ట్రోక్ వచ్చి మరణించిన విషయమూ తెలిసిందే...

అనుకరణ మరింత ప్రమాదమట..

సిక్స్‌ప్యాక్ కొనసాగింపు కోసం నాగశౌర్య నెలల తరబడి తీవ్ర కసరత్తులు చేశారని, అదే విధంగా కఠినమైన డైట్ ను పాటించారని సమాచారం. ఎప్పుడూ హుషారుగా ఆరోగ్యంగా కనిపించే శౌర్యకు ఆకస్మికంగా స్పృహ కోల్పోయే పరిస్థితి రావడానికి సిక్స్ ప్యాక్ క్రేజ్ కారణమై ఉండవచ్చని పలువురి వాదన.. అయితే వైద్యులు మాత్రం ఆ విషయాన్ని ధృవీకరించలేదు. ఈ నేపథ్యంలో హీరోల్ని చూసి మక్కీకి మక్కీ అనుసరించే లక్షలాది మంది యువ అభిమానులు జాగ్రత్త పడాల్సి ఉందని, అన్ని రకాల వసతులూ, శిక్షకులూ ఉన్న స్టార్లకే అలా అయితే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరుపలకల దేహాన్ని పొందాలని కోరుకునేవారు చాలా మంది ఉండొచ్చు.. అయితే దానిని సాధించడం చాలా కష్టం. అంతేకాదు సాధించినా కూడా ఆ సిక్స్‌ప్యాక్‌ని కొనసాగించడం మరింత కష్టం. ఈ విషయం చాలా మందికి తెలీదు సిక్స్-ప్యాక్ మ్యానియాలో పడి గుడ్డిగా అనుసరించే ముందు, ఆకస్మిక, కఠినమైన డైట్ వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాల గురించి యువత తెలుసుకోవాలని వైద్యులు, ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు.

వైద్యులు ఏం చెబుతున్నారు..

❖ సిక్స్ ప్యాక్ కొనసాగింపు శరీరానికి ఆరోగ్యకరమైనది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

❖ అసహజమైన శరీరపు అతి తక్కువ కొవ్వు శాతం ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కొన్ని నెలల పాటు సిక్స్ ప్యాక్ మెయింటెయిన్ చేయడం అంటే శరీరపు కొవ్వు శాతం ఉండాల్సిన కనీస స్థాయి కన్నా పురుషులలో అయితే 12% మహిళల్లో అయితే 18% తక్కువవుతుందని వైద్యులు చెబుతున్నారు.

❖ కొవ్వు ఇలా పరిమితికి మించి తగ్గడం అనేది అంతర్గత అవయవాల లైనింగ్‌ను ప్రభావితం చేస్తుంది.

❖ తమకు వచ్చిన సిక్స్ ప్యాక్ చూపులకు బిగుతుగా కనిపించేలా చేయడానికి కొందరు ఆహారంలో ఉప్పును పూర్తిగా వదులుకుంటారు ఇది మరింత ప్రమాదకరం. ఆహారం నుంచి ఉప్పు తొలగించడం ఆరోగ్యంపై ప్రతికూల ఫలితాలను కలిగిస్తుంది.

❖ అదే విధంగా కొన్ని సందర్భాల్లో తాగే నీటికి కూడా ప్రమాదకర పరిమితి పాటించాల్సి ఉంటుంది. ఇది తీవ్రమైన డీ హైడ్రేషన్‌కు గురిచేసే అవకాశం ఉంది.

❖ అలాగే సిక్స్-ప్యాక్ సాధించిన తర్వాత కూడా దాన్ని నిలబెట్టుకోవడం కోసం నిరంతరం పరిగెత్తడం, అవి కనపడని రోజున తీవ్ర ఒత్తిడికి గురికావడం జరుగవచ్చని, అది మానసిక సమస్యలకు దోహదం చేస్తుందని సైక్రియాట్రిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు.

❖ బాడీ బిల్డింగ్ పోటీలకు హాజరయ్యేవారు లేదా పూర్తిగా వైద్యుల, న్యూట్రిషనిస్ట్‌ల పర్యవేక్షణలో గడిపేవారు, ఒత్తిడితో కూడిన వృత్తి వ్యాపకాలు నిర్వహించని వారు తప్ప సిక్స్ ప్యాక్ గురించి ఎక్కువ శ్రమించడం ప్రమాదకరం అంటున్నారు.

❖ ఇక ఫాస్ట్‌గా సిక్స్ ప్యాక్ దక్కించుకోవడం కోసం స్టెరాయిడ్స్ వంటివి అతిగా తీసుకుంటున్నారు కొందరు. ఇది కూడా శరీరంలోని హార్మోన్ల పనితీరును దెబ్బతీస్తుందని, ఫలితంగా ఆరోగ్యపరమైన ఇబ్బందులు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు.



జాగ్రత్తలు పాటించాలి...

అబ్బాయిలు మాత్రమే కాదు అమ్మాయిలు సైతం సిక్స్ ప్యాక్ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. శారీరకంగా అమ్మాయిలకు, అబ్బాయిలతో పోలిస్తే చాలా పరిమితులు ఉంటాయనే విషయం గుర్తుంచుకోవాలి. మగవాళ్లకన్నా ఆరోగ్య సమస్యలు ఎక్కువ. ఫిట్‌నెస్ రంగాన్ని ప్రొఫెషన్‌గా తీసుకున్నా, బాడీ బిల్డింగ్ రంగంలో రాణించాలనుకున్నా.. ఓకే గానీ... సరదాకో, గుర్తింపు కోసమో సిక్స్‌ప్యాక్ చేయాలనుకోవడం ఏ మాత్రం సరికాదు.
-కిరణ్ డెంబ్లా, డి.జె, ఫిట్‌నెస్ శిక్షకురాలు




ఏడాది పాటు శ్రమించా..

కఠినమైన వర్కవుట్స్‌తో పాటు డైట్ కూడా ఫాలో అయ్యా. షూటింగ్ ఉన్నప్పుడు వర్కవుట్ చేయడంతో పాటు నీళ్లు కూడా తీసుకోలేదు. ఇలాంటి సందర్భంలో సైకలాజికల్ ప్రెషర్‌ను ఎదుర్కోవడం అంత సులభం కాదు. సిక్స్ ప్యాక్ అనేది చాలా కష్టమైన ప్రక్రియ.
-ఆనంద్ దేవర్‌కొండ, సినీ హీరో



రాంగ్ రూట్‌లో అనర్థాలే..

చాలా మంది యువత ఎఫర్ట్ పెట్టి సిక్స్‌ప్యాక్ సాధిస్తున్నారు. అయితే కొందరు మాత్రం త్వరగా షేప్ వచ్చేయాలని రాంగ్ రూట్‌లో ప్రయత్నాలు చేయడం, మజిల్స్‌ను పరిమితికి మించి శ్రమకు గురిచేయడం వల్ల ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు.
-ఎం.వెంకట్, ట్రైనర్, సిక్స్ ప్యాక్ స్పెషలిస్ట్



ఈ ట్విన్నర్స్..

ఆటల్లో విన్నర్స్..

ట్విన్స్.. అనగానే నైంటీస్ వారికి టక్కున హలో బ్రదర్ సినిమా కళ్లముందు కదులుతుంది.. మనలో చాలా మంది స్కూల్స్, కాలేజ్ ప్రయాణంలో అనేక మంది కవలలను కలిసే ఉంటారు.. వీరిలో ఎక్కువ మంది ఇద్దరు ఆడవారు.. ఇద్దరు మగవారిని చూసుంటాం.. కొందరు ఇద్దరినీ కలిసి ట్విన్స్‌గా చూసుంటాం.. మనం ఇప్పుడు తెలుసుకునే ట్విన్స్ కూడా అలాంటివారే.. అయితే అలాంటి ఇలాంటి ట్విన్స్ కాదండోయ్.. ఈ ట్విన్నర్స్.. ఆటల్లో విన్నర్స్..వీరే నగరానికి చెందిన అయమ అగర్వాల్, అనయ్ అగర్వాల్.. వీరు చెస్‌లోనూ, ఇతర ఆటల్లోనూ చిరుతల్లా పావులు కదుపుతూ.. పథకాలు గెలుస్తూ.. వరల్డ్ ఛాంపియన్స్‌గా నిలుస్తున్నారు..వారి గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం..

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వరుణ్ అగర్వాల్, పనాషా అగర్వాల్ సంతానమే అయమ, అనయ్ అగర్వాల్ అనే కవలలు..వీరికి ప్రస్తుతం తొమ్మిదేళ్లు...నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో మూడో తరగతి చదువుతున్నారు. చిన్నతనం నుండే అల్లరి ఎక్కువ... ఎక్కువగా గొడవపడుతూ బాగా అల్లరి చేసేవారు. ఆ అల్లరిని కట్టడి చేయాలనే ఉద్దేశంతో వీరిని ఆటల వైపు మళ్లించాలని తల్లిదండ్రులు భావించారు. చెస్ వల్ల క్రమశిక్షణతో పాటు మేధస్సు, మైండ్ రిలాక్స్ అవుతుందని తల్లి పనాషా ఇండియన్ చెస్‌మాస్టర్స్ స్కూల్లో చేర్పించారు. చేరిన కొద్దిరోజుల్లోనే నగరంలోని జూనియర్ టోర్నమెంట్స్‌లో మెడల్స్ సాధించి ప్రతిభను చాటారు. పాల్గొన్న ప్రతిటోర్నమెంట్‌లోనూ విన్నర్స్‌గా, రన్నర్స్‌గా నిలుస్తూ వచ్చారు. వీరి ప్రతిభకు ముగ్ధులైన కోచ్ చైతన్య సురేష్ వీరికి మెరుగైన శిక్షణ ఇచ్చి ఇంటర్నేషనల్ టోర్నమెంట్స్‌కి పోటీ పడేలా తీర్చిదిద్దారు.



వరల్డ్ ఛాంపియన్స్‌గా..



కోచ్‌ల సహాయంతోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేషనల్, ఇంటర్నేషనల్ టోర్నమెంట్స్‌లో పాల్గొన్నారు. గతేడాది ఈజిప్ట్, సెర్బియాలోని బిల్‌గ్రేడ్‌లో జరిగిన చెస్‌టోర్నీలో పాల్గొని ఛాంపియన్స్‌గా నిలిచారు. అమయ ప్రపంచవ్యాప్తం గా 60 మంది క్రీడాకారులతో పోటీ పడి అండర్-8 విభాగంలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. చైనా, కెనెడా, మలేషియా, మంగోలియా, శ్రీలంక లాంటి ఆటగాళ్లను ఎత్తుకు పైఎత్తులతో చిత్తు చేసింది. ఫిబ్రవరిలో అనయ్ అండర్-8లో 90 మందితో పోటీపడి మెక్సికో, ఉజ్బెకిస్తాన్, కిర్గిస్తాన్, మంగోలియాపై విజయాన్ని, రష్యా, శ్రీలంక, ఆస్ట్రేలియా, స్లొవేకియాతో డ్రా చేసుకొని ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సంవత్సరం చెక్‌రిపబ్లిక్ పరాగ్వేలో జరిగిన చెస్‌టోర్నమెంట్‌లో ఫిడే రేటింగ్‌లో టాప్‌లో ఉన్న వారిలో అనయ్ విన్నర్‌గా, అయమ రన్నర్‌గా నిలిచి ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథ్ ఆనంద్ ప్రశంసలు పొందారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్స్‌లో అమయ 1728, అనయ్ 1773 రేటింగ్స్‌లో కొనసాగుతున్నారు. ఈ కవల చిచ్చరపిడుగులు రెండు సంవత్సరాలుగా శిక్షణ తీసుకుంటూ దేశ, విదేశాల్లోని చెస్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొని మెడల్స్‌ను సాధిస్తున్నారు.



చదువుల్లోనూ చురుకే...

అమయ, అనయ్ చెస్‌లోనే కాకుండా చదువుల్లోనూ చురుగ్గా రాణిస్తూ, క్లాస్ టాపర్స్‌గా నిలుస్తున్నారు. చెస్‌తో పాటు పియానో, అథ్లెటిక్స్‌లోనూ తమ ప్రతిభను కనబరుస్తున్నారు. తల్లిదండ్రులు, కోచ్‌లు, స్కూల్ మేనేజ్‌మెంట్‌ల సహకారంతో ఆల్‌రౌండర్స్‌గా నిలుస్తూ ప్రపంచ ఛాంపియన్స్‌గా నిలుస్తున్న ఈ సూపర్ ట్విన్స్ మరిన్ని విజయాలు సాధించాలని మన సారా కోరుకుందామా మరి..

ఎంగేజ్ విత్ సిటీ...

పవర్ ఆఫ్ మెంటల్ హెల్త్

ఒత్తిడితో కూడిన జీవనశైలిని ఎదుర్కొంటున్న నగరవాసుల కోసం మానసిక ఆరోగ్య ప్రాధాన్యత, మానసిక సామర్థ్యాలను మెరగుపరచుకోవడంపై సంబంధిత అంశంపై నిపుణులు మున్నావర్ సుల్తానా ప్రత్యేక కార్యక్రమం
తేదీ: జూన్ 17, స్థలం లామకాన్, బంజారాహిల్స్, సమయం రాత్రి 6గంటలు..

వయోలెన్స్ ప్రివ్యూ షో...



యాక్షన్ డ్రామా ప్రధానంగా రూపొందిన వయోలెన్స్ తెలుగు చిత్రం ప్రివ్యూ.. తెలుగు చిత్రాభిమానుల కోసం ప్రదర్శిస్తున్నారు
తేదీ: జూన్ 20, స్థలం లామకాన్, బంజారాహిల్స్, సమయం రాత్రి 6.30 గంటలు

లైఫ్ వితవుట్ డిసీజ్

రోగాలు లేకుండా జీవితం అనే అంశంపై నిపుణుల ఆధ్వర్యంలో అవగాహనా శిబిరాలు నిర్వహిస్తున్నారు. కేరళకు చెందిన నేచర్ లైఫ్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు డా.జాకోబ్ వడకంచేరి పాల్గొంటున్నారు.
తేదీ: జూన్ 21 నుంచి 23 వరకూ స్థలం అవర్ సేక్రెడ్ స్పేస్, సికింద్రాబాద్

బ్రంచ్ విత్ డాడ్...

బ్రేక్‌ఫాస్ట్‌కు లంచ్‌కు, మధ్య చేసే బ్రంచ్‌ను తండ్రితో కలిసి ఎంజాయ్ చేయమంటోంది నగరంలోని షెరటాన్ హోటల్. బ్రంచ్ విత్ డాడ్ అంటూ స్పెషల్ మెనూను అందిస్తోంది.
తేదీ: జూన్ 18, సమయం మధ్యాహ్నం 12.30 నుంచి 3గంటల తర్వాత...
స్థలం: షెరటాన్ హోటల్, గచ్చిబౌలి

ఈవీఎంల గుట్టు విప్పేదెవరు?

ఒక్కొక్కటిగా ఈవీఎం అక్రమాలు వెలుగులోకి.. ముంబైలో గెలిచిన శివసేన(షిండే) అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్‌పై దర్యాప్తు

- ఈవీఎంల హ్యాకింగ్ సాధ్యమే.. ఏఐతో హ్యాక్ చేయవచ్చు
- వాటిని రద్దు చేయాలంటూ టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ డిమాండ్
- ఎన్ని ఆరోపణలొస్తున్నా నోరు విప్పని సీఈసీ.. కూటమి నేతలు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎంలు) పనితీరుపై ముసురుకుంటున్న అనుమానాలతో ప్రస్తుతం దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమేమీ కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం సాయంతో వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చని టెక్ దిగ్గజం, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈవీఎంలను మనుషులు కూడా హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉందని, అసలు వీటిని రద్దు చేయాలని చాట్ జీపీటీ నిపుణుడైన ఆయన గట్టిగా డిమాండ్ చేయడం గమనార్హం. మరోవైపు ముంబైలో గెలుపొందిన శివసేన (షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ బంధువు ఒకరు మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేసి ఆపరేట్ చేసినట్లు వెలుగులోకి రావడం ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం ఈవీఎంల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పారదర్శకత లేకుంటే భవిష్యత్తు లేదని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓటింగ్ సరళిపై ఇప్పటికే పలువురు

నిపుణులు, పరిశీలకులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా తమ ఓట్లన్నీ ఏమయ్యాయంటూ గ్రామాలకు గ్రామాలే నిలదీస్తుండటం గమనార్హం. గెలుపొందిన అభ్యర్థులు సైతం ఊహించని స్థాయిలో మెజారిటీలు రావటంపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఈవీఎంల పనితీరుపై సర్వత్రా సందేహాలు తలెత్తుతున్నా... తాము వేసిన ఓట్లు ఏమయ్యాయని ఓటర్లు ప్రశ్నిస్తున్నా.. 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయని యావత్ దేశం నిలదీస్తున్నా... ఇవిగో ఈవీఎం మోసాలంటూ ఆధారాలు చూపిస్తున్నా... కేంద్ర ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. 'తాంబూలాలు ఇచ్చేశాం... ఇక తన్నుకు చావండి' అనే రీతిలో ఎన్నికల ప్రక్రియ ముగిశాక తమకు సంబంధం లేదనే రీతిలో బాధ్యతల నుంచి ఈసీ పలాయనం చిత్తగించడం ఈ సందేహాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించిన అనంతరం అందులో లొసుగులు గుర్తించడంతో వాటిని నిషేధించిన దేశాల సంఖ్య పెరుగుతోంది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఇప్పటికీ బ్యాలెట్ పేపర్ విధానాన్నే అనుసరిస్తున్న నేపథ్యంలో మన దేశంలో ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణ సరికాదని సాధారణ ఓటర్లతోపాటు నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా పరీక్షిస్తే కానీ ఈ రహస్యం వీడదని టెక్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

చిప్‌లోనే చిదంబర రహస్యం..!

ఈవీఎంలలో ఉపయోగిస్తున్న చిప్‌లపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిజ్ఞానంపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సూటిగా సమాధానం చెప్పకపోవడం సందేహాలకు బలం చేకూరుస్తోంది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని పలువురు సవాళ్లు విసురుతున్నా ఈసీ ఏమాత్రం పట్టించుకోవట్లేదు. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈసీ చేసిన ప్రకటన మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈవీఎంలలో బ్లూటూత్ టెక్నాలజీ లాంటిది ఉండదు కాబట్టి హ్యాక్ చేయడం సాధ్యం కాదని ఈసీ ఇటీవల వరకు వాదిస్తూ వచ్చింది. అయితే ఈవీఎంలలో ప్రోగ్రామబుల్ చిప్‌లు ఉపయోగిస్తున్నామని, ఫ్లాష్ మెమరీ వాడకం కూడా ఉంటుందని ఈసీ ఇటీవల తొలిసారిగా అంగీకరించింది. ప్రోగ్రామబుల్ చిప్‌లు, ఫ్లాష్ మెమరీని హ్యాక్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. మరి ఈవీఎంలు భద్రమేనా? అంటే ఈసీ సూటిగా సమాధానం చెప్పడం లేదు.

ఈవీఎంలు బ్లాక్ బాక్స్‌లు: ట్విట్టర్‌లో రాహుల్‌గాంధీ

ఈవీఎంలు బ్లాక్ బాక్సులు లాంటివి. వాటిని పరిశీలించేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వరు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం తీవ్ర ఆందోళనకరం.

నిషేధిస్తూ విధాన నిర్ణయాలు

ప్రపంచంలో మెజార్టీ దేశాలు ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణకు వ్యతిరేకంగా విధాన నిర్ణయం తీసుకున్నాయి. భారత్‌తోపాటు బ్రెజిల్, వెనిజులా తదితర దేశాల్లో మాత్రమే ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అత్యధిక దేశాల్లో ఈవీఎంలను పూర్తిగా నిషేధించగా మరికొన్ని దేశాల్లో ఇతర పద్ధతులను జోడించి ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

దేశం	నిషేధానికి కారణం
ఫిన్లాండ్	అవిశ్వాసం
ఫ్రాన్స్	భద్రతపై ఆందోళన
జర్మనీ	భద్రతపై ఆందోళన
నెదర్లాండ్స్	భద్రతపై ఆందోళన
ఐర్లాండ్	భద్రతపై ఆందోళన
జపాన్	ఆర్థిక, లాజిస్టికల్ భారం
కజకిస్తాన్	అవిశ్వాసం
నేపాల్	ఆర్థిక, లాజిస్టికల్ భారం
నార్వే	భద్రతపై ఆందోళన
పరాగ్వే	అవిశ్వాసం

భద్రతా సందేహాస్పదమే

ఈవీఎంల భద్రత, నిర్వహణపైనా నీలి నీడలు అలుముకుంటున్నాయి. నిపుణులు వ్యక్తం చేస్తున్న సందేహాలకు ఈసీ సూటిగా సమాధానాలు చెప్పడం లేదు. ఈవీఎంల నిర్వహణ విషయంలో ఎన్నో భద్రత లోపాలు, ఇతర లొసుగులు ఉన్నట్లు ఇప్పటికే చాలా సందర్భాల్లో రుజువైంది. 2017 డిసెంబరు నాటికే ఈవీఎంల చోరీ, ధ్వంసం ఉదంతాలు దాదాపు 70 వరకూ చోటు చేసుకున్నట్లు 'ద వైర్' ప్రచురించిన కథనం స్పష్టం చేసింది. ఉత్తరాఖండ్‌కు చెందిన మాజీ మంత్రి సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈసీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈవీఎంలను తయారు చేసే ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రకటన ప్రకారం.. ఈసీఐ కోరిన దాని కంటే 1,97,368 ఈవీఎంలు, 3,55,747 కంట్రోల్ యూనిట్లు ఎక్కువగా తయారయ్యాయి. 2024 ఎన్నికల సందర్భంగా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఈవీఎంలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద లభించాయి. ఇక చోరీకి గురైన ఈవీఎంలపై ఈసీ స్పందన విడ్డూరంగా ఉంది. ప్రతి ఈవీఎంకు ప్రత్యేకమైన ఐడీ ఉంటుందని, యంత్రం చోరీకి గురైనా, కనిపించకుండా పోయినా ఆ ఐడీని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. తద్వారా ఆ ఈవీఎంలలో నమోదైన ఓట్లు పోలైన ఓట్లలో కలవకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిపింది. మరి చోరీకి గురైన యంత్రాల్లో పరికరాలను మార్చినా, ఓటింగ్ నమోదు చేసేందుకు వాడిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఇతర ఈవీఎంలతో కలిపేస్తే ఏమవుతుంది? అనే ప్రశ్నలకు ఈసీ మౌనం దాల్చడం గమనార్హం. ఈవీఎంలను భద్రపరుస్తున్న ప్రదేశాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయా? సీసీ కెమెరాలు ఉంటే వాటి ఫుటేజీని అందరికీ ఎందుకు అందుబాటులోకి ఉంచడం లేదు? అందులో ఇబ్బంది ఏమిటి? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఓట్ల లెక్కింపు వరకు స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంల భద్రత వ్యవస్థ ఎంతవరకు పటిష్టం? అనే సందేహాలున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌ల సీసీ కెమెరాల ఫుటేజీలను అన్ని పార్టీలకూ అందుబాటులో ఉంచితే పారదర్శకంగా ఉంటుంది. ఈ డిమాండ్‌పై ఈసీ కనీసం స్పందించలేదు. ఒకవైపు ఈవీఎంలను హ్యాక్ చేయడం సాధ్యమేనని నిపుణులు బల్లగుద్ది చెబుతుండగా సందేహాలను నివృత్తి చేయాల్సిన ఈసీ దాగుడుమూతలు ఆడటం అనుమానాలను బలపరుస్తోంది.



ఈవీఎంలను నిషేధించాలి: ప్యూర్టోరికోలో ఎన్నికల అక్రమాలపై ఎక్స్‌లో ఎలాన్ మస్క్

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలను నిషేధించాలి. ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ సరికాదు. వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చు. ఈ భూమ్మీద హ్యాక్ చేయలేనిది ఏదీ లేదు.

మొబైల్‌తో ఈవీఎం హ్యాకింగ్

ఈవీఎంలు ఎంత లోపభూయిష్టమో... వాటిని ఎంత సులువుగా హ్యాక్ చేయవచ్చో బహిర్గతమైంది. ముంబై నుంచి వెలువడే ప్రముఖ దినపత్రిక 'మిడ్ డే' కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని వాయువ్య ముంబై నియోజకవర్గం నుంచి ఎంపీగా కేవలం 48 ఓట్లతో విజయం సాధించిన శివసేన (ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ సమీప బంధువు మంగేశ్ పండిల్కర్ తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 4న ముంబైలోని నెస్కో సెంటర్‌లో నిర్వహించారు. ఎంపీ బంధువు మంగేశ్ పండిల్కర్ ఈ సందర్భంగా తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓటీపీ జనరేట్ చేయడం ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేయడం గమనార్హం. మొదట్లో శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) అభ్యర్థి అమోల్ సంజన కీర్తికర్ కంటే వెనుకబడిన రవీంద్ర వైకర్ అనూహ్యంగా కేవలం 48 ఓట్లతో విజయం సాధించడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకువెళ్లడం, అదే ఫోన్ ద్వారా శివసేన (ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి పలువురితో మంతనాలు జరపడంపై ముంబై పోలీసులు ఈ నెల 14న కేసు నమోదు చేసి నిందితులకు నోటీసులు జారీ చేశారు. మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. అయితే మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేశారన్న మిడ్ డే పత్రిక కథనాన్ని ఎన్నికల కమిషన్ ఖండించింది.

20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి?

దేశంలో ఏకంగా 20 లక్షల ఈవీఎంలు కనిపించకపోడం మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం 60 లక్షల ఈవీఎంలను దిగుమతి చేసుకోగా వాటిలో 40 లక్షల ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియకు కేటాయించినట్లు ఈసీ వెల్లడించింది. మరి మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడున్నాయనే ప్రశ్నకు ఇటు ఈసీగానీ అటు కేంద్ర ప్రభుత్వంగానీ జవాబు చెప్పడం లేదు. ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయో చెప్పాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గట్టిగా డిమాండ్ చేశారు. దేశంలో ఎంపిక చేసిన రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో గుట్టు చప్పుడు కాకుండా ఈవీఎంలను మార్చి అక్రమాలకు పాల్పడినట్లు కమ్యూనిస్టు పార్టీలు ఆరోపిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా విభ్రాంతి వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ, బిజూ జనతాదళ్ పార్టీలు తమకు అత్యంత బలమైన స్థానాల్లో కూడా ఓడిపోవడం విస్మయపరుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీకి ఏమాత్రం బలం లేని నియోజకవర్గాల్లో సైతం ఆ పార్టీల అభ్యర్థులకు అనూహ్య మెజార్టీలు వచ్చాయి. ఇక ఒడిశాలో బీజేపీ ఉనికి అంతంత మాత్రంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం గమనార్హం. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు పద్ద పాట్లన్నీ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో..

కర్ణాటకలో ఓ బీజేపీ ఎంపీ అభ్యర్థి వాహనంలో ఈవీఎంలు తరలిస్తున్న విషయం ఎన్నికల ముందే బయటపడింది. పిఠాపురం నియోజకవర్గంలో ఈవీఎంలను బస్సులో తరలించారు. ఓ ప్రైవేట్ వాహనంలో సైతం ఈవీఎంలు తరలించినట్లు బయటపడ్డా ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా పలుచోట్ల ఇదే రీతిలో ఈవీఎంలను ప్రైవేట్ వ్యక్తుల పర్యవేక్షణలో తరలించినట్లు తెలుస్తోంది. అవన్నీ కనిపించకుండా పోయిన 20 లక్షల ఈవీఎంలలోనివేనని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. అదృశ్యమైన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడున్నాయో వెల్లడించాలని వామపక్షాలతోపాటు ఇతర పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 40 లక్షల ఈవీఎంతోనే ఎన్నికలు నిర్వహించామని, మిగిలిన 20 లక్షల ఈవీఎంల సంగతి తమకు తెలియదంటూ ఈసీ దాటవేత వైఖరి అనుసరిస్తోంది. ఈసీ, కేంద్ర ప్రభుత్వం కుమ్మక్కై ఈ అంశాన్ని కప్పిపుచ్చేందుకు యత్నిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి?

- రేసులో బుద్ధప్రసాద్, బొలిశెట్టి
- ఈ నెల 19 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే యోచన

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీకి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి లభించిన విషయం తెలిసిందే. 21 మంది ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని జనసేన ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. దీనికి చంద్రబాబు అంగీకరించినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు మూడో వంతు పదవులు వస్తాయని పవన్‌కళ్యాణ్ చెప్పేవారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి లభించే అవకాశం ఉందని సమాచారం. ఈ పదవికి జనసేన పార్టీ నుంచి అవనిగడ్డ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బుద్ధప్రసాద్ ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి జనసేనలో చేరారు. బొలిశెట్టి తొలినుంచీ జనసేనలోనే ఉన్నారు. నిజంగా అవకాశం వస్తే వీరిద్దరిలో ఒకరు ఆ పదవిలో కూర్చోవడం ఖాయమని చెబుతున్నారు. మరోవైపు స్పీకర్ పదవికి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి పేరును పరిశీలిస్తున్నారు. ఇదిలావుండగా ఈ నెల 19వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. తొలిరోజు ప్రొటెం స్పీకర్‌తో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, రెండో రోజు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారని సమాచారం.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకరణ

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణ అధికారి (ఈవో)గా జె.శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ఎ.వి.ధర్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతరం సతీమణితో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆయనకు స్వామి విశిష్టతను తెలిపారు. దర్శనం అనంతరం ఈవోని వేద పండితులు ఆశీర్వదించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. దీనికిముందు సంప్రదాయాన్ని అనుసరించి ఈవో తొలిగా వరాహస్వామిని దర్శించుకుని క్యూ కాంప్లెక్స్ మీదుగా ఆలయంలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్‌వో నరసింహకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రథమ ధ్యేయం

హైందవుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల అని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో మంచి పరిపాలన సాగేలా చర్యలు చేపడుతామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సంతోషంగా తిరుగుప్రయాణం అవ్వాలనే ప్రయత్నం చేస్తానన్నారు. ఆగమశాస్త్రం అనుసారం శ్రీవారి కైంకర్యాలు సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. గతంలో అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపడతామన్నారు. అలాంటి చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం శ్యామలరావు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. క్యూలైన్ల వద్ద పారిశుధ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్ల వద్ద భక్తులకు అందించే తాగునీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపించాలని అధికారులకు సూచించారు.



ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న జే శ్యామలాల్‌రావు

రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలే

స్పష్టం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

సాక్షి, అమరావతి: రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది. 'ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు అవి. అవేమీ ప్రైవేటు ఆస్తులు కావు. అవి ఎవరి సొంతం కూడా కాదు. విశాఖపట్నానికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ భవనాలను నిర్మించారు. వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వం ఇష్టం. అలాంటి ప్రభుత్వ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీయించి, వాటికి వక్రీకరణలకు జోడించి బురదజల్లాలని ప్రయత్నించడం వెనుక ఉద్దేశాలేంటో ప్రజలు గమనిస్తున్నారు. 1995 నుంచి కూడా విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని చంద్రబాబు ఊదరగొడుతూనే ఉన్నారు. ఇప్పటికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. విశాఖ నగరానికి ఒక ప్రధానమంత్రి వచ్చినా, ఒక రాష్ట్రపతి వచ్చినా, ముఖ్యమంత్రి వెళ్లినా, గవర్నర్‌లాంటి వ్యక్తులు వెళ్లినా వారికి ఆతిథ్యం ఇవ్వడానికి సరైన భవనమే లేదన్న విషయాన్ని గుర్తించండి. రుషికొండ రిసార్ట్స్ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీసి, పైత్యం ప్రదర్శించడంవల్ల మీకు మానసిక తృప్తి కలుగుతుందేమోగాని, విశాఖపట్నం ప్రజలకు మేలు జరగదు' అని పేర్కొంది.

జులైలో జీశాట్–ఎన్2 ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), భారత అంతరిక్ష వాణిజ్య విభాగానికి చెందిన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ సంస్థ సహకారంతో జులై నెలాఖరులో జీశాట్–ఎన్2 (జీశాట్–20) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. సుమారు ఐదు టన్నుల బరువు (4,700 కిలోలు) కలిగిన ఈ ఉపగ్రహాన్ని స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన ప్రయోగ వేదిక నుంచి పాల్కన్ రాకెట్ ద్వారా ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. దేశంలోని మారుమూల రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాలకు బ్రాండ్‌బ్యాండ్, ఇన్–ఫ్లైట్ సేవలను అందించేందుకు ఇస్రోలోని ప్రొఫెసర్ యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈ ఉపగ్రహాన్ని తయారుచేశారు. ఈ ఉపగ్రహం భూమికి 36 కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ఉండి 15 ఏళ్లపాటు సేవలు అందించే విధంగా రూపొందించారు. ఇది పూర్తిస్థాయి కమ్యూనికేషన్ ఉపగ్రహం కావడం విశేషం. ఇప్పటివరకు పంపిన కమ్యూనికేషన్ శాటిలైట్స్ ఒక ఎత్తయితే ఈ జీశాట్–ఎన్2 ఉపగ్రహం మాత్రమే ఒక ఎత్తు అని ఇస్రో పేర్కొంది. ఇప్పటికే ఉపగ్రహాన్ని రూపొందించి క్లీన్‌రూంలో పరీక్షలు పూర్తిచేశారు. వైబ్రేషన్ పరీక్షలను కూడా విజయవంతంగా నిర్వహించారు. ఇస్రోకి ఇది వాణిజ్యపరమైన ప్రయోగం కావడం విశేషం.



జీశాట్–ఎన్2 ఉపగ్రహానికి క్లీన్‌రూంలో పరీక్షలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

బంగాళాఖాతంలో ఆవర్తనం

- రెండురోజులు విస్తారంగా వానలు
- విస్తరించనున్న రుతుపవనాలు

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవనున్నాయి. అనేకచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. సోమవారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో, మంగళవారం అల్లూరి, శ్రీసత్యసాయి, వైఎస్సార్, తిరుపతి, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలకు ఆస్కారం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఆదివారం కాకినాడలో అత్యధికంగా 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రానున్న మూడురోజుల్లో ఇవి కోస్తాంధ్రలోని మిగిలిన ప్రాంతాలతో పాటు వాయవ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

అరచేతిలో వాతావరణ సమాచారం



- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- డామిని, మేఘ్‌దూత్, రెయిన్ అలారం.. యాప్‌లతో అన్నదాతలకు ఎంతో ప్రయోజనం

రాయవరం: ఈ మధ్యకాలంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ఒకరోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరోరోజు ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. డామిని, మేఘ్‌దూత్, రెయిన్ అలారం.. యాప్‌లు ఆవిష్కరించింది. వీటిద్వారా వాతావరణ పరిస్థితులను అంచనా వేయవచ్చని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాకాలం మొదలుకానున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వివరాలు, వర్షాల రాక సమాచారాన్ని కూడా యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షించుకోవడం, వర్షం పరిస్థితులను అంచనా వేయడం సులభమవుతంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ శాఖ రూపొందించిన ఈ యాప్‌లు రైతులకు సాగులో తోడ్పడనున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా వీటిని డౌన్లోడ్ చేసుకుంటే చాలు. వాతావరణ సమాచారం మొత్తం మన అరచేతిలో ఉన్నట్టే.

వాతావరణ సమగ్ర వివరాలతో 'మేఘదూత్'

మేఘదూత్ యాప్‌లో వాతావరణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. వర్షపాతం వివరాలు, గాలిలో తేమ, గాలి వేగం, గాలి వీచే దిశ, నమోదైన ఉష్ణోగ్రతలు, రానున్న 24 గంటల్లో వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. గడిచిన వారం రోజులు, రానున్న మరో నాలుగు రోజుల వాతావరణ వివరాలు కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



వర్ష సూచనకు 'రెయిన్ అలారం'


వర్షం ఎప్పుడు పడుతుంది. గడిచిన రోజుల వర్షపాతం వివరాలు, రానున్న కాలంలో వర్ష సూచనలను రెయిన్ అలారం యాప్ తెలియజేస్తుంది. మనం నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణ, వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో తదితర వివరాలు కూడా తెలియజేస్తుంది. వాతావరణంలోని ఉష్ణోగ్రత, గాలిలోని తేమ, మేఘావృతమైన ప్రాంతాల వివరాలను తగిన డేటాతో వివరిస్తుంది.

'డామిని'లో ఉరుములు, మెరుపుల హెచ్చరిక

ఒక్కోసారి వాతావరణంలో అప్పటికప్పుడు మార్పులు సంభవించి ఉరుములు, మెరుపులు, పిడుగుపాటు సంభవించే అవకాశం ఉంటుంది. ఇలాంటి హెచ్చరికలను తెలిపేందుకు డామిని యాప్ ఉపయోగపడుతుంది. మెరుపు ఎప్పుడు వస్తుంది? మెరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. లొకేషన్ ఆధారంగా మెరుపులు వచ్చే అవకాశం ఉందో? లేదో? కూడా తెలుస్తుంది. పిడుగు పడినప్పుడు అందించాల్సిన వైద్యసహాయాన్ని తెలియజేస్తుంది. రైతులకు, రైతుకూలీలకు బయటి ప్రాంతాల్లో పనిచేసేవారికి ఈ యాప్ ఎంతో తోడ్పడుతుంది.

అమరావతికి రూ.లక్ష కోట్లు

మంత్రి నారాయణ వెల్లడి



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి అభివృద్ధి పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మూడు దశల్లో రాజధాని పనులు పూర్తి చేసేందుకు రూ.లక్ష కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు మంత్రి వెల్లడించారు. ఆదివారం ఉదయం వెలగపూడిలోని సచివాలయం రెండో బ్లాక్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణాన్ని మూడు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించామని, తొలిదశలో భాగంగా రూ.48 వేల కోట్లతో మంత్రులు, కార్యదర్శులు, అధికారులు, ఉద్యోగులకు నివాస భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామన్నారు. తొలిదశ పనులకు గతంలోనే టెండర్లు పిలిచి దాదాపు రూ.9 వేల కోట్ల చెల్లింపులు కూడా చేసినట్లు తెలిపారు. రాజధాని విషయంలో గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌నే ఇప్పుడూ అమలు చేస్తామని, అయితే అంచనా వ్యయాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించాల్సి ఉందన్నారు.




పుట్టగొడుగు @ 5 కిలోలు

కుందుర్పి: పుట్టగొడుగులు సాధారణంగా చాలా చిన్నగా ఉంటాయి. పది పుట్టగొడుగులు కలిపినా 500 గ్రాములు బరువు ఉండవు. కానీ, అనంతపురం జిల్లా కుందుర్పి మండలం జానంపల్లిలో రైతు వడ్డే హనుమంత రాయుడు వ్యవసాయ పొలంలో ఆదివారం ఐదు కిలోల బరువు ఉన్న పుట్టగొడుగు లభించింది. సహజసిద్ధంగా భూమిలో నుంచి ఈ పుట్టగొడుగు బయటకు వచ్చింది. ఇంత పెద్ద పుట్టగొడుగుని తానెప్పుడూ చూడలేదని రైతు హనుమంత రాయుడు చెప్పాడు. పరిశోధన కోసం ఆ పుట్టగొడుగును మండల వ్యవసాయాధికారి మహేష్‌కు రైతు అప్పగించాడు. దాన్ని కళ్యాణదుర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రానికి తరలించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 17-6-2024

నేడు బక్రీద్

పరిపూర్ణ ఆరాధన హజ్జ్



ఇస్లామ్ ధర్మం ఐదు మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉంది. ఇందులో ఏ ఒక్కదాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదు. మొట్టమొదటిది సృష్టికర్త ఒక్కడే అన్న విశ్వాసం. రెండవది నమాజ్, మూడవది రోజా, నాల్గవది జకాత్, ఐదవది హజ్జ్. దైవ విశ్వాస ప్రకటనకు ఇవి ఆచరణాత్మక సాక్ష్యాలు. ఒక మనిషి విశ్వాసి/ ముస్లిమ్ అనడానికి రుజువులు. అన్ని ఆరాధనలకూ 'హజ్జ్' ఆత్మ వంటిది. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించడం జరిగింది. అందుకని ఆర్థిక స్థోమత కలిగినవారు జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా కాబా సందర్శన యాత్ర చేయడం తప్పనిసరి. ఈ'హజ్' జిల్ హజ్ మాసం పదవ తేదీన అరేబియా దేశంలోని మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. అదే 'ఈదుల్ అజ్ హా'. దీన్ని బక్రీద్ పండుగ అని, ఈదె ఖుర్బాన్ అని కూడా అంటారు. 'హజ్జ్ 'ఒక విశ్వజనీన, విశ్వ వ్యాపిత ఆరాధన. ఇందులో శ్రీమంతులు, నిరుపేదలు, తెల్లవారు, నల్లవారు, అరబ్బులు, అరబ్బేతరులు అన్న భేద భావం మచ్చుకు కూడా కనిపించదు. 'మానవులంతా ఒక్కటే' అన్న విశ్వమానవతా భావంతో అందరూ ముక్తకంఠంతో అల్లాహ్‌ను కీర్తిస్తూ, ఆయన ఘనతను, ఔన్నత్యాన్ని కొనియాడుతూ భక్తిపారవశ్యంతో తాదాత్మ్యం చెందడమే హజ్ యాత్రలోని పరమార్థం.

మక్కా నగర ఆవిర్భావం

మక్కానగర ఆవిర్భావం దాదాపు ఐదువేల సంవత్సరాలకు పూర్వం జరిగింది. కొండలూ కోనల నడుమ, ఎలాంటి వనరులూ లేకుండా నిర్మానుష్యంగా పడి ఉన్న ఎడారి ప్రాంతంలో మహనీయ హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం తన ధర్మపత్ని హజ్రత్ హాజిరా అలైహిస్సలాంను, తనయుడు ఇస్మాయీల్ అలైహిస్సలాంను వదిలేసి వెళ్ళిపోతారు. అప్పుడు, శ్రీమతి హాజిరా, 'అదేమిటీ.. నన్నూ, నాబిడ్డను ఇలా ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతున్నారేమిటీ.?'అని ప్రశ్నించగా...'ఇది దైవాజ్ఞ.' అని మాత్రమే చెప్పి, అల్లాహ్‌పై అచంచల విశ్వాసంతో కనీసం వెనుదిరిగైనా చూడకుండా వెళ్ళిపోతారు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం.

కనీసం నాలుక తడుపుకోడానికి సైతం చుక్క నీరులేని ఆఎడారి ప్రదేశంలో చిన్నారి ఇబ్రాహీం దాహానికి తాళలేక గుక్కపట్టి ఏడుస్తున్న క్రమంలో ఆయన కాలి మడమలు రాసుకుపోయిన చోట అల్లాహ్ ఆజ్ఞతో అద్భుతమైన నీటి ఊట ఉబికింది. 'జమ్ జమ్ 'అనే పేరుగల ఆ పవిత్ర జలంతో తల్లీ తనయులు తమ దాహం తీర్చుకున్నారు. ఆ నీరే 'ఆబెజమ్ జమ్' పేరుతో ప్రసిద్ధి గాంచింది. ఆనాడు కేవలం రెండు ప్రాణాలకోసం వెలసిన ఆ జలం ఈనాడు హజ్ యాత్ర నిమిత్తం మక్కావెళ్ళే లక్షలాదిమంది ప్రజలతో పాటు, స్థానికులకూ నిరంతరం సమృద్ధిగా సరఫరా అవుతూ, యాత్రికులందరూ తమ తమ స్వస్థలాలకు తీసుకు వెళుతున్నా ఏమాత్రం కొరత రాకుండా తన మట్టాన్ని యథాతథంగా ఉంచుకోవడం అల్లాహ్ ప్రత్యక్ష మహిమకు నిదర్శనం. ఆ నాటి ఆ నిర్జీవ ఎడారి ప్రాంతమే ఈనాడు అత్యద్భుత సుందర మక్కానగరంగా రూపుదిద్దుకొని విశ్వవ్యాప్త ముస్లిం ప్రజానీకానికి పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. తరువాత కొంతకాలానికి అల్లాహ్ ఆదేశం మేరకు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం మక్కాకు తిరిగొచ్చి కుటుంబాన్ని కలుసుకొని, తనయుడు ఇస్మాయీల్ సహాయంతో 'కాబా' ను నిర్మించారు. చతుస్రాకారంలో ఉన్న ఆ రాతికట్టడాన్ని హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిముస్సలాంలు అల్లాహ్‌కు సమర్పించుకున్నారు. దీంతో కాబా దైవగృహంగా పేరుపొందింది.

తఖ్వా ప్రధానం



దేవుని ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన హజ్జ్‌ను సకల ఉపాసనా రీతులు ఇముడ్చుకున్న పరిపూర్ణ దైవారాధన అని కూడా చెప్పుకోవచ్చు. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం తన కుమారుడు ఇస్మాయీల్ (అ)తో కలిసి నిర్మించిన కాబా గృహ సందర్శనలో ఉపాసనా, ఆరాధనా రీతులన్నీ పరిపూర్ణతను సంతరించుకున్నాయి. యాత్ర, నిరాడంబర సాధు వస్త్రధారణ, దైవప్రార్థన, వ్రతనిష్ఠ, ఖుర్బానీ ఇవన్నీ సమన్వయం చెంది, ఒకేచోట కేంద్రీకృతమై, ఏకైక ప్రభువు సన్నిధిలో, హజ్ ఆరాధనలో ప్రదర్శితమవుతాయి. అందుకని కాబా గృహ సందర్శనార్థం చేసే హజ్జ్ వల్ల ఉపాసనా రీతులన్నిటినీ ఆచరించి దైవానుగ్రహం పొందినట్లే అవుతుంది. ఈ కారణంగానే ముస్లిం స్త్రీ పురుషులందరూ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా హజ్ చేయాలని అభిలషిస్తారు. ఆ మహాభాగ్యంకోసం ఉవ్విళ్ళూరుతూ ఉంటారు.

అలౌకికానందం

మక్కా చేరగానే ప్రతి హాజీ (యాత్రికుడు) కాబావైపు పరుగులు తీస్తాడు. పవిత్ర కాబాను చూడగానే భక్తులు పొందే ఆనంద పారవశ్యాలు వర్ణనాతీతం. ఒకానొక అలౌకిక ఆనందంతో, భక్తిపారవశ్యంతో కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. దీన్ని'తవాఫ్' అంటారు. ప్రతి తవాఫ్ లోనూ హాజీలు కాబాగోడలో అమరి ఉన్న 'హజ్రె అస్వద్ ' (నల్లనిశిల) ను ముద్దాడడానికి ప్రయత్నిస్తారు. దైవ గృహమైన కాబాకు సమీపంలో క్రీ. శ. 570 లో ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించారు. కనుక భక్తులు ఆ జ్ఞాపకాలనూ నెమరు వేసుకుంటారు. 'జమ్ జమ్ 'బావిలోని పవిత్ర జలాన్ని తనివి తీరా సేవిస్తారు. తరువాత సఫా, మర్వా కొండల మధ్య 'సయీ'చేస్తారు. దీని తరువాత కొన్నిరోజులు ఎవరి నివాసాల్లో వారు దైవచింతన, నమాజులతో కాలం గడిపి, 'జిల్ హజ్ 'మాసం ఎనిమిదవ తేదీన 'మినా' గ్రామం వెళ్ళి ఒక రోజంతా అక్కడ ఉంటారు. తొమ్మిదవ తేదీన ప్రపంచం నలుమూలలనుండీ వచ్చిన హాజీలంతా 'అరఫాత్ 'మైదానంలో గుమిగూడి దైవకారుణ్యాన్ని అభిలషిస్తూ ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంలోనే ఆనాడు ముహమ్మద్ ప్రవక్త (స) అశేష భక్తజనాన్ని ఉద్దేశించి తమ అంతిమ సందేశం వినిపించారు. అందుకని భక్తులు ఆ మహనీయుడు నిలిచిన ప్రదేశాన్ని కూడా దర్శించి పులకించి పోతారు. సూర్యాస్తమయానికి తిరుగు ప్రయాణం ప్రారంభించి'ముజ్దలిఫా' దగ్గర రాత్రి మజిలీ చేస్తారు. అక్కడే మగ్రిబ్, ఇషా నమాజులు కలిపి సామూహికంగా చేస్తారు.


మదీనా

సాధారణంగా మక్కాను దర్శించుకున్న యాత్రికులు మదీనాను కూడా సందర్శిస్తారు. మదీనా మక్కాకు రెండువందల మైళ్ళ దూరంలో ఉంది. ముహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలసవెళ్ళి అంతిమ దినాలు అక్కడే గడిపారు. మస్జిదెనబవి సందర్శనకు, హజ్జ్ కు ఎలాంటి సంబంధం లేకపోయినా అది ఇస్లామీయ జగత్తుకు జీవనాడి లాంటిది. ప్రవక్త మసీదు సందర్శన సున్నత్. కనుక దూరతీరాలనుండి వచ్చిన భక్తులు మస్జిదె నబవిని కూడా సందర్శించి, నమాజులు చేసి తమ యాత్ర సఫలమైందని భావిస్తారు. ఈ విధంగా ఒక హాజీ అన్ని నియమాలను పాటిస్తూ, అల్లాహ్ ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన పవిత్రకాబా గృహాన్ని సందర్శిస్తాడు. యాత్రాక్రమంలో అతనికి అడుగడుగునా హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం గార్ల సహనశీలత, త్యాగనిరతి, పాపభీతి, వాగ్దానపాలన, దైవాదేశపాలన లాంటి అనేక సుగుణాలను ఒంటబట్టించుకుంటాడు. అంతేకాదు, ఇంకా మరెన్నో సుగుణాలను మానవుల్లో జనింపజేసి మానవ సమానత్వానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి పూలబాటలుపరిచి, వారి ఇహపర సాఫల్యానికి హామీగా నిలుస్తుంది హజ్జ్ . ఇదే కాబా గృహ సందర్శనాయాత్ర అసలు పరమార్థం. అల్లాహ్ మనందరికీ ఈ విషయాలను అర్థం చేసుకొని, ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

– యండి. ఉస్మాన్ ఖాన్

సినిమా

తంగలాన్ రెడీ


● విక్రమ్

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ మూవీ థియేటర్స్‌కు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా పా. రంజిత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రం నిర్మించారు. కాగా 'తంగలాన్' సినిమాను తొలుత ఈ ఏడాది జనవరిలో రిలీజ్ చేయాలనుకున్నారు కానీ కుదర్లేదు. ఆ తర్వాత ఏప్రిల్‌కు వాయిదా వేశారు. ఏప్రిల్‌లోనూ 'తంగలాన్' థియేటర్స్‌కు రాలేదు. అయితే తాజాగా ఈ మూవీని ఆగస్టులో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం. మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో పార్వతీ తిరువోరు, పశుపతి, హరికృష్ణన్, అన్బుదురై కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

సితారే జమీన్ పర్ పూర్తి

ఆమీర్‌ఖాన్ హీరోగా నటించి, నిర్మించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'. జెనీలియా హీరోయిన్‌గా నటించారు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తాజాగా పూర్తయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు ఆర్ఎస్ ప్రసన్న. అంతేకాదు.. 'సితారే జమీన్ పర్' సినిమాని ఈ డిసెంబరులో విడుదల చేయాలనుకుంటున్నారట మేకర్స్. ఆమీర్‌ఖాన్ నటించిన 'తారే జమీన్ పర్' (2007) సినిమాకు సీక్వెల్‌గా 'సితారే జమీన్ పర్' తెరకెక్కుతోందట. ఆ సినిమాలో ఓ బాలుడిలో స్ఫూర్తి నింపే పాత్ర చేశారు ఆమీర్‌ఖాన్. అయితే 'సితారే జమీన్ పర్' లో ఆమీర్‌ఖాన్ పాత్రను పిల్లలే మోటివేట్ చేస్తారని, ఇదే ఈ సినిమా బేసిక్ స్టోరీ అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.


● ఆమీర్‌ఖాన్

నా గమనం.. నిత్య రణం!

'ఒక నేనే... నాకు చుట్టూ నేనే.. ఒకడైనా.. ఒంటరోణ్ణి కానే... ధీరుడినే.. యోధుడినే...' అంటూ మొదలవుతుంది 'కల్కి 2898 ఏడీ' సినిమాలోని 'భైరవ' యాంథమ్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైంటిఫిక్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశాపటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సి.అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ మూవీలోని 'భైరవ' యాంథమ్ ఆడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. పూర్తి వీడియో సాంగ్ నేడు విడుదలవుతోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ పాటకి రామజోగయ్యశాస్త్రి, కుమార్ లిరిక్స్ అందించారు. 'నాకు నేనే కర్త..కర్మ..క్రియ..ఒక నేనే వేల సైన్యమయ్యా...నా గమనం.. నిత్య రణం.. కణ కణ కణం..అనుచర గణం..'' అంటూ సాగే 'భైరవ' యాంథమ్‌ను పంజాబీ నటుడు–సింగర్ దిల్జీత్ సింగ్, దీపక్ బ్లూ, సంతోష్ నారాయణన్ పాడారు.


● ప్రభాస్

వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం!


నందితా శ్వేత

'ఈ బంగ్లాలో ఒక అమ్మాయిని చంపేశారు.. ఆ అమ్మాయే దెయ్యంగా మారి అందర్నీ చంపేస్తోందని కథలు కథలుగా చెప్పుకుంటున్నారు' అనే డైలాగ్‌తో 'ఓఎమ్‌జీ'(ఓ మంచి ఘోస్ట్) సినిమా ట్రైలర్ ఆరంభమైంది. నందితా శ్వేత, 'వెన్నెల' కిషోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓఎమ్‌జీ'. శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్‌పై డా. అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 'అందరి సమస్యలు వేరే అయినా వాటికి పరిష్కారం మాత్రం డబ్బు', 'ఇప్పటి వరకు ఆటాడితే ఎలా ఉంటుందో చూశారు.. ఇప్పుడు వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''హారర్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సూపర్ నేచురల్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అనూప్ రూబెన్స్ సంగీతం ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానుంది. మా సినిమా ప్రేక్షకులను నవ్వించడంతో పాటు భయపెడుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. రఘుబాబు, 'షకలక' శంకర్, నాగినీడు, 'బాహుబలి' ప్రభాకర్, నవమి గాయక్ ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ ఆండ్రూ.



నటి ఐశ్వర్య(నటుడు అర్జున్ కుమార్తె), నటుడు ఉమాపతిల(నటుడు, దర్శకుడు తంబిరామయ్య కుమారుడు) వివాహ రిసెప్షన్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ నెల 11న కుటుంబ సభ్యులు, బంధువులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఐశ్వర్య, ఉమాపతిల వివాహం జరిగిన సంగతి తెలిసిందే. కాగా చెన్నైలోని లీలా ప్యాలెస్‌లో వీరి వివాహ రిసెప్షన్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకకి తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్‌తో పాటు సినీ ప్రముఖులు రజనీకాంత్, ఉపేంద్ర, విజయ్ సేతుపతి, శివ కార్తికేయన్, శంకర్, ప్రభుదేవా, లోకేష్ కనకరాజ్, సత్యరాజ్, రోజా, కుష్బూ, స్నేహ తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

సస్పెన్స్ థ్రిల్లర్

సుగి విజయ్, మౌనిక మగులూరి జంటగా నటించిన హారర్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'రా.. రాజా'. బి. శివప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''రా..రాజా' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఈ సినిమాలో నటించిన 24 మంది పాత్రల ముఖాలు కనిపించవు. కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్న ఈ జనరేషన్‌లో కూడా ఇలాంటి చిత్రం చేయడం ఓ కొత్త ప్రయోగమే. ఈ సినిమా కొత్త ట్రెండ్ సెట్ చేస్తుందనిపిస్తోంది'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ్.


● బి.శివప్రసాద్, 'అల్లరి' నరేశ్

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● శ్రీమురళి, పృథ్వీ అంబార్

కన్నడలో సూపర్ హిట్ సాధించిన 'దియా' మూవీ ఫేమ్ పృథ్వీ అంబార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చౌకీదార్'. ఈ మూవీకి 'రథావర్' మూవీ ఫేమ్ చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహిస్తున్నారు. విద్యాశేఖర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కల్లహల్లి చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. కన్నడతో పాటు ఇతర భాషల్లోనూ రూపొందుతోన్న ఈ చిత్రానికి 'చౌకీదార్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మూవీ టైటిల్‌ని కన్నడ నటుడు 'రోరింగ్ స్టార్' శ్రీమురళి రిలీజ్ చేసి, చిత్రయూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''చౌకీదార్' టైటిల్‌ను బట్టి మాస్ మూవీ అనుకోవద్దు.. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. తన ప్రతి సినిమాని సరికొత్త కథతో తెరకెక్కిస్తారు చంద్రశేఖర్ బండియప్ప. 'చౌకీదార్' కూడా వైవిధ్యంగా ఉంటుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సచిన్ బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

నిమ్మకూరు మాస్టారు షురూ

ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ చంద్ర మనవడు శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'నిమ్మకూరు మాస్టారు'. నటుడు రాజేంద్ర ప్రసాద్ టైటిల్ రోల్ చేస్తున్నారు. అముదేశ్వర్ దర్శకత్వంలో జేఎమ్ సినీ ఫ్యాక్టరీ పతాకంపై జేఎమ్ ప్రదీప్ రెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీ ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. ఈ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్యామ్ సెల్వన్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి పొన్నం ప్రభాకర్ క్లాప్ కొట్టారు. మాధవపెద్ది సురేష్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని అన్ని పాటలకు జొన్నవిత్తుల సాహిత్యం అందిస్తున్నారు. ''మా కుటుంబంలోని ఐదో తరానికి చెందిన నా మనవడు శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయం కావడం గర్వంగా ఉంది'' అన్నారు మాధవపెద్ది సురేష్ చంద్ర. ''నిమ్మకూరు మాస్టారు' వంటి గొప్ప చిత్రం నిర్మించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు జేఎమ్ ప్రదీప్. ''ఈ నెల 25 నుంచి రాజమండ్రిలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది'' అన్నారు అముదేశ్వర్. ఈ చిత్రానికి కెమెరా: ఏడీ కరుణ్.


● శ్యామ్ సెల్వన్, మాధవపెద్ది సురేష్ చంద్ర



ఆంధ్రప్రదేశ్ స్కేటర్ జెస్సీకి పసిడి పతకం

సాక్షి, విజయవాడ: వరల్డ్ స్కేట్ ఓసియానియా ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో భాగంగా పసిఫిక్ కప్ ఓపెన్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి మాత్రపు జెస్సీ రాజ్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. న్యూజిలాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన 13 ఏళ్ల జెస్సీ ఇన్‌లైన్ ఫ్రీ స్కేటింగ్ లేడీస్ క్యాడెట్ విభాగంలో విజేతగా నిలిచింది. తన స్కేటింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్న జెస్సీ మొత్తం 31.98 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నాలుగేళ్ల క్రితం స్కేటింగ్ లో అడుగు పెట్టిన జెస్సీ జాతీయస్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్యాలు గెలిచింది.

తెలంగాణ అథ్లెట్ సాయికిరణ్‌కు స్వర్ణం

దుద్యాల్: జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన అల్వాల్ సాయికిరణ్ పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం జరిగిన ఈవెంట్‌లో వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం హస్నా బాద్ గ్రామానికి చెందిన 18 ఏళ్ల సాయికిరణ్ ఇనుప గుండును 18.36 మీటర్ల దూరం విసిరాడు. గచ్చిబౌలి స్టేడియంలో 'ద్రోణాచార్య' అవార్డు గ్రహీత, కోచ్ నాగపురి రమేశ్ వద్ద సాయికిరణ్ శిక్షణ తీసుకుంటున్నాడు.



స్మృతి సూపర్ సెంచరీ

- తొలి వన్డేలో భారత మహిళల గెలుపు
- 143 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు
- ఆశా శోభనకు నాలుగు వికెట్లు



స్మృతి మంధాన



ఆశా శోభన

బెంగళూరు: సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో భారత్ 143 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (127 బంతుల్లో 117; 12 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు సెంచరీతో చెలరేగింది. వన్డేల్లో స్మృతికి ఇదో ఆరో శతకం కాగా... భారత గడ్డపై మొదటిది కావడం విశేషం. ఒకదశలో భారత్ 99/5తో కష్టాల్లో నిలిచింది. అయితే లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ (48 బంతుల్లో 37; 3 ఫోర్లు), పూజ వస్త్రకర్ (42 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు) స్మృతికి సహకరించారు. 5 వికెట్లు చేజార్చుకున్న తర్వాత కూడా భారత మహిళల బృందం 166 పరుగులు జోడించగలగడం తమ వన్డే చరిత్రలోనే అత్యధిక కావడం ప్రస్తావనాంశం. అనంతరం దక్షిణాఫ్రికా 37.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. సూన్ లూస్ (58 బంతుల్లో 33; 4 ఫోర్లు), సినాలో జఫ్తా (27 నాటౌట్), మరిజాన్ కాప్ (24) కొద్ది సేపు ప్రతిఘటించగలిగారు. కెరీర్‌లో తొలి వన్డే ఆడిన కేరళకు చెందిన లెగ్ స్పిన్నర్ ఆశా శోభన (4/21) ప్రత్యర్థిని పడగొట్టగా... దీప్తి శర్మకు 2 వికెట్లు దక్కాయి. అతి పెద్ద వయసులో (33 ఏళ్ల 92 రోజులు) భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన ప్లేయర్‌గా ఆశా శోభన నిలిచింది. రెండో వన్డే బుధవారం ఇదే వేదికపై జరుగుతుంది.

'యూరో'లో ఇటలీ శుభారంభం



బస్తోని

డార్ట్‌మండ్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇటలీ జట్టు శుభారంభం చేసింది. అల్బేనియాతో జరిగిన గ్రూప్ 'బి' తొలి మ్యాచ్‌లో ఇటలీ 2–1తో గెలిచింది. ఆట మొదలైన 23 సెకన్లకే అల్బేనియా ప్లేయర్ బజ్రామి గోల్ చేయడంతో చేశాడు. 64 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో అత్యంత వేగంగా నమోదైన గోల్ ఇదే కావడం విశేషం. తొలి నిమిషంలో గోల్ సమర్పించుకున్న ఇటలీ వెంటనే తేరుకుంది. 11వ నిమిషంలో బస్తోని... 16వ నిమిషంలో బరెల్లా ఒక్కో గోల్ చేయడంతో ఇటలీ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. హాంబర్గ్‌లో జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 2–1తో పోలాండ్‌ను ఓడించగా... స్టుట్‌గార్ట్‌లో డెన్మార్క్, స్లొవేనియా జట్ల మధ్య గ్రూప్ 'సి' మ్యాచ్ 1–1తో 'డ్రా' అయింది.



హ్యారీ బ్రూక్

ఆస్ట్రేలియా గెలుపు ఇంగ్లండ్ సూపర్-8కు...

ఆసీస్ చేతిలో ఓడిన స్కాట్లాండ్ ● ఇంగ్లండ్‌కు కలిసొచ్చిన అదృష్టం

నమీబియాతో ఇంగ్లండ్ చివరి లీగ్ మ్యాచ్... కచ్చితంగా గెలవడంతో పాటు మరోవైపు ఆస్ట్రేలియా చేతిలో స్కాట్లాండ్ ఓడితేనే రన్‌రేట్ లెక్కలతో ముందుకు వెళ్లే అవకాశం. భారీ వర్షంతో మ్యాచ్ ఆలస్యం కావడంతో ఇంగ్లండ్ గుండెల్లో రాయి పడింది. రద్దయినా ఇంగ్లండ్ ఇంటికే! గంట, రెండు గంటలు, మూడు గంటలు... చివరకు వాన ఆగడంతో 11 ఓవర్ల మ్యాచ్... కానీ మళ్లీ వర్షం రాకతో మరో ఓవర్ కుదింపు... 10 ఓవర్ల ఛేదనలో నమీబియాకు విజయావకాశం ఉన్నట్లు కనిపించినా ఆఖరికి ఇంగ్లండ్‌దే పైచేయి అయింది. ఇక తర్వాతి మ్యాచ్ ఫలితం కోసం ఎదురుచూపులు!

'ఇంగ్లండ్ లీగ్ దశలో నిష్క్రమించడం మాకు మేలు చేస్తుందనుకుంటే ఆఖరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌కు సహకరిస్తాం' అంటూ హాజల్‌వుడ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆస్ట్రేలియా ఎలా ఆడుతుందనేది ఆసక్తి రేకెత్తించింది. తక్కువ స్కోర్ల ఈ టోర్నీలో స్కాట్లాండ్ పటిష్ట ప్రత్యర్థిపై అనూహ్యంగా 180 పరుగులు చేసేసింది. ఛేదనలో ఒకదశలో ఆసీస్ స్కోరు 60 పరుగులకు 3 వికెట్లు! స్టొయినిస్, హెడ్ ఆదుకున్నా... చివరి 7 ఓవర్లలో 89 పరుగులు చేయాల్సిన స్థితిలో స్కాట్లాండ్ గెలుపు ఆశలు... కానీ ఆసీస్ తమ అసలు స్థాయిని ప్రదర్శించి మెరుపు ఆటతో 40 బంతుల్లో 94 పరుగులు రాబట్టింది...స్కాట్లాండ్ ఆటగాళ్ల నిర్వేదం... ఇంగ్లండ్ శిబిరంలో సంబరాలు!

నార్త్ సౌండ్: డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తమ పరువు నిలబెట్టుకుంది. టి20 ప్రపంచకప్ గ్రూప్ దశలోనే నిష్క్రమించే ప్రమాదాన్ని దాటి ఎట్టకేలకు సూపర్-8 దశకు అర్హత సాధించింది. కీలక సమయంలో మెరుగైన ఆటను ప్రదర్శించడంతో పాటు అదృష్టం కూడా ఆ జట్టుకు కలిసొచ్చింది. పాయింట్ల పరంగా స్కాట్లాండ్‌తో సమానంగా (5) సమానంగా నిలిచినా... మెరుగైన రన్‌రేట్ కారణంగా ఇంగ్లండ్ ముందంజ వేసింది. గ్రూప్ 'బి'లో తమ చివరి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ 41 పరుగుల తేడాతో నమీబియాపై ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా 10 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 5 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హ్యారీ బ్రూక్ (20 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బెయిర్‌స్టో (18 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం నమీబియా విజయ లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 10 ఓవర్లలో 126 పరుగులుగా నిర్దేశించారు. అయితే నమీబియా 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులకే పరిమితమైంది. మైకేల్ వాన్ లింగెన్ (29 బంతుల్లో 33; 1 ఫోర్, 3 సిక్స్‌లు), డేవిడ్ వీస్ (12 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ డావిన్ (16 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) పోరాడినా లాభం లేకపోయింది.

గ్రాస్ ఐలెట్: మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా టి20 ప్రపంచకప్ గ్రూప్ 'బి'లో సంపూర్ణ ఆధిపత్యంతో లీగ్ దశను ముగించింది. ఆడిన 4 మ్యాచ్‌లలోనూ ఆ జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన పోరులో ఆసీస్ 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. మెక్‌ములెన్ (34 బంతుల్లో 60; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (31 బంతుల్లో 42 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), జార్జ్ మున్సే (23 బంతుల్లో 35; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 186 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ (29 బంతుల్లో 59; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), హెడ్ (49 బంతుల్లో 68; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. డేవిడ్ వార్నర్ (1), కెప్టెన్ మిచెల్ మార్ష్ (8), మ్యాక్స్‌వెల్ (11) విఫలం కాగా... స్టొయినిస్, ట్రవిస్ హెడ్ నాలుగో వికెట్‌కు 44 బంతుల్లో 80 పరుగులు జోడించి జట్టును గెలుపు దిశగా నడిపించారు. చివర్లో విజయానికి 26 పరుగుల దూరంలో స్టొయినిస్ వెనుదిరిగినా... టిమ్ డేవిడ్ (14 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగి మరో 2 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించాడు.



స్టొయినిస్

ఆర్చరీలో భారత్‌కు ఒలింపిక్ బెర్త్

క్వాలిఫయింగ్ టోర్నీలో భజన్ కౌర్‌కు స్వర్ణం



భజన్ కౌర్

అంటాల్యా (టర్కీ): మహిళల ఆర్చరీ రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారైంది. చివరి క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన ఈవెంట్‌లో భారత ఆర్చర్ భజన్ కౌర్ స్వర్ణ పతకం సాధించడంతోపాటు ఒలింపిక్ బెర్త్‌ను అందించింది. ఫైనల్లో భజన్ కౌర్ 6-2 (28-26, 29-29, 29-26, 29-29)తో మొబీనా ఫలా (ఇరాన్)పై విజయం సాధించింది. భారత స్టార్ ఆర్చర్ 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి నిరాశ పరిచింది. నేరుగా మూడో రౌండ్ మ్యాచ్ ఆడిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ దీపిక 4-6 (28-26, 27-25, 23-26, 24-25, 27-29)తో యెలాగుల్ రమజనోవా (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయింది. భారత్‌కే చెందిన అంకిత 4-6 (27-27, 27-28, 29-27, 27-27, 28-29)తో మొబీనా ఫలా (ఇరాన్) చేతిలో పరాజయం పాలైంది. ఇప్పటికే పురుషుల వ్యక్తిగత విభాగంలో ధీరజ్ బొమ్మదేవర భారత్‌కు ఒలింపిక్ బెర్త్‌ను అందించాడు. ఫలితంగా పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మిక్స్‌డ్ విభాగంలోనూ పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది.

పాకిస్తాన్ చచ్చీ చెడి...

3 వికెట్లతో ఐర్లాండ్‌పై విజయం

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): పేలవ ఆటతో 'సూపర్-8' అవకాశాలు కోల్పోయిన పాకిస్తాన్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అతి కష్టమ్మీద నెగ్గి టి20 వరల్డ్ కప్‌ను ముగించింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో పాక్ 3 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. గారెత్ డెలానీ (19 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, జోష్ లిటిల్ (18 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో ఇమాద్ వసీమ్, షాహిన్ అఫ్రిది చెరో 3 వికెట్లు పడగొట్టగా... ఆమిర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం పాక్ 18.5 ఓవర్లలో 7 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. ఒకవైపు జట్టు వరుసగా వికెట్లు కోల్పోయినా... కెప్టెన్ బాబర్ ఆజమ్ (34 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు) చివరి వరకు నిలవగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షాహిన్ అఫ్రిది (5 బంతుల్లో 13 నాటౌట్; 2 సిక్స్‌లు) జట్టును గట్టెక్కించాడు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

బంగ్లాదేశ్ X నేపాల్
వేదిక: కింగ్స్‌టౌన్; ఉదయం గం. 5 నుంచి
నెదర్లాండ్స్ X శ్రీలంక
వేదిక: గ్రాస్ ఐలెట్; ఉదయం గం. 6 నుంచి
న్యూజిలాండ్ X పాపువా న్యూగినీ
వేదిక: ట్రినిడాడ్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌పీసీఐఎల్, ముంబైలో 58 అసిస్టెంట్ గ్రేడ్-1 పోస్టులు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. వివిధ విభాగాల్లో అసిస్టెంట్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 58
- » పోస్టుల వివరాలు: అసిస్టెంట్ గ్రేడ్-1(హెచ్ఆర్)-29, అసిస్టెంట్ గ్రేడ్-1 (ఎఫ్-ఎ)-17, అసిస్టెంట్ గ్రేడ్-1(సి-ఎంఎం)-12.
- » అర్హత: కనీసం 50% మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 25.06.2024 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » పే స్కేల్: నెలకు రూ.38,250.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, టైప్ రైటింగ్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 05.06.2024
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:25.06.2024
- » వెబ్‌సైట్: https://npcilcareers.co.in

జేఎన్ఏఎఫ్ఏ యూనివర్శిటీ, హైదరాబాద్‌లలో బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్(జేఎన్ఏఎఫ్ఏ) యూనివర్శిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్ఏఎఫ్ఏయూ, అనుబంధ కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ని నిర్వహిస్తోంది.

కోర్సులు, సీట్ల వివరాలు

- » బీఎఫ్ఏ(అప్లైడ్ ఆర్ట్ అండ్ విజువల్ కమ్యూనికేషన్)-50 సీట్లు.
- » బీఎఫ్ఏ(పెయింటింగ్)-35 సీట్లు.
- » బీఎఫ్ఏ(స్కల్ప్చర్)-20 సీట్లు.
- » బీఎఫ్ఏ(యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్)-60 సీట్లు. » బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ అండ్ విజువల్ కమ్యూనికేషన్)-50 సీట్లు.
- » బీడిజైన్(ఇంటీరియర్ డిజైన్)-60 సీట్లు.
- » కోర్సు వ్యవధి: నాలుగేళ్లు.
- » అర్హత:ఇంటర్మీడియట్ లేదా తత్సమానం ఉత్తీర్ణత

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లై దరఖాస్తు చివరితేది: 04.07.2024.
- » రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 10.07.2024.
- » ప్రవేశ పరీక్ష తేదీలు: 20-21.07.2024
- » వెబ్‌సైట్: https://jnafauadmissions.com

మేటి సంస్థల్లో ప్రవేశాలకు.. జోసా

- » ఐఐటీలు, నిట్‌ల్లో అడ్మిషన్స్ ప్రారంభం
- » ఆన్‌లైన్ విధానంలో జోసా కౌన్సెలింగ్
- » మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులకు అర్హత
- » ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు
- » జూన్ 20న తొలి విడత కేటాయింపు

జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌ల్లో అర్హత సాధించిన విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు సర్వం సిద్ధమైంది. జోసా(జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థులు చేయాల్సిందల్లా.. తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లు, ఇన్‌స్టిట్యూట్స్ ప్రాథమ్యాలను అప్రమత్తంగా పేర్కొనడమే! దాని ఆధారంగా.. ఆటోమేటిక్‌గా సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో..జోసా-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ, ఇన్‌స్టిట్యూట్స్, సీట్లు, అర్హతలు తదితర వివరాలు..

దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, సీఎఫ్‌టీఐలలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ తదితర ప్రోగ్రామ్‌లతో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ విధానమే.. జోసా కౌన్సెలింగ్. ఈ ఏడాది 23 ఐఐటీలు, 32 ఎన్ఐటీలు సహా మొత్తం 121 ఇన్‌స్టిట్యూట్స్‌లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఐఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్, నిట్‌లు తదితర ఇన్‌స్టిట్యూట్స్‌లో అడ్మిషన్స్‌కు జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జోసా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు తప్పనిసరిగా.. జోసా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తమ వివరాలు పొందుపరచాలి. ఆ తర్వాత తమ ఆసక్తి మేరకు కోర్సు, ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలను ఆన్‌లైన్‌లోనే పేర్కొనాల్సి ఉంటుంది. ఇలా ప్రాథమ్యాలను పేర్కొనడాన్నే ఛాయిస్ ఫిల్లింగ్ అని పిలుస్తారు. ఆన్‌లైన్‌లో ప్రాథమ్యాలను పేర్కొన్న తర్వాత.. విద్యార్థులు ఎంచుకున్న కోర్సు, ఇన్‌స్టిట్యూట్.. అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా సీటు కేటాయింపు జరుగుతుంది.

ఉదాహరణకు.. ఒక విద్యార్థి మొదటి ప్రాథమ్యంగా ఐఐటీ-ముంబైలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను, రెండో ప్రాథమ్యంగా ఐఐటీ-ఢిల్లీలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను ఎంచుకుంటే.. ఆ విద్యార్థి పొందిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ-ముంబైలో సీటు లభించకపోతే.. ఐఐటీ-ఢిల్లీలోని సీటుకు పరిగణనలోకి తీసుకుంటారు.ఇలా అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు మొత్తం 23 ఐఐటీల్లో తమకు ఆసక్తి ఉన్న కోర్సు, ప్రాథమ్యాలను వరుస క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్ టు ఛాయిస్ ఫిల్లింగ్

జోసా ప్రక్రియలో భాగంగా విద్యార్థులు ముందుగా జోసా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, లాగిన్-ఐడీ, పాస్‌వర్డ్‌లను క్రియేట్ చేసుకోవాలి. ఆ తర్వాత అందుబాటులో ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు, ప్రోగ్రామ్‌లు, సీట్లును బేరీజు వేసుకుంటూ.. తమ ఆసక్తికి అనుగుణంగా ప్రాథమ్యాలను పేర్కొనాలి. ఇలా ఆన్‌లైన్‌లో నిర్దేశిత గడువు తేదీలోగా ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు.. ముందుగా వారిచ్చిన ప్రాథమ్యాల ఆధారంగా మాక్ సీట్ అలొకేషన్ (నమూనా సీటు కేటాయింపు) వివరాలను అందుబాటులో ఉంచుతారు. ఫలితంగా విద్యార్థులు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా సీటు వచ్చే అవకాశం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు, బ్రాంచ్‌ల వివరాలు తెలుస్తాయి. మాక్ సీట్ అలొకేషన్ జాబితాను బేరీజు వేసుకున్న విద్యార్థులు..

తమ ర్యాంకుకు ఇంకా మంచి ఇన్‌స్టిట్యూట్‌లో సీటు వస్తుందనుకుంటే.. తమ ఆప్షన్లను మార్చుకునే వెసులుబాటు కూడా కల్పిస్తారు. ఇలా.. రెండు సార్లు మాక్ సీట్ అలొకేషన్ జాబితాను అందుబాటులో ఉంచనున్నారు. మాక్ సీట్ అలొకేషన్ చూసుకుని ఆప్షన్లను మార్చుకునేందుకు గడువు ఇస్తారు. ఆ తర్వాత సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్


- ▪ జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరుగుతుంది. అభ్యర్థులు మొదటి రౌండ్ నుంచి ఆరో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొనొచ్చు.
- ▪ మొదటి రౌండ్‌లో లభించిన సీటు, ఇన్‌స్టిట్యూట్‌పై ఆసక్తి లేకపోతే ఇతర ఇన్‌స్టిట్యూట్‌లకు తమ దరఖాస్తును పరిగణించే విధంగా.. తదుపరి రౌండ్లలో కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. ఇందుకోసం ఫ్రీజ్, ఫ్లోట్, స్లైడ్‌లను ఎంచుకోవచ్చు.
- ▪ ఫ్రీజ్: విద్యార్థులు తొలి రౌండ్‌లోనే తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్, ప్రోగ్రామ్‌తో సంతృప్తి చెందితే ఫ్రీజ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీంతో తదుపరి రౌండ్లకు విద్యార్థుల ఛాయిస్‌లను పరిగణనలోకి తీసుకోరు. తొలిదశలో సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లోనే సీట్ యాక్సెప్టెన్స్ తెలియజేయాల్సి ఉంటుంది.
- ▪ ఫ్లోట్: మొదటి రౌండ్‌లో వచ్చిన సీటు నచ్చకపోతే.. మరింత మంచి ఇన్‌స్టిట్యూట్ లేదా బ్రాంచ్ కోసం ఫ్లోటింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఫలితంగా ఆ విద్యార్థి ప్రాథమ్యాలను మిగతా రౌండ్లకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ▪ స్లైడ్: మొదటి రౌండ్‌లోనే నిర్దిష్టంగా ఒక ఇన్‌స్టిట్యూట్‌లో ఒక బ్రాంచ్‌లో సీటు వచ్చిన విద్యార్థి.. అదే ఇన్‌స్టిట్యూట్‌లో మరో బ్రాంచ్‌లో సీటు కోరుకుంటే.. స్లైడింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇలా ఫ్లోటింగ్, స్లైడింగ్ ఆప్షన్లు పేర్కొనడం వల్ల అభ్యర్థులకు చివరగా కేటాయించిన సీట్లే ఖరారవుతాయి. తొలిదశలో లేదా అంతకుముందు దశల్లో వచ్చిన సీట్లు రద్దవుతాయి.

ఆన్‌లైన్‌లో సీటు కేటాయింపు

జోసా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు ఎంచుకున్న ప్రాథమ్యాలు, పొందిన ర్యాంకు ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీటు కేటాయిస్తారు. జోసా ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు తమకు కేటాయించిన సీటుకు యాక్సెప్టెన్స్ ఇవ్వకపోతే సీటు రద్దవుతుంది. మొత్తం ఆరు రౌండ్లలో జరిగే సీటు అలొకేషన్ ప్రక్రియలో భాగంగా.. ప్రతి రౌండ్ సీట్ అలొకేషన్ తర్వాత నిర్దిష్ట గడువు తేదీలోగా సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌కు ఆన్‌లైన్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇలా రిపోర్ట్ చేయకపోతే సీటు రద్దవుతుంది.

యాక్సెప్ట్, విత్‌డ్రా అవకాశం

జోసా ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో యాక్సెప్ట్, విత్ డ్రా అవకాశం ఉంది. సీట్లు లభించిన విద్యార్థులు.. ప్రతి రౌండ్ తర్వాత సీటు యాక్సప్టెన్స్ లేదా ఉపసంహరణ విషయాన్ని స్పష్టం చేయాలి. మొత్తం ఆరు రౌండ్ల కౌన్సెలింగ్‌లో అయిదో రౌండ్ వరకే ఉపసంహరణ అవకాశం ఉంటుంది. అంటే.. అయిదో రౌండ్ సీట్ అలొకేషన్‌ను చూసుకుని అప్పుడు మాత్రమే ఉపసంహరణ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. చివరి రౌండ్ (ఆరో రౌండ్)లో ఈ ఉపసంహరణ అవకాశం ఉండదు.



జోసా-2024

సీట్ యాక్సప్టెన్స్ ఫీజు

జోసా కౌన్సెలింగ్ విధానంలో సీటు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా సీట్ యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. దీన్ని కూడా ఆన్‌లైన్ విధానంలో నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్ కార్డ్ లేదా ఎస్‌బీఐ ఈ-చలాన్ రూపంలో మాత్రమే చెల్లించాలి. ఐఐటీల్లో సీటు పొందిన జనరల్ కేటగిరీ విద్యార్థులు రూ.35 వేలు; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విద్యార్థులు రూ.17,500 వేలు చొప్పున యాక్సెప్టెన్స్ ఫీజు చెల్లించాలి. తర్వాత దశలో చివరగా తాము ప్రవేశం పొందిన ఇన్‌స్టిట్యూట్‌కు అనుగుణంగా అకడమిక్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ అకడమిక్ ఫీజుల్లోంచి అప్పటికే చెల్లించిన యాక్సెప్టెన్స్ ఫీజును మినహాయిస్తారు.

వినూత్న కోర్సులు

ఐఐటీల్లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, మెటలర్జికల్ వంటి కోర్సులతోపాటు ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ వంటి ప్రోగ్రామ్‌లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. వీటితోపాటు ఇటీవల కాలంలో పలు ఐఐటీలు మెడ్‌టెక్ కోర్సులను సైతం అందిస్తున్నాయి. బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోసైన్స్ వంటి కోర్సులు ఉన్నాయి.

వేల సంఖ్యలో సీట్లు

- ▪ 23 ఐఐటీల్లో 17,740 సీట్లు.
- ▪ 32 ఎన్ఐటీల్లో 24, 229 సీట్లు.
- ▪ 26 ట్రిపుల్ ఐటీల్లో 8,546 సీట్లు.
- ▪ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 40 ఇతర సాంకేతిక ఇన్‌స్టిట్యూట్స్‌లో 9,402.

జోసా- 2024.. ముఖ్య తేదీలు

- ▪ జూన్ 10: జోసా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం.
- ▪ జూన్ 15: మాక్ సీట్ అలొకేషన్(సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-1 విడుదల. (జూన్ 14 రాత్రి పది గంటల వరకు అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా దీన్ని విడుదల చేస్తారు.)
- ▪ జూన్ 17: మాక్ సీట్ అలొకేషన్ (సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-2 విడుదల. (ఈ జాబితాను జూన్ 16 సాయంత్రం అయిదు గంటల వరకు పేర్కొన్న ప్రాథ్యమాల ఆధారంగా వెల్లడించనున్నారు).
- ▪ జూన్ 18: ఛాయిస్ ఫిల్లింగ్, క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ.
- ▪ జూన్ 19: వివరాల పునస్సమీక్ష, పరిశీలన.
- ▪ జూన్ 20: మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు.
- ▪ జూన్ 20-24: మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి. అదే విధంగా యాక్సప్టెన్స్ ఫీజును చెల్లించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- ▪ జూన్ 27: రెండో దశ సీట్ల కేటాయింపు
- ▪ జూన్ 27- జూలై 1: రెండో రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ల అప్‌లోడ్. అదే విధంగా.. రెండో రౌండ్‌లో పొందిన సీటు విషయంలో ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి విరమించుకునే అవకాశం.
- ▪ జూలై 4: మూడో రౌండ్ సీట్ల కేటాయింపు.
- ▪ జూలై 4-8: మూడో రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- ▪ జూలై 5: మూడో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి ఉపసంహరణ.
- ▪ జూలై 10: నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు.
- ▪ జూలై 10-15: నాలుగో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- ▪ జూలై 11-15: నాలుగో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- ▪ జూలై 17: అయిదో రౌండ్ సీట్ల కేటాయింపు. ఐఐటీల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి అయిదో రౌండ్‌ను చివరి రౌండ్‌గా పేర్కొన్నారు.
- ▪ జూలై 17-22: అయిదో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు పేమెంట్.
- ▪ జూలై 17-23: ఎన్ఐటీ+ సిస్టమ్ పేరుతో ఎన్ఐటీల్లో సీట్ల కేటాయింపు రౌండ్.
- ▪ జూలై 24-జూలై 26: ఎన్ఐటీ + సిస్టమ్ విధానంలో పొందిన సీటుకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు.
- ▪ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://josaa.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 182	76,993	
నిఫ్టీ ▲ 67	23,466	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,689	▲	21
డోజోన్స్	38,589	▽	58
ఎఫ్‌టీఎస్ఈ 100	8,147	▽	17
డాక్స్	18,002	▽	264
షాంఘై	3,033	▲	4
నికాయ్	38,815	▲	94

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.06	107.62
€	యూరో	ఒకటి	88.82	91.18
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.62	53.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.11	56.04
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.40	64.08
SAR	సౌదీ రియాల్	[illegible]	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.85	23.63
¥	చైనా యువాన్	[illegible]	10.40	12.47

ఒకరికి రెండు పాలసీలు.. క్లెయిమ్ ఎలా?

హెల్త్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇటీవలి కాలంలో వేతన జీవుల్లో చాలా మంది రెండు హెల్త్ పాలసీలు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీనివల్ల అదనపు ప్రయోజనాలు కూడా ఉన్నాయి. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చికిత్స వ్యయం బీమా కవరేజీని మించిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి సందర్భాలను ఒకటికి మించిన పాలసీలతో సులభంగా గట్టెక్కొచ్చు. కానీ, ఒకటి కంటే ఎక్కువ పాలసీలు ఉంటే క్లెయిమ్ ఎలా చేయాలనే విషయంలో చాలా మంది అయోమయాన్ని ఎదుర్కొంటూ ఉంటారు. ఈ విషయంలో నిపుణుల సూచనలు అందించే కథనమిది.



- ఆస్పత్రి బిల్లు పాలసీ పరిధి దాటినప్పుడే..
- ముందుగా ఒక పాలసీ కిందే క్లెయిమ్
- అది పరిష్కారమైన తర్వాత రెండో దానికి చాన్స్
- నగదు రహితం లేదా రీయింబర్స్‌మెంట్
- ఆస్పత్రిలో చేరితే రెండు సంస్థలకూ చెప్పాల్సిందే

గతంలో వేరు..

ఒక వ్యక్తికి ఒకటికి మించిన బీమా సంస్థల నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఉంటే, క్లెయిమ్ మొత్తాన్ని ఆయా సంస్థలు సమానంగా భరించాలనే నిబంధన లోగడ ఉండేది. 2013లో దీన్ని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) తొలగించింది. దీంతో ఇప్పుడు ఒకటికి మించిన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు కలిగి ఉన్నా కానీ, పాలసీదారు తనకు నచ్చిన చోట లేదంటే రెండు సంస్థల వద్దా క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు.

ఒకరికి ఎన్ని ప్లాన్లు?



అసలు ఒకటికి మించి హెల్త్ పాలసీలు ఎందుకు? అనే సందేహం రావచ్చు. ఒక్కొక్కరి అవసరాలే దీన్ని నిర్ణయిస్తాయి. ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి పనిచేస్తున్న సంస్థ నుంచి గ్రూప్ హెల్త్ కవరేజీ సాధారణంగా ఉంటుంది. ఉన్నట్టుండి ఉద్యోగం నుంచి తప్పుకోవాల్సి వచ్చినా లేదంటే ఉద్యోగం కోల్పోయిన సందర్భాల్లో.. తిరిగి ఉపాధి లభించేందుకు కొంత సమయం పట్టొచ్చు. కంపెనీలు కల్పించే గ్రూప్ హెల్త్ కవరేజీ.. ఉద్యోగానికి రాజీనామా చేయడంతోనే ముగిసిపోతుంది. అందుకే వ్యక్తిగతంగా మరో ప్లాన్ కలిగి ఉంటే, ఉద్యోగం లేని సమయంలోనూ ఉపయోగపడుతుంది. వైద్య చికిత్సల వ్యయాలు గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో రెండు ప్లాన్లను కలిగి ఉండడం మంచి నిర్ణయమే అవుతుంది. లేదంటే బేస్ ప్లాన్ ఒకటి తీసుకుని, దానిపై మరింత మెరుగైన కవరేజీతో సూపర్ టాపప్ ప్లాన్ జోడించుకోవడం మరొక మార్గం.

క్లెయిమ్ ఎలా?

రెండు ప్లాన్లు కలిగిన వారు ఆస్పత్రిలో చేరిన తర్వాత రెండు బీమా సంస్థలకు తప్పనిసరిగా సమాచారం అందించాలి. ఒకటికి మించిన సంస్థల నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లు కలిగి ఉంటే, అప్పుడు ముందుగా ఒక బీమా సంస్థకు ప్రతిపాదనలు పంపిస్తే సరిపోతుంది. నగదు రహిత, రీయింబర్స్‌మెంట్ మార్గాల్లో దేనినైనా వినియోగించుకోవచ్చు. క్లెయిమ్ మొత్తం ఒక హెల్త్ ప్లాన్ కవరేజీ దాటనప్పుడు ఒక బీమా సంస్థ వద్దే దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. కానీ, ఒక పాలసీ కవరేజీకి మించి ఆస్పత్రి బిల్లు వచ్చినప్పుడు, రెండో బీమా సంస్థ వద్ద మిగిలిన మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవాలి. అంతే కానీ, ఒకేసారి ఒకే క్లెయిమ్‌ను రెండు సంస్థల వద్ద దాఖలు చేసేందుకు అవకాశం లేదు. ఉదాహరణకు రూ.5 లక్షల చొప్పున రెండు ప్లాన్లు ఉన్నాయని అనుకుందాం. ఆస్పత్రి బిల్లు రూ.7 లక్షలు వచ్చింది. అప్పుడు తొలుత ఒక సంస్థ వద్ద క్లెయిమ్ దాఖలు చేయాలి. అక్కడి నుంచి వచ్చిన చెల్లింపులు మినహాయించి, అప్పుడు మిగిలిన మొత్తానికి రెండో బీమా సంస్థ నుంచి పరిహారం కోరాలి. ఒక పాలసీలో రూమ్‌రెంట్ పరంగా పరిమితులు ఉండి, దానివల్ల క్లెయిమ్ పూర్తిగా రాని సందర్భాల్లోనూ.. మిగిలిన మొత్తాన్ని రూమ్‌రెంట్ పరిమితులు లేని మరో పాలసీ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. కొన్ని పాలసీల్లో రూమ్ రెంట్, కొన్ని చికిత్సలకు పరిమితులు ఉంటాయి. ముఖ్యంగా గ్రూప్ హెల్త్ ప్లాన్లలో ఇవి చూడొచ్చు. అలాంటప్పుడు రూ.5 లక్షల కవరేజీ ఉన్నప్పటికీ పూర్తి మొత్తం రాకపోవచ్చు. ఉదాహరణకు రూ.7లక్షల ఆస్పత్రి బిల్లుకు సంబంధించి రూ. 5 లక్షల గ్రూప్ పాలసీలో రూ.4 లక్షలే క్లెయిమ్ కింద వచ్చిందని అనుకుంటే.. అప్పుడు మిగిలిన రూ. 3 లక్షలను రెండో పాలసీ కింద రీయింబర్స్‌మెంట్ కోరవచ్చు. ఒక బీమా సంస్థ క్లెయిమ్ దరఖాస్తును తిరస్కరించినా, రెండో బీమా సంస్థను సంప్రదించవచ్చు. వేతన జీవులు పనిచేసే సంస్థ నుంచి గ్రూప్ హెల్త్ ప్లాన్, వ్యక్తిగతంగా ఫ్యామిలీ ఫ్లోటర్ లేదా ఇండివిడ్యువల్ ప్లాన్ కలిగి ఉన్నప్పుడు.. మొదట గ్రూప్ హెల్త్ ప్లాన్ నుంచి క్లెయిమ్‌కు వెళ్లడం మంచి ఆప్షన్. గ్రూప్ హెల్త్ ప్లాన్‌లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ సులభంగా ఉంటుంది. క్లెయిమ్ మొత్తం ఒక బీమా పాలసీ కవరేజీ పరిధిలోనే ఉంటే ఒక్క సంస్థ వద్దే క్లెయిమ్‌కు పరిమితం కావాలి. దీనివల్ల రెండో ప్లాన్‌లో నో క్లెయిమ్ బోనస్ నష్టపోకుండా చూసుకోవచ్చు.



నగదు రహిత చికిత్స

బీమా సంస్థ నెట్‌వర్క్ పరిధిలోని అన్ని ఆస్పత్రుల నుంచి నగదు రహిత చికిత్స తీసుకోవచ్చు. ఏ ఆస్పత్రిలో అయినా నగదు రహిత చికిత్సకు బీమా సంస్థలు నేడు అవకాశం కల్పిస్తున్నాయి. కాకపోతే ఆస్పత్రి నిషేధిత జాబితాలో లేని వాటికే ఈ సదుపాయం పరిమితమని గుర్తుంచుకోవాలి. రెండు ప్లాన్లలోనూ నగదు రహిత చికిత్సకు వెళ్లొచ్చు. కానీ, ఒక సంస్థ నుంచే నగదు రహిత క్లెయిమ్‌కు ఆస్పత్రులు ప్రాధాన్యం ఇస్తుంటాయి. మిగిలిన మొత్తం కోసం రీయింబర్స్‌మెంట్ విధానానికి వెళ్లాలని సూచిస్తుంటాయి. అలాంటప్పుడు నగదు రహిత విధానంలో గరిష్ఠ పరిమితి మేరకే ఒక బీమా సంస్థ నుంచి చెల్లింపులు లభిస్తాయి. అప్పుడు మిగిలిన మొత్తాన్ని సొంతంగా చెల్లించి, దాన్ని రాబట్టుకునేందుకు రెండో బీమా సంస్థను సంప్రదించాలి. దీనికోసం మొదట క్లెయిమ్ చేసిన బీమా సంస్థ నుంచి 'క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమ్మరీ' తీసుకోవాలి. అలాగే, హాస్పిటల్ బిల్లులు, చికిత్సకు సంబంధించి అన్ని పత్రాల ఫొటో కాపీలను సర్టిఫై (అటెస్టేషన్) చేసి ఇవ్వాలని మొదటి బీమా సంస్థను కోరాలి. వీటితో రెండో బీమా సంస్థ వద్ద రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దరఖాస్తు దాఖలు చేసుకోవాలి. రెండు బీమా సంస్థల వద్ద రీయింబర్స్‌మెంట్ విధానంలో క్లెయిమ్ చేసుకోవాలన్నా సరే.. మొదట ఒక సంస్థ వద్ద క్లెయిమ్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం ఆస్పత్రి నుంచి అన్ని బిల్లుల కాపీలు, డిశ్చార్జ్ సమ్మరీ, ల్యాబ్ రిపోర్ట్‌లు తీసుకుని బీమా సంస్థకు సమర్పించాలి. క్లెయిమ్ ఆమోదం అనంతరం, క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమ్మరీతోపాటు, అన్ని డాక్యుమెంట్ల ఫొటో కాపీలతో రెండో సంస్థ వద్ద రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలుకు కాలపరిమితి ఉంటుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15–30 రోజులు దాటకుండా క్లెయిమ్ దాఖలు చేసుకోవాలి.

రీయింబర్స్‌మెంట్‌కు కావాల్సిన డాక్యుమెంట్లు

డిశ్చార్జ్ సమ్మరీ, నగదు/కార్డు ద్వారా చెల్లింపులకు సంబంధించి రసీదులు, ల్యాబ్ రిపోర్ట్‌లు, వైద్యులు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్లు, ఎక్స్‌రే ఫిల్మ్‌లు, క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమ్మరీ.

ఏడాదిలో ఎన్ని క్లెయిమ్‌లు?

ఏడాదిలో ఎన్ని క్లెయిమ్‌లు అన్న దానితో సంబంధం లేకుండా, గరిష్ఠ బీమా కవరేజీ పరిధిలో ఎన్ని విడతలైనా పరిహారం పొందొచ్చు. కొన్ని బీమా సంస్థలు క్లెయిమ్‌ల సంఖ్య పరంగా పరిమితులు విధించొచ్చు. కనుక పాలసీ వర్డింగ్స్ డాక్యుమెంట్‌ను తప్పకుండా చదివి ఈ సందేహాన్ని నివృత్తి చేసుకోవాలి.

రెండు రకాల పాలసీలు


హెల్త్ ఇన్సూరెన్స్ సాధారణంగా రెండు రకాలు. ఇండెమ్నిటీ ఒక రకం అయితే, ఫిక్స్‌డ్ బెనిఫిట్‌తో కూడినవి రెండో రకం. ఇండెమ్నిటీ పాలసీలు ఆస్పత్రిలో చేరి తీసుకునే చికిత్సలతోపాటు.. ఎంపిక చేసిన డేకేర్ ప్రొసీజర్స్ (చికిత్స తర్వాత అదే రోజు విడుదలయ్యేవి)కు మాత్రమే కవరేజీ ఇస్తాయి. ఇక క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను ఫిక్స్‌డ్ బెనిఫిట్ పాలసీలుగా చెబుతారు. ఇందులో కేన్సర్, గుండె జబ్బులు, మూత్ర పిండాల వైఫల్యం, కాలేయ వైఫల్యం తదితర తీవ్ర వ్యాధుల్లో ఏదైనా నిర్ధారణ అయిన వెంటనే నిర్ణీత పరిహారాన్ని బీమా సంస్థలు ఒకే విడత చెల్లించేస్తాయి. కనుక క్లెయిమ్ విషయంలో ఈ రెండింటి పరంగా గందరగోళం అక్కర్లేదు. ఇండెమ్నిటీ ప్లాన్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ రెండూ కలిగిన వారు.. ఏదైనా తీవ్ర వ్యాధి (క్రిటికల్ ఇల్‌నెస్) బారిన పడినప్పుడు ఇండెమ్నిటీ ప్లాన్ కింద కవరేజీ పొందొచ్చు. అలాగే, వ్యాధి నిర్ధారణ పత్రాలతో క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ కింద క్లెయిమ్ దాఖలు చేసి పూర్తి ప్రయోజనాన్ని అందుకోవచ్చు. దీనివల్ల ఆయా వ్యాధులకు సంబంధించి ఎదురయ్యే భారీ వ్యయాలను తట్టుకోవడం సాధ్యపడుతుంది.

టాపప్, సూపర్ టాపప్ ప్లాన్లు

ఇక హెల్త్ ఇన్సూరెన్స్‌లో టాపప్, సూపర్ టాపప్ ప్లాన్లు కూడా ఉంటాయి. ఇందులో సూపర్ టాపప్ ఎక్కువ అనుకూలం. ఇవి డిడక్షన్ క్లాజుతో వస్తాయి. ఉదాహరణకు రూ.5 లక్షల కవరేజీతో హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకున్న వారు, రూ.50 లక్షల సూపర్ టాపప్ ప్లాన్ కూడా జోడించుకున్నారని అనుకుందాం. ఆస్పత్రి బిల్లు మొదటి రూ.5 లక్షలు దాటిన తర్వాతే సూపర్ టాపప్ ప్లాన్ కింద కవరేజీ పొందగలరు. రూ.50 లక్షల వరకు బిల్లు ఎంత వచ్చినా సరే.. మొదటి రూ.5 లక్షలకు సూపర్ టాపప్‌లో పరిహారం రాదు. దాన్ని సొంతంగా భరించడం లేదంటే బేస్ ప్లాన్ నుంచి కవరేజీ తీసుకోవాల్సి ఉంటుంది. నేరుగా రూ.50 లక్షల బేస్ ఇండెమ్నిటీ ప్లాన్‌తో పోల్చితే.. రూ.5–10 లక్షల మేర బేస్ ప్లాన్ తీసుకుని, 50 లక్షలకు సూపర్ టాపప్ తీసుకోవడం వల్ల ప్రీమియం భారం కొంత తగ్గుతుంది.



డెట్ ఫండ్సా.. ఫిక్స్‌డ్ డిపాజిట్లా..?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

డెట్ మ్యూచువల్ ఫండ్స్‌తో పోలిస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు సురక్షితంగానే ఉంటాయా? డెట్ ఫండ్స్‌లో ఉండే అదనపు ప్రయోజనాలు ఏమిటి?

– రాంబాబు, వైజాగ్

చెప్పాలంటే ఒక రకంగా రెండూ సురక్షితమైనవే. అయితే, డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు ఉండటం వల్ల డెట్ మ్యూచువల్ ఫండ్స్ మరికాస్త ఎక్కువగా సురక్షితమైనవిగా పరిగణిస్తారు. అంటే, దానర్థం స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో డిపాజిట్లు రిస్కులతో కూడుకున్నవని కాదు. ఈ బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ ఆజమాయిషీలో ఉంటాయి. నిర్దిష్టమైన ప్రమాణాలు పాటిస్తేనే వాటికి లైసెన్సులు లభిస్తాయి. వీటిలో రూ. 5 లక్షల వరకు డిపాజిట్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) నుంచి బీమా భద్రత కూడా ఉంటుంది. ఇక డెట్ ఫండ్స్ విషయానికొస్తే వాటిలోనూ ప్రయోజనాలు ఉంటాయి. అవేమిటంటే, డైవర్సిఫికేషన్: మీరు ఒక రూ. 5 లక్షలు డెట్ ఫండ్‌లో పెట్టారనుకోండి. దీన్ని సదరు ఫండ్ 50 వేర్వేరు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఒకవేళ ఏదో ఒక సాధనం డిఫాల్ట్ అయినా కూడా మీ పోర్ట్‌ఫోలియోపై నామమాత్రంగా 3–4 శాతం మేర మాత్రమే ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. రెండోది, ట్యాక్స్ ప్రయోజనాలు: ఫిక్స్‌డ్ డిపాజిట్లకు భిన్నంగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌ను అమ్మినప్పుడు మాత్రమే పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎఫ్‌డీలపై పోగుపడిన వడ్డీపై ఏటా ట్యాక్స్ వర్తిస్తుంది. మూడోది.. లిక్విడిటీ: డెట్ ఫండ్స్‌లో మరింత ఎక్కువ లిక్విడిటీ ఉంటుంది. ఎఫ్‌డీల్లాగా నిర్దిష్ట వ్యవధికి కమిట్ కావాల్సిన అవసరం ఉండదు. ముందస్తుగా విత్‌డ్రా చేసుకుంటే పెనాల్టీని ఎదుర్కొనాల్సిన అవసరం లేకుండా మీ పెట్టుబడులను ఎప్పుడైనా విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, డెట్ ఫండ్స్‌తో రాబడులకు గ్యారంటీ అంటూ ఉండదు. కానీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై రాబడికి మాత్రం హామీ ఉంటుంది.

నేను యాక్సిస్ మిడ్ క్యాప్, యాక్సిస్ బ్లూచిప్, మిరే అసెట్ ట్యాక్స్ సేవర్‌లో గత 1–2 ఏళ్ల నుంచి ఇన్వెస్ట్ చేస్తున్నాను. రాబడులు కూడా సంతృప్తికరంగానే ఉన్నాయి. కానీ, కొన్ని కంపెనీలు 100–200 శాతం దాకా రాబడులు ఇచ్చాయి. ఇలాంటప్పుడు అధిక రాబడుల కోసం ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలా లేదా నేరుగా షేర్లలోనే ఇన్వెస్ట్ చేయాలా?

– సురేష్, కరీంనగర్

ఈ మూడు ఫండ్స్ కూడా మంచివే. అయితే, మీకు రావాల్సిన రాబడుల్లో మూడింట రెండొంతుల వాటా యాక్సిస్ ఫండ్‌తో ముడిపడి ఉంది. ఒకవేళ ఈ ఫండ్ హౌస్ విషయంలో ఏవైనా తేడాలు వస్తే ఆ మేరకు మీ రాబడులపైనా ప్రభావం పడొచ్చు. కాబట్టి యాక్సిస్‌కి సంబంధించి ఏదో ఒకదాన్ని అట్టే పెట్టుకుని మీ పోర్ట్‌ఫోలియోలో మూడో ఫండ్ కోసం ఇతరత్రా ఏదైనా మరో ఫండ్‌హౌస్‌ను ఎంచుకుంటే డైవర్సిఫికేషన్ మెరుగ్గా ఉండవచ్చు. రిస్కులూ కొంత తగ్గవచ్చు. ఇక నేరుగా షేర్లలో ఇన్వెస్ట్ చేస్తే వచ్చే రాబడులను, ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడంతో పోల్చి చూడలేం. ఒకవేళ ఫండ్ పనితీరును చూడాలంటే దానికి సమానమైన ఇండెక్స్‌తో పోల్చి చూడాలి. ఉదాహరణకు మిడ్ క్యాప్ ఫండ్ పనితీరును మిడ్ క్యాప్ ఇండెక్స్‌తో పోల్చి చూడొచ్చు. మరోవైపు, పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలో డైవర్సిఫికేషన్ ముఖ్యం. మీరు ఏదో ఒకటో రెండో సంస్థల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తే సరిపోదు. వైవిధ్యాన్ని పాటించాలంటే కనీసం 10–20 కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల రాబడులు కొంత తగ్గొచ్చు కానీ రిస్కు కూడా తగ్గుతుంది. కచ్చితంగా 200 శాతం రాబడినిస్తుందనే కంపెనీ షేరును గుర్తించి, పట్టుకోవడమూ కష్టం. ఒకవేళ నిజంగానే ఏదైనా కంపెనీ 200 శాతం రిటర్ను ఇస్తోందంటే.. అది చాలా తక్కువ వ్యవధిలోనే ఏకంగా 60–70 శాతానికి పైగా పడిపోయి ఉండొచ్చు. రిటైల్ ఇన్వెస్టరుకు ఇలాంటి పతనాలు చాలా ఆందోళన కలిగిస్తాయి. డైవర్సిఫికేషన్ ప్రయోజనాల కోసం మ్యూచువల్ ఫండ్‌లను ఎందుకు ఎంచుకోవచ్చంటే, ఇవి ఏదో 1–2 కంపెనీల స్టాక్స్‌లో మాత్రమే ఇన్వెస్ట్ చేయడం కాకుండా కాస్త విస్తృతంగా ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్కులు తగ్గే అవకాశం ఉంటుంది.

ఫండ్ స్ట్రీట్

బరోడా బీఎన్‌పీ పారిబా మాన్యుఫాక్చరింగ్ ఫండ్

Baroda BNP PARIBAS MUTUAL FUND

దేశ తయారీ రంగ వృద్ధి అవకాశాలను ఇన్వెస్టర్లు అందిపుచ్చుకునేందుకు వీలు కల్పించేలా బరోడా బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్ కొత్తగా మాన్యుఫాక్చరింగ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో) జూన్ 24న ముగుస్తుంది. నేరుగా తయారీ కార్యకలాపాల్లో నిమగ్నమైన సంస్థలు, దిగుమతుల స్థానాన్ని భర్తీ చేసే లక్ష్యం గలవి, ఎగుమతులు చేసేందుకు ఏర్పడ్డవి, దేశీయంగా కొత్త తయారీ ప్లాంట్లలో ఇన్వెస్ట్ చేసేవి, కొత్త టెక్నాలజీ అభివృద్ధికి తోడ్పడేవి అయిన లిస్టెడ్ తయారీ సంస్థల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. దేశ జీడీపీలో తయారీ రంగ వాటాను 17 శాతం నుంచి 25 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ విభాగానికి గణనీయంగా వృద్ధి అవకాశాలు ఉన్నాయని బరోడా బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్ సీఈవో సురేష్ సోని తెలిపారు.

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ క్వాంట్ ఫండ్

Birla Sun Life Mutual Fund

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ కొత్తగా క్వాంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 24న ముగుస్తుంది. క్వాంట్ ఫండ్‌కి సంబంధించి సంస్థ స్వయంగా రూపొందించిన క్వాంటిటేటివ్ మోడల్ ఆధారంగా లార్జ్, మిడ్ క్యాప్ కేటగిరీ స్టాక్స్‌ను వివిధ ప్రమాణాల ప్రకారం వడబోస్తారు. చివరికి కొన్ని షేర్లను ఎంపిక చేసి, వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో ఇటు మనిషి అటు మెషిన్ పర్యవేక్షణలో ఉండటం వల్ల ఈ విధానంలో భావోద్వేగాల కారణంగా జరిగే తప్పిదాలకు ఆస్కారం తక్కువని, రిస్కు మేనేజ్‌మెంట్ మెరుగ్గా ఉంటుందని సంస్థ ఎండీ ఎ. బాలసుబ్రమణియన్ తెలిపారు.

సైయెంట్ డీఎల్ఎం | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 690 **టార్గెట్: రూ. 887**

ఎందుకంటే: ఐటీ కంపెనీ సైయెంట్ ఏర్పాటు చేసిన సైయెంట్ డీఎల్ఎం ప్రధానంగా డిజైన్ ఆధారిత తయారీ సొల్యూషన్లు అందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికం(క్యూ4)లో అంచనాలకు అనుగుణమైన ఫలితాలు ప్రకటించింది. వెరసి గతేడాది జనవరి–మార్చి (క్యూ4)లో మొత్తం ఆదాయం 30 శాతం జంప్‌చేసి రూ. 360 కోట్లను తాకింది. ఇందుకు 78 శాతం వార్షిక వృద్ధి సాధించిన రక్షణ రంగ విభాగం, 52 శాతం పురోగతి అందుకున్న ఏరోస్పేస్ బిజినెస్ ప్రధానంగా దోహదం చేశాయి. 26 శాతం ఎగసిన మెడికల్ విభాగం సైతం మద్దతిచ్చినప్పటికీ.. ఇండస్ట్రియల్ వెర్టికల్ 57 శాతం క్షీణతను చవిచూసింది. త్రైమాసికవారీగా (క్యూ3తో పోలిస్తే) 15 శాతం వెనకడుగు వేసింది. అయితే స్థూల మార్జిన్లు 0.3 శాతం బలపడి 23.9 శాతానికి చేరాయి. ఇందుకు ఆదాయ మిక్స్‌లో మార్పులు తోడ్పాటునిచ్చాయి. కానీ నిర్వహణ లాభ (ఇబిటా) మార్జిన్లు దాదాపు 1 శాతం నీరసించాయి. ప్రధానంగా టీమ్ నిర్మాణంపై పెట్టుబడులు ప్రభావం చూపాయి. కొత్త లోగో (కంపెనీ)లను జత కలుపుకోవడం, గ్లోబల్ సానుకూలతలు, విలువ జోడింపు సర్వీసుల పెంపు వంటి అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి. అధిక మార్జిన్ల విభాగంలో విస్తరణ, ఎగుమతుల వాటా పుంజుకోవడం తదితర అంశాలతో మార్జిన్లు మెరుగుపడనున్నాయి. ఐపీవో నిధులను కంపెనీ ఇకపై వినియోగించుకునేందుకు వీలుంది. ఈ నేపథ్యంలో రెండేళ్ల (2025–26) కాలానికి కంపెనీ ఆదాయం వార్షికంగా 31 శాతం, ఇబిటా 43 శాతం, నికర లాభం 60 శాతం చొప్పున వృద్ధి చెందగలవని భావిస్తున్నాం. ఇబిటా లాభ మార్జిన్లు 9.6 శాతం, 11.1 శాతం స్థాయిలో నమోదుకావచ్చని అంచనా.



ఎస్‌బీఐ లైఫ్ | బీఎన్‌పీ పారిబా | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,467 **టార్గెట్: రూ. 2,450**

ఎందుకంటే: బీమా రంగ కంపెనీ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ గతేడాది (2023–24) చివరి త్రైమాసికం (క్యూ4)లో యాజమాన్య అంచనాలకు అనుగుణమైన ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి (క్యూ4)లో 28.1 శాతం వీఎన్‌బీ మార్జిన్లు సాధించింది. త్రైమాసికవారీగా ఇవి దాదాపు యథాతథం కాగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 0.2 శాతం, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ 2.1 శాతం చొప్పున మార్జిన్లు నీరసించాయి. అయితే వార్షికంగా చూస్తే ఎస్‌బీఐ లైఫ్ మార్జిన్లు 2 శాతం క్షీణించాయి. ఇందుకు ప్రధానంగా యులిప్ వైపు ప్రొడక్టులలో మార్పులు చేపట్టడం ప్రభావం చూపింది. నాన్ పార్, రక్షణ మిక్స్ బిజినెస్ వెనకడుగు వేయడం కూడా మార్జిన్ల క్షీణతకు కారణమైంది. ఇక ఏపీఈ వార్షికంగా 17 శాతం వృద్ధిని అందుకోవడం.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నమోదు చేసిన 8 శాతం క్షీణతతో పోలిస్తే పటిష్ఠమనే చెప్పవచ్చు. అధిక బేస్ నేపథ్యంలోనూ ఐపీఆర్‌యూ 9.6 శాతం పురోగతి సాధించడం సైతం ప్రోత్సాహకరమే. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో ఏపీఈ గతేడాది స్థాయిలో అంటే 17 శాతం వార్షిక వృద్ధిని అందుకోగలదని యాజమాన్యం అంచనా వేస్తోంది. గతేడాది వీఎన్‌బీ 9.5 శాతం వార్షిక వృద్ధి మా అంచనా 13 శాతాని కంటే బాగా తక్కువ కాగా.. ఇందుకు 0.9 శాతం మార్జిన్ల క్షీణత, అధిక సింగిల్ ప్రీమియం యాన్యుటీ మిక్స్ ప్రభావం చూపాయి. అయితే ఈ ఏడాది మార్జిన్లు బలపడగలవని కంపెనీ భావిస్తోంది. యులిప్‌ల నుంచి వ్యక్తిగత రక్షణ (ప్రొటక్షన్), నాన్‌పార్ వైపు దృష్టి పెట్టడం కలసిరాగలదని పేర్కొంటోంది. నియంత్రణ సంబంధిత నిబంధనల్లో సవరణలు, యాజమాన్య నిర్మాణంలో కంపెనీ పనితీరుపై ప్రభావం చూపగల మార్పులు వంటి అంశాలు కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	480–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

కనిష్ట శ్లాబు వారికి ఐటీ ఊరట కల్పించాలి

- రాబోయే బడ్జెట్‌లో పరిశీలించాలి...
- కేంద్రానికి సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం అధికంగా ఉన్న నేపథ్యంలో తక్కువ స్థాయి శ్లాబ్‌లో ఉన్న ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పించే అంశాన్ని బడ్జెట్‌లో పరిశీలించాలని పరిశ్రమల సమాఖ్య సీఐఐకి కొత్త ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సంజీవ్ పురి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. భూ, కార్మిక, విద్యుత్, వ్యవసాయ రంగ సంస్కరణలన్నింటిని అమలు చేసేందుకు కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధన కోసం సంస్థాగత వేదికను ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడో దఫా ప్రభుత్వం సంస్కరణలను అమలు చేయడానికి సంకీర్ణ రాజకీయాలనేవి అడ్డంకులు కాబోవని భావిస్తున్నట్లు పురి చెప్పారు. ఇప్పటికే రెండు విడతల్లో విధానాలను విజయవంతంగా అమలు చేయడం, దేశ ఎకానమీ మెరుగ్గా రాణిస్తుండటం వంటి అంశాలు తదుపరి సంస్కరణలను వేగవంతం చేసేందుకు దన్నుగా ఉండగలవని ఆయన పేర్కొన్నారు.



ట్రాఫిక్‌పై డ్రోన్ కన్ను

సాక్షి, హైదరాబాద్: నిత్యం బిజీగా ఉండే రోడ్డు.. మధ్యలో ఓ కారు మొరాయించి నిలిచిపోయింది. దాంతో ట్రాఫిక్ జామ్ మొదలైంది. ఆ ప్రాంతానికి పైన గాల్లో ఎగురుతున్న 'డ్రోన్'ద్వారా పోలీసులు ఇది చూశారు. వెంటనే ట్రాఫిక్ రిలీఫ్ వ్యాన్ వచ్చి, మొరాయించిన కారును అక్కడి నుంచి తరలించింది. వాహనాలన్నీ సాఫీగా ముందుకు సాగిపోయాయి. అంటే భారీగా ట్రాఫిక్ జామ్ కాకముందే.. సమస్య పరిష్కారమైపోయింది. ఇదేదో చాలా బాగుంది కదా. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ చిక్కులకు ఇలా సింపుల్‌గా చెక్ పడిపోనుంది.

తొలుత సైబరాబాద్ పరిధిలో..

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో దీనికి సంబంధించి 'థర్డ్ ఐ ట్రాఫిక్ మానిటరింగ్ డ్రోన్'అందుబాటులోకి వచ్చేసింది. పైలట్ ప్రాజెక్టు కింద ఐకియా, దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి, హఫీజ్‌పేట, హైటెక్ సిటీ, మాదాపూర్, రాయదుర్గం తదితర ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఆదివారం ఈ డ్రోన్‌ను వినియోగించారు. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు, వాహనాల రద్దీ ఎక్కడ ఎక్కువగా ఉంది? జంక్షన్ల వద్ద వాహనాల వేగం ఎలా ఉంది? ఎక్కడైనా నీరు నిలిచి ఉందా? అనే అంశాలతోపాటు రోడ్డు ప్రమాదాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. ఏదైనా సమస్య ఏర్పడితే ట్రాఫిక్ పోలీసు బృందాలు వెంటనే స్పందించి పరిష్కరించవచ్చు. వాహనాలు సులభంగా, వేగంగా ప్రయాణించేందుకు వీలవుతుంది.

ఎలా పనిచేస్తాయంటే..?

థర్మల్ ఇమేజింగ్ టెక్నాలజీ, రేడియో ఫ్రీక్వెన్సీల సాయంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డు మీద ట్రాఫిక్ జామ్‌లు, వాహనాల రద్దీ, కదలికలను చిత్రీకరిస్తుంది. రియల్ టైమ్‌లో కంట్రోల్ సెంటర్‌కు పంపిస్తుంది. కంట్రోల్ సెంటర్ సిబ్బంది ట్రాఫిక్ పరిస్థితి, రద్దీని విశ్లేషించి, ఏదైనా సమస్య ఉంటే గమనించి క్షేత్రస్థాయిలోని ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇస్తారు. తద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారు. గాలిలో ఏకధాటిగా 45 నిమిషాల పాటు తిరగగలిగే సామర్థ్యమున్న ఈ డ్రోన్ 15 కిలోమీటర్ల దూరం వరకు హెచ్‌డీ క్వాలిటీ వీడియోను పంపించగలదు.

- వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలపై లైవ్ ఫోకస్
- వానాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల గుర్తింపు కూడా..
- ఈ పరిశీలన ఆధారంగా వాహనాల మళ్లింపు, సిగ్నల్ ఆపరేటింగ్, ఇతర చర్యలకు వీలు
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో డ్రోన్ కెమెరాల అనుసంధానం
- అందుబాటులోకి తెచ్చిన సైబరాబాద్ పోలీసులు
- తొలుత ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో వినియోగం

ఈ డ్రోన్ సైబరాబాద్ కమిషనరేట్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటుంది. భూమి ఉపరితలం నుంచి 150–170 మీటర్ల ఎత్తులో ఎగురుతుంది. ఈ డ్రోన్‌కు ఉండే మూడు అత్యాధునిక కెమెరాలతో,

ఇతర కమిషనరేట్లలో..

సైబరాబాద్ పోలీసుల ట్రాఫిక్ నిర్వహణ కోసం డ్రోన్లను వినియోగించాలని గతంలోనూ ఆలోచన చేశారు. అప్పుడప్పుడు డ్రోన్లను అద్దెకు తీసుకొచ్చి వినియోగించేవారు. తాజాగా కార్పొరేట్ సామాజిక సేవ (సీఎస్ఆర్) కింద 'సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ)'నిధులతో సొంతంగా ఒక డ్రోన్‌ను కొనుగోలు చేశారు. దీని ఫలితాలను బట్టి మరిన్ని డ్రోన్లను సమకూర్చుకోనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో వినాయక నిమజ్జనం, హనుమాన్ జయంతి, బోనాలు, శ్రీరామనవమి, షాబ్-ఈ-బరాత్ వంటి ర్యాలీలు, జాతరల సమయంలో డ్రోన్లను వినియోగిస్తూ నిఘా పెడుతున్నారు. ఇకపై ట్రాఫిక్ పర్యవేక్షణ కోసమూ వినియోగించనున్నారు. హైదరాబాద్‌లో డ్రోన్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రత్యేకంగా 'డీ-కెమో'విభాగం ఉంది. దీనికి డీసీపీ/ఏసీపీ ర్యాంకు అధికారి హెడ్‌గా ఉంటారు.

'ట్రాఫిక్'కు వాడే డ్రోన్ ప్రత్యేకతలు ఇవీ:

డ్రోన్ పేరు:	మావిక్ 3 ప్రో
ధర:	రూ.5.5 లక్షలు
బరువు:	ఒక కిలో
బ్యాటరీ:	5 వేల ఎంఏహెచ్. సుమారు 4 గంటల బ్యాకప్
గరిష్ట ఎత్తు:	భూమి ఉపరితలం నుంచి 400 మీటర్లు
విజిబులిటీ:	5 కిలోమీటర్ల దూరం వరకు
గరిష్ట వేగం:	సెకన్‌కు 8 మీటర్లు. గాలి, వర్షం లేకపోతే వర్టికల్‌గా సెకన్‌కు 21 మీటర్ల వేగంతో ఎగరగలదు.
స్టోరేజ్ సామర్థ్యం:	8 జీబీ నుంచి 1 టీబీ వరకు ఉంటుంది.

ట్రాఫిక్ పోలీసులకు శిక్షణ



డ్రోన్ ఆపరేషన్ ప్రాథమిక దృష్టి ముఖ్యంగా ఐటీ కారిడార్ మీద ఉంటుంది. ఇక్కడ అధిక ట్రాఫిక్ ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడంలో ట్రాఫిక్ పోలీసులకు డ్రోన్ సాయం అందిస్తుంది. ఈ మేరకు డ్రోన్ వినియోగంపై ట్రాఫిక్ పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నాం.

– అవినాష్ మహంతి,
పోలీస్ కమిషనర్, సైబరాబాద్

సీబీఆర్‌టీ పద్ధతిలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అర్హత పరీక్షలు

ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహించనున్న టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: సంక్షేమశాఖల్లో ఖాళీగా ఉన్న 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూఓ) ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పష్టం చేసింది. ఈనెల 24 నుంచి 29 వరకు వరుసగా వివిధ షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను నార్మలైజేషన్ విధానంలో వెల్లడించనుంది. ఈ ఉద్యోగాల భర్తీకి 2022 డిసెంబర్ 23న కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. వివిధ కారణాలతో ఈ పరీక్షల నిర్వహణ వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. పరీక్షకు మూడురోజుల ముందు అభ్యర్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ వెల్లడించారు. పేపర్, పేపర్‌కోడ్‌లతో సహా పరీక్షల తేదీలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు వివరించారు.

6 నుంచి పీజీ ప్రవేశ పరీక్షలు

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 6 నుంచి 15 వరకు పరీక్షలు కొనసాగుతాయని టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. రేపు(18న) పరీక్షల టైంటేబుల్‌ను వెల్లడించనున్నట్లు చెప్పారు. అపరాధ రుసుము లేకుండా దరఖాస్తుల స్వీకరణ గడువు నేటి(సోమవారం)తో ముగియనున్నట్లు పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 25, రూ.2000 అపరాధ రుసుముతో 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సైబర్ బాధితులకు ఊరట


సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు తిరిగి ఇప్పిస్తుండటంతో బాధితులు ఊరట పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన సైబర్ నేరాలకు సంబంధించి టీజీసీఎస్‌బీ తక్షణం స్పందిస్తూ, బాధితుల సొమ్ము సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి జూన్ 8 వరకు రెండు మెగా లోక్‌అదాలత్‌లలో కలిపి మొత్తం రూ.31.29 కోట్లు రిఫండ్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాధితులకు ఆలస్యమవుతోందనే...

తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్త సహకారంతో ఇది సాధ్యమైందని శిఖాగోయెల్ తెలిపారు. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు చేరడంలో ఆలస్యం అవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని లోక్‌అదాలత్‌ల ద్వారా వీటిని త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు శిఖాగోయెల్ తెలిపారు. ఇందుకోసం ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతోపాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ)లను తయారు చేసి ఫిబ్రవరి 20న అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు తెలిపారు. ఇలా 5,142 పిటిషన్లు కోర్టులో నమోదు చేయగా మొత్తం రూ.31.29 కోట్లు బాధితులకు రిఫండ్ చేసేందుకు ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. సైబర్ బాధితులకు సైతం సకాలంలో వారి సొమ్ము తిరిగి వస్తుండటంతో ఊరట లభిస్తోందని శిఖాగోయెల్ తెలిపారు.

నాలుగు నెలల్లో రూ.31.29 కోట్ల రిఫండ్

- 5,142 కేసులలో బాధితులకు డబ్బు అందజేసేందుకు కోర్టు ఉత్తర్వులు
- టీజీసైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్



20 నుంచి గ్రూప్‌-4 అభ్యర్థుల

సర్టిఫికెట్ల పరిశీలన

రెండుచోట్ల పరిశీలన కేంద్రాల ఏర్పాటు : టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌–4 ఉద్యోగాలకు ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 20 నుంచి ఆగస్టు 21 వరకు నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ధ్రువపత్రాల పరిశీలన లోపే అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు ఎంట్రీ చేసుకోవాలని కమిషన్ సూచించింది. తేదీ, వెరిఫికేషన్ సెంటర్ వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ప్రాథమిక ఎంపిక జాబితాలోని అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యేటప్పుడు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు చెక్‌లిస్టు, రెండుసెట్లు అప్లికేషన్ పీడీఎఫ్ ప్రింట్‌అవుట్, రెండుసెట్లు అటెస్టేషన్ ఫామ్, సంబంధిత పత్రాలన్నీ తీసుకురావాలని కమిషన్ వెల్లడించింది. ఆగస్టు 24, 27, 31తేదీల్లో గైర్హాజరీలు, పెండింగ్ సర్టిఫికెట్ల సమర్పణ కోసం వెరిఫికేషన్ సెంటర్లు పనిచేస్తాయని కమిషన్ తెలిపింది.



భళా బాలికలు

- 108 మంది చిన్నారుల నృత్య ప్రదర్శన
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

జనగామ: జనగామ జిల్లా కేంద్రం బతుకమ్మకుంట ప్రాంతంలో మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యాన 108 మంది చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారు. ఈ సందర్భంగా భజగోవిందం శ్లోకాలు, మెడిటేషన్‌తో ఆకట్టుకున్నారు. మైత్రేయ కూచిపూడి కళా క్షేత్రం ఆధ్వర్యంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బింగి నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో మూడు విభాగాల్లో 15 నిమిషాల వ్యవధిలో ప్రదర్శన నిర్వహించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తొలిసారి చోటు సంపాదించుకున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు పటేల్ పేరు పెట్టాలి

బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'రీజినల్ రింగ్ రోడ్డు' (ఆర్‌ఆర్‌ఆర్)కు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టాలని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నిజాం పాలన నుంచి పూర్వపు హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి కల్పించడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూ సేకరణ పూర్తి చేసి వచ్చే అక్టోబర్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకోవాలని గూడూరు నారాయణరెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.